ఆంధ్రపత్రిక
సచిత్ర వారపత్రిక



వెల
4 అణాలు

ANDHRA PATRIKA
ILLUSTRATED WEEKLY

సంపుటము 42 సంచిక 11
నవంబరు 9 1949


వార్తా చిత్రాల



భారత ప్రధానమంత్రి పండిట్ నెహ్రూ నారిస్ డామును దర్శించినపుడు టెనెస్సీవాలీ ప్రధాన ఇంజనీరు సి. ఇ. బ్లీగారు టెనెస్సీనదిపైగల 18 డాముల వివరములను మాపు సహాయంతో పండిట్ నెహ్రూకు వివరిస్తున్నారు. ఫోటో ఐ. ఎన్. పి.



ఇండియాలో స్వాతంత్ర్యదినమున రెండేండ్లక్రిందట పుట్టిన కుక్కపిల్లను, ప్రధాని నెహ్రూగారికి అట్టావా విందులో ఒకరు చూపుట.



అక్టోబరు 29న నాక్స్‌విల్లీలో పండిట్ నెహ్రూ నారిస్ డామ్‌నుగురించి టెనెస్సీ జనరల్ మేనేజర్ డార్జి గ్రాంటుతో సంభాషిస్తున్న దృశ్యం. ఐ. ఎన్. పి.



హైడ్‌పార్కులో రూజ్‌వెల్టు సమాధిపై, పండిట్ నెహ్రూ, గౌరవ పురస్సరంగా పుష్పగుచ్ఛము నుంచుచున్నారు.



అక్టోబర్ 24-వ తేదీన భారత ప్రధానమంత్రి కెనడా శాసనసభల సమావేశంలో ఉపన్యసించారు. ఉపన్యాసానంతరం సభాభవనంనుండి పండిట్ నెహ్రూ కెనడా ప్రధాని సెంట్ లారెంట్‌తో బయటికి వచ్చివేస్తున్న దృశ్యం.

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా రు. 12-0-0

విడిపత్రిక అణాలు 0-4-0

ప్రతిబుధవారమున ప్రకటింపబడును

ఒరు లేయవి యొనరించిన నరవర, యప్రియము తన మనంబున కగు దా

నొరులకు నవి సేయకునికి పరాయణము పరమధర్మ పథముల కెల్లన్. (మహాభారతము)

సంపుటము 42

సంచిక 11

Founder : K. NAGESWARA RAO

విరోధి సంవత్సర కార్తిక బహుళ తదియ బుధవారము



'మెయిడ్ ఆఫ్‌ది మిస్టు' నావపైనుండి నయాగ్రా జలపాతాన్ని చూస్తున్న పండిట్ నెహ్రూ

ఆంధ్రపత్రిక

1949–వ సం॥ నవంబరునెల 9–వ తేది బుధవారము

పునరావాస కార్యక్రమము

ఎవరు ఎంతచేసినప్పటికిని మన కోస్తాజిల్లాలకు తుపానువలన, చిల్లర నదుల వెల్లువవలన కల్గిన నష్టము తీరుటకు కొన్నేళ్లు పట్టగలదు. పశ్చిమ, తూర్పుగోదావరి జిల్లాలకు కల్గిన నష్టము అపారము.

పశ్చిమ గోదావరి జిల్లాలో పంట నూటికి 95 వంతులు పూర్తిగ పోయినట్లు తెలియుచున్నది. తూర్పుగోదావరిజిల్లాకు కల్గిన నష్టము ఇదే ప్రమాణములో నున్నట్లు కాకినాడనుండి మా విలేఖరి పంపిన వివరములనుబట్టి ఊహింపవచ్చును. జిల్లాప్రజలకు జీవనాధారమైన కొబ్బరితోటలు, వరిచేలు తుపాను తగ్గినతరువాత నాలుగు రోజులకు కూడ ఒక మహాసముద్రమువలె నున్నది. ఆ జిల్లాలో పైర్లు పూర్తిగ పోయినవనే చెప్పవచ్చును. ఉత్తరవిశాఖజిల్లాకు ఆరు సంవత్సరముల క్రితము వచ్చిన తుపాన్ వలన కలిగిన నష్టమును మించి ఈ తుపానువలన, నాగావళి, వంశధార నదులవరదవల్ల కలిగినట్లు ప్రకటితమైన వార్తలవల్ల తెలియుచున్నది.

కృష్ణా, గుంటూరు జిల్లాలలో మాత్రమే నష్టపడిన ప్రాంతములకు వెళ్లి వివరములను సేకరించుట కొంతవరకు సాధ్యమైనది. కృష్ణాజిల్లాలో పర్యటించివచ్చిన రాష్ట్ర కాంగ్రెసు అధ్యక్షుడు ఆచార్య రంగాగారు ఒక్క కృష్ణాజిల్లాలో మాత్రమే ఈ తుపాను, బుడమేరువరదవల్ల 500 మంది మరణించియుందురని, ఆస్తికి కలిగిన నష్టము 8 కోట్ల రూపాయలకు పైగ నుండునని ప్రకటించిరి. ఇది కేవలము ఉజ్జాయింపు అంచనా అయినను నష్టము, వివరములు తెలిసినకొద్ది ఇంతకంటె ఎక్కువగునే గాని తగ్గదు. ఒక్క మచిలీపట్నమునందే 7000 ఇండ్లు కూలిపోయిన, జిల్లా అంతట 85,000 ఇండ్లు కూలిపోయియుండునను రంగాగారి అంచనా అతిశయోక్తియని యనుటకు వీలులేదు.

ఈ విధముగ ఇతరజిల్లాలనుండి వివరములను సేకరించిన ప్రాణములకు, ఆస్తికి, పంటలకు కల్గిన నష్టమెట్లున్నను కొన్నిలక్షల ప్రజలు నిరాశ్రితులు, నిరాధారులు, అయియుందురని భావింపవలసియుండును. ఇంతమందికి తిరిగి జీవనాధారమును, నివాసములను కల్పించుట సులభమగు పని గాదు. వీరి పునరావాససమస్యతోబాటు, ఆచార్య రంగాగారు హెచ్చరించినట్లు, వీరి ఆరోగ్యమును రక్షించుట, అంటువ్యాధుల ప్రజ్వలనమును నివారించుట వెన్వెంటనే జరుగవలసియున్నది.

కృష్ణాజిల్లాలో తుపానుకు గురియైన ప్రాంతములలో పర్యటించి పరిస్థితులను తెలుసుకొని వచ్చిన స్థానిక స్వపరిపాలనాశాఖామంత్రి శ్రీ చంద్రమౌళిగారు వర్ణించిన చిత్రము హృదయవిదారకముగ నున్నది. "జాతీయ విపత్తు" అని తుపానునష్టముపై తమ యభిప్రాయమును తెలిపిరి. రాష్ట్రమునందే గాక రాజధానియందును వరిపంటకు ప్రసిద్ధికెక్కిన గోదావరి, కృష్ణా డెల్టా యంతయు పూర్తిగ నష్టపడినది. ఇందువలన రాష్ట్రఆహారస్థితి ప్రమాదకరము కాగలదు. కనుక కోస్తా జిల్లా ప్రజల పునరావాసము దీర్ఘదృష్టితో జరుగవలసియున్నది. మొదటి పంట నీరుపాలైనను, రెండవపంటకు పూర్తి సౌకర్యములను కల్గింపవలసినదిగ రైతులు కోరినట్లు శ్రీ చంద్రమౌళిగారు ప్రకటించిరి. తక్కావీఋణములు ప్రభుత్వమునకు వెంటనే స్ఫురించు సహాయకమార్గము. కాని ప్రజల ప్రస్తుతస్థితిని గమనించిన వారు ఈ ఋణములను తీర్చుకొనగల స్థితిని మరొక దశాబ్దమువరకు పొందలేరని స్పష్టమగును.

సహాయకకార్యక్రమముల నిర్వహించుటకు, పునరావాసకార్యములను కొనసాగించుటకు రాష్ట్రకాంగ్రెసు అధ్యక్షు డొకపథకమును సూచించియుండెను. అధికార, అనధికార సంస్థలు వెంటనే ఈ కార్యక్రమమునకు పూనుకొనవలసియున్నది. లోగడ మేము హెచ్చరించినట్లు ఈ కార్యక్రమ నిర్వహణయందు జాప్యము ఎంతమాత్రము క్షంతవ్యము గాదు. రాష్ట్ర గవర్నరు ప్రారంభించిన సహాయనిధికి ప్రజలు విరివిగా విరాళము లొసగి ఈ కార్యక్రమనిర్వహణకు దోహదము చేయవలసియున్నది.

డా॥ కుమారప్ప కమిటీ సూచనలు

జమీందారీ విధానము రద్దు అయిన అనంతరము భూమి అమరకపు విధానమును ఎట్లు సవరింపవలెనో విచారణ జరిపి సూచనలు చేయుటకు డాక్టరు రాజేంద్రప్రసాదుగారు కాంగ్రెస్ అధ్యక్షుడుగ నున్నపుడు నియమింపబడిన ఉపసంఘమువారు తయారుచేసిన నివేదిక విప్లవాత్మకమైన దనుటకు సందేహము లేదు. కాని ప్రధానముగ వ్యవసాయ దేశమైన మన దేశమునకు, భూస్వామ్యమును తరతరములుగ అనుభవించుచున్న మన దేశమునకు ఈ సంస్కరణలు ఎంతవరకు అంగీకారముగ నుండగల వనునది సందేహాస్పదము. భూమిఅమరకపు పద్ధతుల పూర్తిపరిజ్ఞానము కలిగి, రైతాంగ సమస్యలను పూర్తిగ అవగతము చేసుకొనిన మద్రాసు మాజీప్రధాని శ్రీ రామస్వామి రెడ్డియార్, ఆంధ్ర కాంగ్రెసు అధ్యక్షుడు ఆచార్య రంగాగారలు ఈ సంఘమునందలి ఇతర సభ్యుల యభిప్రాయముతో నేకీభవింపక పోవుటనుబట్టియే కుమారప్పసంఘ సంస్కరణలు దేశవ్యావసాయిక ఆర్థిక సమస్యల పరిష్కారమునకు తోడ్పడవని భావింపవలసియుండును.

ఉత్పత్తి వృద్ధికావలెనన్న, పంటదారులకు భూమిపై సంపూర్ణ స్వామ్యము ఉండవలె నను వాదము సహేతుకమే. కాని దేశమునందు ప్రస్తుతము వ్యవసాయము జరుగుచున్న పద్ధతిని గమనించిన, తమ భూమిని కౌలుకుఇచ్చినప్పటికిని, స్వంతదారులు తమ భూమివిషయమై ఎట్టి శ్రద్ధతీసుకొనక కాలక్షేపము చేయుచుండి రనుటకు వీలు లేదు. మరమ్మతు లవసరమైనపుడు ఆ ఖర్చులను భరించుటే గాక, అట్టి మరమ్మతు పనులను స్వంతదారే స్వయముగ నిర్వహించుటగలదు. కనుక కేవలము స్వంతముగ సాగుచేయుటలేదను నెపమున తరతరాలుగ వచ్చుచున్న జిరాయితీ హక్కును ఇప్పుడు తొలగించుట తీవ్ర అసంతృప్తికే దారితీయునేగాని అసలు సమస్యాపరిష్కారమునకు ఉపయోగపడదు.

అట్లే ఆరు సంవత్సరములపాటు కౌలుదారుపరముగ నున్న భూమిపై శాశ్వత హక్కు అతనికే సంక్రమించు నను సూచనకూడ ప్రమాదభరితమైనది. లోగడ భూమిఅమరకపు పద్ధతుల సంస్కరణల విషయమై వెలువడిన సూచనలు ఈ కౌలుకాలము దీర్ఘముగ నుండునట్లు చేయుట యవసరమని ప్రకటించెను. కొందరా ప్రకారముగ పది సంవత్సరములకు తమ భూమిని కౌలుకిచ్చి ఫలసాయములో కొంతభాగమును ప్రతిఫలముగ పొందుటకు లిఖితపూర్వక ఏర్పాట్లు చేసుకొనియుండిరి. కుమారప్ప కమిటీవారి సూచనలు అమలుకు వచ్చిన ఇట్టి ఏర్పాట్లు చేసుకొని తమ భూమిని కౌలుకు ఇచ్చినవారందరు తమ హక్కులను కోల్పోవలసియుండును.

వ్యవసాయసంస్కరణలను తలపెట్టునపుడు ప్రస్తుతపరిస్థితులనే గాక, ఈ సంస్కరణలను అమలుచేయుట వలన రాగలపరిస్థితులను గ్రహింపవలసియుండును. ఇప్పుడీసంస్కరణలు కాంగ్రెస్ కార్యవర్గవిచారణలో నున్నవి. కార్యవర్గము, ప్రభుత్వమూకూడ ఈ కమిటీసిఫార్సులపై అంత్యనిర్ణయము చేయుటకు పూర్వము ప్రజాభిప్రాయమును తెలుసుకొనుట యవసరము.

ముఖచిత్రం

'విశ్రాంతి'

ఛాయాచిత్రకారుడు:—

ఆర్. కృష్ణన్ మద్రాసు

సర్దార్ పటేల్ సందేశం

అఖండ భారతనిర్మాత, స్థితప్రజ్ఞుడు, విజయుడు, సర్దార్ వల్లభాయ్ పటేల్ 74 వ జన్మదినోత్సవము దేశమంతట వైభవోపేతముగ, అమితోత్సాహముతో జరుగుట వారి ప్రతిభావిశేషములకు సాక్షి గాక, వారి నాయకత్వమునందు భారత ప్రజానీకమునకు గల అచంచలవిశ్వాసమునకు, అపార భక్తి గౌరవములకు నిదర్శనము అని చెప్పవచ్చును. స్వాతంత్ర్యసమర నిర్వహణకాలమున మహాత్ముడు భారత ప్రజాశక్తిని ఎట్లు సంఘటితపరచి, భారతీయుల నందరిని ఎట్లు కార్యోన్ముఖుల చేసెనో, భారతదేశము స్వాతంత్ర్యమును పొందిన అనంతరము సర్దార్ పటేల్ భారతప్రజల స్వధర్మనిరతుల చేసి స్వాతంత్ర్యమును స్థిరపరచి అఖండభారతదేశమునకు రూపురేఖలు దిద్దెను. మరొకరికి సాధ్యపడని మహాకార్యమును రెండు సంవత్సరములలో అఖిలప్రపంచమునకు ఆదర్శప్రాయమైనరీతిని సాధించెను. మహాత్ముడు పారతంత్ర్యమునుండి ప్రజలను విముక్తుల జేసెను. సర్దార్ పటేల్ స్వతంత్రప్రజల సంఘటితపరచి సాంఘిక పారతంత్ర్యమునుండి విముక్తిచేసెను.

శాంతిభద్రతల సంరక్షణ ఎంత అసాధ్యమైనదో పంజాబు, బెంగాల్ దురంతములు దిఙ్మాత్రముగ నైనను సూచింపకలిగినవి. 1947 ఆగస్టు 15 కు పూర్వము బ్రిటిష్ ప్రభుత్వము తన


అపారసైనికబలమును, రక్షకభటదళమును ప్రయోగించికూడ దేశవ్యాప్త సంక్షోభమును నివారింప లేకపోయెను. సర్దార్ పటేల్ బ్రిటన్ ధ్వంసము చేసిపోయిన సైనికబలముతో ఇంతవరకు దేశశాంతిని కాపాడగలిగెను. యావత్తు ప్రపంచమునకు దిగ్భ్రమ కలుగునట్లు హైదరాబాదుసమస్యను పరిష్కరించెను. ఆయన తన ప్రసంగములవలన గాక, తను సాధించిన మహత్కార్యములవలన భారతప్రజాహృదయములను ఆకర్షించెను. ఎట్టి క్లిష్టసమస్యలనైనను ఎదుర్కొనుటకు తగిన ధైర్యము నొసగెను. కాంగ్రెస్‌అధ్యక్షుడు డాక్టర్ పట్టాభిసీతారామయ్యగారు ప్రకటించినట్లు "పంచపాండవులందరిలోని ప్రతిభావిశేషములు సర్దార్ పటేల్‌నందు మూర్తీభవించి యున్నవి."

న్యూఢిల్లీలో తనను అభినందించుటకు జరిగిన మహాసభలో సర్దార్ పటేల్ చేసిన గంభీరప్రసంగము వారి యాందోళననే గాక, మన కర్తవ్యమునుకూడ వ్యక్తము చేయుచున్నది. దేశము రాజకీయసంక్షోభమునుండి గట్టెక్కెను. కాని ఆర్థిక సంక్షోభము దేశరాజకీయస్వాతంత్ర్యమునకే ముప్పు తేగల స్థితికి వచ్చెను. సర్దార్ పటేల్ ఆనాడు చేసిన దీర్ఘప్రసంగమున ఈ విషయమునే వివరముగ చర్చించియుండెను. స్వాతంత్ర్యసంపాదనకు త్యాగముచేసినట్లే స్వాతంత్ర్యమును స్థిరపరచుకొని ఆర్థికస్వాతంత్ర్యమును సంపాదించుటకును నిశేషత్యాగములు చేయవలసియుండునని హెచ్చరించిరి.

వీటన్నింటికంటె కూడ సర్దార్ ప్రసంగమునందు గమనింపవలసిన విషయమొక్కటి గలదు. "మన నాయకుడు (పండిట్ నెహ్రూ) విదేశములందు మన పేరుప్రతిష్ఠల నధికము చేసి,ఉన్నతస్థానమును సంపాదించుటకు అహర్నిశలు పాటుపడుచుండెను. జీవితాంతము వరకు ఆయనకు బలము చేకూర్చుటకే నేను సదా ప్రయత్నము చేయుచుందును." భారతీయులందరు నేడు చేయవలసిన పని ఇదియే. మన నాయకత్వమును బలిష్ఠము చేసినగాని మన ప్రభుత్వమునకు స్థిరత్వ మేర్పడదు. ప్రభుత్వము స్థిరముగ నున్నగాని దేశసమస్యల పరిష్కారము సాధ్యము గాదు. సర్దార్ పటేల్ హెచ్చరించినట్లు నేడు దేశమును ఎదుర్కొనుచున్న ఆర్థిక సమస్యలు పూర్తిగ పరిష్కారము కావలెనన్న ప్రతి ఒక్కరు రైతులు, కూలీలు, పారిశ్రామికులు తమ యావచ్ఛక్తిని వినియోగించి వస్తూత్పత్తిని వృద్ధి చేయవలసియున్నది. సాధ్యమైనంతవరకు అవసరములను తగ్గించుకొని, దేశమున "యథార్థసంపదను" వృద్ధిచేసినగాని ఆర్థికసమస్యల పరిష్కారము సాధ్యము గాదు. భారతపౌరులు ప్రతి ఒక్కరు సర్దార్ పటేల్ సందేశము నాలించి కార్యోన్ముఖు లగుదురుగాక!

నోబెల్ శాంతి బహుమానం పొందిన

సర్. జాన్ బోయిడ్-ఆర్



అరవై అయిదు ఏళ్లు నిండేసరికి సామాన్యంగా అందరూ వృత్తినుంచి విరమిస్తారు. కాని 65 ఏళ్లు నిండినతరువాతనే సర్ జాన్ బోయిడ్-ఆర్ బృహత్కర్తవ్య భారాన్ని పైన వేసుకొన్నాడు. ఐక్యరాజ్యసమితియొక్క ఆహార, వ్యవసాయ సంఘానికి మొట్టమొదటి డైరక్టర్ జనరల్‌గా చేరాడు. ఇవేవలనే స్కాటిష్ విశ్వవిద్యాలయాల ప్రతినిధిగా పార్లమెంటుకు ఎన్నికైనాడు. ఆహారవ్యవసాయకసంఘం ఒక దారిలో పడితే చూసి ఆతరువాత పార్లమెంటులో కార్యకలాపం ప్రారంభించాలను కున్నాడు. కాని ఒక సంవత్సరం గడిచినా ఏ దారీ తెన్నూ లేకుండా తడబడుతున్న సంఘంకోసం పార్లమెంటుసభ్యత్వానికి రాజీనామా నివ్వవలసివచ్చింది.

ఆహారవ్యవసాయకసంఘంలో కృషిచేసి చివరికి ప్రపంచఆహారసలహాసంఘస్థాపనకు కారకుడైనాడు. ఈ సలహాసంఘానికి లార్డ్ బ్రూస్ (మెల్బోర్న్) అధ్యక్షుడుగా ఉన్నాడు.

జాన్ బోయిడ్-ఆర్ 1880 లో సెప్టెంబరు 23 వ తేదీని ఐర్షైరీలోకి ల్మార్న్‌లో జన్మించాడు. గ్లాస్గో విశ్వవిద్యాలయంలో ఉన్నతవిద్య పొంది డిగ్రీలు కొల్లలుగా సంపాదించాడు. డాక్టరేట్లు, మెడల్స్ పొందాడు. కాని వైద్యవిద్య అభ్యసిస్తున్నన్ని రోజులు తాను కర్షకుడు కావాలనే వాంఛ ప్రబలంగా ఉండేదని బోయిడ్-ఆర్ చెప్తాడు. "కర్షకవృత్తి నా నెత్తుర్లో ఉంది. దానికోసం అన్నిటినీ విడిచిపెట్టాను" అని చెప్తాడు. ఉత్కోత్తరా తనకోరికలన్నిటినీ తీర్చుకోగలిగాడు.

మొదటి ప్రపంచసైనికయుద్ధంలో యూరప్‌లో సైనికవైద్యశాఖలో పనిచేసి పతకాలు పొందాడు. 1917 లో నౌకాదళంలోకి బదిలీ చెయ్యబడ్డాడు.

1918 లో ఆహారపరిస్థితి క్లిష్టతరమైనప్పుడు సైనికదళాల్లో ఆహారసమస్యలగురించి పరిశోధించడానికి సైనికదళానికి మార్చబడ్డాడు.

1919 లో సైన్యం విడిచి వచ్చినతరువాత కూడా ఆహారవిషయాలలో పరిశోధన సాగించాడు. పశువుల ఆహారవిషయపరిశోధనకు సంబంధించిన అబర్డీన్‌లో పరిశోధనాలయం స్థాపించి దానికి డైరెక్టరయినాడు. దీనితోపాటు స్వయంగా పశుపెంపకంలో కృషి చేశాడు. పశువుల జబ్బులు మొదలైన విషయాల్లో చాలా పరిశోధన చేశాడు.

వ్యవసాయవిషయపరిశోధనలో అనేక కమిషన్లలో సభ్యుడుగా పనిచేశాడు. అనేక సంవత్సరాలు వ్యవసాయసమస్యలకూ, పశువుల ఆరోగ్యసమస్యలకూ సంబంధించిన కలోనియల్ ఎడ్వైజరీ కౌన్సిల్‌లో పనిచేశాడు. 1929 లో ఆస్ట్రేలియన్ ప్రభుత్వం ఆహ్వానంపై ఆ ఖండంలో పశుపెంపకంగురించి విచారణ జరిపాడు. తరువాత కెనడాలోనూ న్యూజీలాండ్‌లోనూ అదే విషయంలో విచారణ జరిపాడు.

క్రమంగా మానవుల ఆహారసమస్యలపైకి బోయిడ్-ఆర్ తన దృష్టిని మళ్లించాడు. 1926 లో అనేక వందలమంది పాఠశాలావిద్యార్థుల ఆహారఆరోగ్యవిషయమై పరిశోధించాడు. విద్యార్థులకు ఆహారంతోపాటు అదనంగా పాలు కూడా ఇస్తే వారి ఆరోగ్యం వృద్ధిఅవుతుందని నిరూపించాడు. ఆహారవిషయాలపై తన పరిశోధనఫలితాలను ఒక గ్రంథంగా 1936 లో ప్రచురించాడు. ఈ గ్రంథంలోని విశేషాలను చూసి దేశంఅంతా ఆశ్చర్యంలో మునిగిపోయింది. జనాభాలో దాదాపు నూరింట పదివంతులమంది అర్ధాకలితో ఉంటున్నారనీ, దాదాపు సగంమందికంటె కావలసినంత ఆహారం తీసుకోలేకుండా ఉన్నారనీ ఈ గ్రంథంలో చెప్పాడు. పేదవర్గాలవారికి కోడిగ్రుడ్లు, ఫలాలు కాయగూరలు పళ్లె అధికం కావాలని సూచించాడు. వారు ఆహారాన్ని కనీసం రెట్టింపైనా తీసుకుంటేగాని వారి ఆరోగ్యం చక్కబడదు.

ఆహార వస్తువుల ధరలను పడిపోకుండా అధిక ప్రమాణంలో నిలుపుదల చెయ్యడంకోసం ఆహారవస్తూత్పత్తిప్రమాణాన్ని పెరగకుండా నిర్బంధించే ప్రభుత్వ విధానాన్ని సర్. జాన్ బోయిడ్-ఆర్ నిశితంగా విమర్శించాడు. ఈ విధానంవల్ల అనేకలక్షలమంది ప్రజలకు ఆహారం అందుబాటులో లేకుండా ఉందని చెప్పాడు. దేశంలో ఆహారవస్తుసంపదనంతటినీ ప్రభుత్వం స్వాధీనపర్చుకోవాలనీ, ఆహారంపంపకాన్ని వ్యవసాయశాఖ వాణిజ్యసంస్థద్వారా సంస్కరించి ఆహారం అందరికీ అందుబాటులో ఉండే విధంగా చెయ్యాలని సూచించాడు. దీనినిమిత్తం ప్రభుత్వం ఆహారశాఖ నొకదాన్ని స్థాపించాలని ప్రతిపాదించాడు. ప్రజారోగ్య సంరక్షణశాఖ కూడా ఆహారంపంపకం విషయంలో శ్రద్ధ వహించి వ్యవసాయశాఖవారి వాణిజ్యసంస్థతో సహకరించాలన్నాడు. ఈ ప్రభుత్వఆహారశాఖ రైతులకు ఒక కనీసపు అమ్మకపు వెల గారంటీ ఇచ్చి, ఆహారోత్పత్తిని వృద్ధిచేసే భారం రైతులపై పెట్టాలన్నాడు. జాతి అంతకీ అవసరమైన ఆహారాన్ని ఉత్పత్తిచెయ్యడానికి ప్రభుత్వం కృషి చెయ్యాలి. ప్రభుత్వసహాయంతో రైతులు ఉత్పత్తి చేసిన ఆహారాన్ని నిరుపేదలకుకూడా అందుబాటులో ఉండే ధరలకు విక్రయించాలి. దీనివల్ల రైతుకు రాగల నష్టాన్ని ప్రభుత్వం తమ ఖజానానుంచి చెల్లించాలి.

1935 లో నానాజాతిసమితి ఆహారోద్యమం ప్రారంభించినప్పుడు ఇంటర్నేషనల్ టెక్నికల్ కమిషన్‌లో జాన్ బోయిడ్-ఆర్ సభ్యుడుగా నియమించబడ్డాడు. 1937 లో ప్రజల ఆహార, ఆరోగ్యసమస్యల విచారణనిమిత్తం బ్రిటిషు ప్రభుత్వం నియమించిన కమిటీలో సభ్యుడుగా నియమించబడ్డాడు.

1937 లో స్కాటిష్ ప్రజారోగ్యశాఖలో ముఖ్యవైద్యశాఖాధికారిపదవిని ప్రభుత్వమిచ్చినప్పుడు, ఆపదవివల్ల తన నూతనఆహారవిషయాందోళనకు ఆటంకం కాగలదనే ఉద్దేశంతో నిరాకరించాడు. తన ఉద్యమాన్ని పత్రికలతో ప్రచారం చేశాడు.

"యుద్ధసమయంలో ప్రజల ఆహారసమస్య" గురించి డేవిడ్‌లంబార్ సహాయంతో ఒక గ్రంథాన్ని ద్వితీయప్రపంచసంగ్రామకాలంలో ప్రచురించాడు. వీలైనంతచౌకలో కనీసావసరమైన ఆహారవస్తువు లేవేవో అనేకఉపన్యాసాలిచ్చాడు. 1940 లో యుద్ధకాలమంత్రివర్గపు సైంటిఫిక్ ఎడ్వైజరీకమిటీలో సభ్యుడుగా నియమితుడైనాడు.

1941-42 లో అమెరికా సందర్శించి, ప్రపంచఆహారసమస్యాపరిష్కారం నిమిత్తం ఐక్యరాజ్యసమితిని స్థాపించాలని ప్రచారం చేశాడు. అవసరాలనుబట్టి ఆహారవస్తువులను ఉత్పత్తిచేసి పంపకం ఏర్పాటు చెయ్యాలని (అంటే ఆహారాన్ని వ్యాపారపు ఒడిదుడుకులకు విడిచిపెట్టకుండా ప్రభుత్వాలు జాగ్రత్తవహించాలని) ఈ కర్తవ్యభారాన్ని పై సమితికి ఒప్పగించాలని ప్రచారంచేశాడు. ప్రపంచ వ్యవసాయిక, ఆర్థిక సాంఘిక సమస్యల పరిష్కారానికి ఈ చర్చ ప్రథమావసరమని వ్యాసాలద్వారానూ, ఉపన్యాసాలద్వారానూ, ప్రచారం చేశాడు. హాట్‌స్ప్రింగ్స్ సమావేశానికి హాజరై, ప్రోత్సహమిచ్చి, ఆ సమావేశానికి మూలపురుషు డనిపించుకున్నాడు. పదేళ్లుగా బోయిడ్‌ఆర్ చేసిన కృషి ఈ సమావేశతీర్మానాల్లో ప్రతిఫలించింది.

1932 లో రాయల్‌సొసైటీకి ఎన్నికైనాడు. 1935 లో సర్ బిరుదం పొందాడు. డాక్టర్ ఆఫ్ లాస్ పట్టం పొందాడు. ప్రపంచఆహారసమస్యలో చేసిన కృషికి అమెరికన్ గ్రోసర్స్ ఎవార్డ్‌ను 1944 లో పొందాడు.

1945 ఏప్రిల్‌లో విశ్వవిద్యాలయాధికారుల ప్రోద్బలంపై స్కాటిష్‌విశ్వవిద్యాలయాల తరఫున పార్లమెంటుసభ్యత్వానికి ఎలక్షన్‌లో ఎన్నికైనాడు. తరువాత తిరిగి సేనవిలో పార్లమెంటుకు ఎన్నికైనాడు.

1948 సెప్టెంబర్‌లో క్విబెక్ సమావేశాని బ్రిటిష్‌ప్రతినిధిగా హాజరైనాడు. ఈ సమావేశం ఐక్యరాజ్యసమితియొక్క ఆహారవ్యవసాయకసంఘనిర్మాణనిమిత్తం జరిగింది. ఈ సంస్థకు డైరెక్టర్ జనరల్‌గా ఎన్నికైనాడు. డైరెక్టర్ జనరల్‌గా ప్రపంచమంతా సంచారం చేశాడు. సంఘవార్షికసమావేశాలకూ, ప్రాంతీయసమావేశాలకూ హాజరైనాడు. ఐక్యరాజ్యసమితి పునరావాస కార్యక్రమాన్ని ఈసంస్థకు ఒప్పగించింది. ప్రపంచమంతా సంచారంచేసి వివిధదేశాలు ఆహారోత్పత్తి నే రీతిగా వృద్ధిపరచుకోవాలో సూచనలు చేశాడు.

వివిధదేశాలమధ్య ఆహారసమస్యా పరిష్కారం సందర్భంలో సహకారం చేకూర్చడానికి అపార కృషిచేశాడు. బోయిడ్-ఆర్ సూచించినట్లు నిర్వహణ, వ్యాపారాధికారాలుగల ప్రపంచ ఆహారసంస్థ స్థాపించబడలేదు. కాని గత సంవత్సరం సెప్టెంబర్‌లో స్థాపించబడిన ఆహారవిషయ సలహాసంఘం దాదాపు ఆ సూచనలప్రకారమే నిర్మించబడింది. పంటలు బాగా ఉన్న సంవత్సరాల్లో ఆహారాన్ని నిలవచేసి అవసరమైనప్పుడు వాడే పద్ధతి అంగీకరించబడింది.

1948 జూన్, 1 వ తేదీని డైరెక్టర్ జనరల్ పదవికి రాజీనామా నిచ్చాడు. రాజీనామా నిచ్చేయుంటూ స్వదేశానికి వచ్చినప్పుడు ప్రపంచ ఆహారపరిస్థితి క్లిష్టంగా ఉందని ప్రపంచాన్ని హెచ్చరించాడు. సాలీనా ప్రపంచ జనాభా రెండుకోట్ల చొ॥ వృద్ధిఅవుతున్నదనీ, ప్రపంచమంతటా భూమి సారహీన మౌతున్నదనీ చెప్పాడు. వివిధదేశాలు సహకారభావంతో ఆహారసమస్యను పరిష్కరించడానికి పూనుకుంటేగాని వచ్చే 50 సంవత్సరాల్లో పెద్ద అరాచకం సంభవించగలదని హెచ్చరించాడు.

బోయిడ్-ఆర్ డైరెక్టర్ జనరల్‌గా పనిచేసిన రెండున్నరసంవత్సరాలలోనూ వివిధ దేశాలమధ్య కొంత సామరస్యం సాధించాడు. ఆ తరువాతకూడా ఆహారసమృద్ధిద్వారా శాంతిని సాధించాలని ప్రచారంచేస్తున్నాడు.

నవల



శ్రీ నోరి నరసింహశాస్త్రి

3

సభానంతరమున శ్రీ రుద్రమదేవి యాత్మమందిరమునకు ప్రయాణమయ్యెను. దారి పొడుగున నందరు "శ్రీరుద్రదేవమహారాజా జయ!" అని ఆమెకు జయాభివందనములు చేయుచుండిరి. ఆమె సవినయముగా తలయొగ్గి వారల జయశబ్దములు స్వీకరించుచు కన్నులలో చిరునవ్వువెన్నెలలు ప్రతిఫలింపజేయుచుండెను. ఆమె మందిరము చేరగనే మందిరపాలకులుకూడ నట్లే జయజయనాదము లొనర్చిరి. చెలికత్తెలు మంగళారార్తికము నొసంగి దృష్టితీసిరి. దాసదాసీజనమును వృద్ధకంచుకులును ఆమెచుట్టు చేరి ప్రీతిపురస్సరముగా నామెను బహువిధముల ప్రశంసింపసాగిరి. ఆమె పరమశాంతముగా నాదరముతో నందర యభినందనము లందుకొనుచుండెను. ఆ సందడి చీకటిపడువరకు దగ్గలేదు.

దీపములు వెలిగించువేళ కామె యేకాంతమందిరమునకు విశ్రాంతికై చేరెను. పరిచారిక యొక్కతె యామె ధరించిన పురుషవస్త్రము లూడ్చి స్త్రీజనోచితమగు వలువలు ధరింపజేసి తొలగిచనెను.

వెంటనే రుద్రమదేవి నిలువున మారిపోయెను. రాజసభలో మహావీరసమాజమున వీరాధివీరావతారముగా కనుపించిన దీ మూర్తియేనా? వేషముతోపాటు స్వభావముకూడ మారిపోవునా! ఇప్పుడామె దీనముగా శయ్యపై మేనువాల్చెను. అచ్చట నామె కాంతరంగికురాలగు నుయ్యాంబమాత్ర ముండెను.

రుద్రమదేవి నానా డందరు నభినందించిరి. కాని యామెయాంతరంగికురాలగు నీ రుయ్యాంబ యొక్కతెమాత్ర మభినందింపలేదు. ఆమె పదునారేండ్ల యువతి. నిండుయౌవనములో నున్న యామెముఖమున విశిష్టమైన పూర్ణత యొకటి గోచరించుచుండెను. ఆమెకు పసితనముననే తల్లి గతించినది. ఆమెతండ్రి రుద్రాంబికకు విలువిద్య నేర్పిన ఆచార్యుడు. రెండేళ్ళకే ఆ పిలకు ఆసహాయస్థితి సంభవించినది. రుద్రమదేవి కిది తెలియగానే తండ్రియనుమతితో దానిని తన పుత్రికగా స్వీకరించినది. అప్పటినుండి యామెను తన పుత్రికకంటె ప్రేమాతిశయముతో పెంచినది. కొలదికాలమునకే యా బాలికతండ్రికూడ కాలధర్మము నొందుటచే వారి యనుబంధము దృఢతర మయ్యెను. ఆ బ్రాహ్మణబాలికకు రుద్రాంబయే తల్లియు, తండ్రియు. వారిమధ్య వ్యవహారము లన్నియు తల్లికూతుండ్రకువలెనే జరుగుచుండెను. రుయ్యాంబకు బుద్ధి మిక్కిలి సూక్ష్మమైనందున సమస్తవిద్యలు శీఘ్రముగా నభ్యసించుటయేకాక రుద్రమకును అంతఃపురజనముల కందరకును ప్రీతిగౌరవభాజన మాయెను.

రుద్రమ వ్రాలిన శయ్యకు సమీపముగా నున్న యాసనముపై రుయ్యమ్మ కూర్చుండి రుద్రమవంక తదేకదృష్టితో చూచుచుండెను. రుద్రమ కనులు మూసియేయుండెను. కాని ఆ మూసియున్న రుద్రమకన్నులలోనికికూడ రుయ్యమ్మదృష్టి కాంతులు ప్రసరించుచున్నట్లుండెను.

ఇంతలో రుద్రమ పెదవులు కదలెను. కన్నులుమాత్ర మింకను మూసికొనియేయుండెను.

"అమ్మాయీ, నీవు నాకు జయాభినందనము చేయలేదేమి?"

"అందరూ చేసిరిగదమ్మా!"

"అమ్మాయీ, నా కానందముగా లేదు!"

"నీ కానందముగా లేనిదానికి నే నెట్లు జయజయనినాదము చేయగలనే తల్లీ?"

"న న్నొక్కసారి కౌగిలించుకో!"

రుయ్యాంబ రుద్రమదేవివక్షస్స్థలముపై తన శిర స్సుంచి రెండుచేతుల నామె శిరస్సును పొదివెను.

"అమ్మా! నీ కన్నుల నీరు రానీయకు, నే చూడలేనే!"

రుద్రమదేవి మెల్లగా తన కనుకొనుకులలోని ముత్యాలు తుడుచుకొనుచు కనురెప్పలు విప్పెను. మరల రుయ్యాంబ యడిగెను.

"అమ్మా, నీ గుండెలు జలయంత్రమువలె ఇట్లు కొట్టుకొనుచున్న వేమే?"

"జరిగిన దంతయు నీ వెరుగుదువా?"

"రాణివాసముసోరణగండ్లనుండి సభాస్థానమునంతయు శ్రద్ధగా చూచితిని."

"కామసాని నీప్రక్క నున్నదా?"

"ఉన్నది. శ్రీవిశ్వేశ్వరశంభుదేశికులు నిర్వచించువరకు కామసానికిని నావలెనే గుండెలు దడదడలాడుచుండెను. వారి వాక్కులు వినగానే ఆ ముడతలుపడ్డ కామసానిముఖము ఒక్కసారిగా వికసించినది. అప్పుడామె చిన్నతనములో ఎంత అందముగా ఉండెడిదో కొంత ఊహింపగలిగితిని."

"అమ్మాయీ, మరి నీవో?"

"నిందుకమ్మా, నా నోట చెప్పించుట! నీ వూహించలేవుటమ్మా?"

"కాదు నీనోటనే వినవలె నమ్మాయీ!"

"అయితే మరే, శ్రీవిశ్వేశ్వరశంభువుల వాక్కులు వినగానే నా గుండె లాగిపోయినది—కొంతసేపు నిలువుమాపు పడ్డది. మరల భూదేవులు ఆశీర్వచనమునకు ఉపక్రమించుచు చేసిన ప్రణవోచ్చారణముతో నా సర్వాంగము నుద్బుద్ధమయినది—అమ్మా, ఐనను శ్రీవీరభద్రేశ్వరులు వదలిన అక్షతలు నీ శిరస్సుపై పడియున్నచో నా కానందము కలిగియుండేదే!"

"అమ్మాయీ, అదికూడా నీకళ్ళబడినదా?"

"కామసానికళ్ళలోకూడా పడినది. ఆమెకు కోపావేశముతో ఒళ్ళు వడకినది."

"మరి, నీకో?"

"ఎందు కమ్మా, ఇంత వాచ్యముగా నానోట అనిపించుచున్నావు?—నాకు దిగులుతో గుండెలు జారినవి."

"కామసానిని ఒకసారి పిలిపించగలవా?"

రుయ్యమ్మ పరుగెత్తుకొనిపోయి కామసానిని పిలుచుకొనివచ్చెను.

కామసాని ఎనుబదేళ్ళ వృద్ధు. ఆమె రుద్రమదేవితల్లులగు నారాంబపేరాంబలతో కృష్ణాముఖద్వారమందలి క్రొయ్యూరునుండి దాసిగా చెలికత్తెగా చేటికగా వచ్చెను. నారమ, పేరములకు జాయపనాయకుడు సోదరుడు. వారల తండ్రి పినబోడినాయకుడు క్రొయ్యూరుపాలకుడైయుండ గణపతిదేవు డాతని తన దిగ్విజయయాత్రలో జయించి కూతుండ్ర నిరువుర పెండ్లియాడి జాయపనాయకునికి తన గజసైన్యాధ్యక్షపదవి యొసంగెను.

కామసానియే రుద్రమదేవిదాది. ఆమెచర్మము పండి ఎండిన మామిడిపండువలె ముడుతలు పడియుండును. ఆమె కనుబొమ్మలలోని కండ లెండినందున వానిచర్మము కన్నులమీదికి తెరలవలె వ్రేలాడుచుండెను. ఆమె తల ఎత్తినప్పుడు లోపల లోతుగా నున్న చిన్న కన్నులు మిణుగురుపురుగులవలె విలవిలలాడి యాకర్షించును. ఆ వెనడుములో వార్ధకముచే బలహీనమైనను వంగక ప్రయత్నపూర్వకముగా నిలువదీసికొని నిటారుగా నిలుచుండును.

ఆమె వచ్చుచునే నిండారు ప్రేమతో రుద్రమదేవి చెక్కుల రెంటిని తన రెండు చేతులతో దువ్వి యా చేతులు తన చెక్కులపై పెట్టుకొని మెటికలువిరుచుకొనెను. అంతట నామె యాదరముతో రుద్రమదేవివెన్నుక్రింద నొక చేయియు మధ్యముపై రెండవ చేయియు నుంచి లేవదీసి శయ్యపై కూర్చుండజేసెను. రుద్రమ తనవైపు చూచుటకు వెనుదీయుచున్న దనికూడ గమనించక పొంగారుచున్న వాత్సల్యముతో నన వార్ధకసహజ మగు వాక్కులు సాగించెను.

"నా కొక్కటే కొరవగా ఉన్నదే యీనాడు! నారాంబపేరాంబ లీ మహోత్సవము చూడలేకపోయిరే అని దిగులుగా ఉన్నదే తల్లీ! వారి కీనాటికే వీరప్రసువులై ధన్యలైనారు!"

కామసాని ఒకేతీరున ఉత్సాహవచనము లాడసాగెను. దానితో రుద్రమదేవి యించుక తేరుకొని ముఖము పటముతో తుడుచుకొనెను. రుద్రమదేవినుదుట చెరిగిన తిలకము కల్యాణరేఖగా దిద్ది యలంకరించెను. రేగిన యలకలు సరిచేసెను. పెదవులకును చెక్కులకును అంగరాగ మద్ది చెదరిన హారములు సవరించెను. అంతట నామె మణిదర్పణము తెచ్చి రుద్రమదేవిముఖము ముందుంచి చూచుకొమ్మనెను. రుద్రమ పరాకుగా చూచుకొనుచు ఇట్లనెను.

"దినదినమూ చూచుకొను ముఖములో నేమ దున్నది కామసానీ!"

కామసాని: "రుయ్యమ్మా, రుద్రమ్మ ఎంత అమాయకపు తల్లిరో చూచితివమ్మా?—ఇప్పుడీమె మహిషాసురమర్దనార్థ మవతరించిన చండికాదేవివలె లేదమ్మా?"

రుయ్యమ్మ: "మన రుద్రమ్మమనస్సు నేడు స్వస్థముగా లేదు."

కామసాని: "నీ పిరికిముండ్లెమైనా పోసినావా యేమి?—ముందు, విషయమేమిటో?"

రుయ్యమ్మ: "శ్రీవీరభద్రేశ్వరుల యాశీర్వచనాక్షతలు అమ్మపై పడలే దని దిగులుపడుచున్నది."

కామసాని: "శ్రీగణపతిదేవచక్రవర్తులయు శ్రీజాయపనాయకులయు అక్షతలు తల్లిపై పడినవిగదా?"

రుయ్యమ్మ: "శ్రీ వీరభల్లటదేశికుల యక్షతలు కూడ పడలేదు."

కామసాని: "శ్రీవిశ్వేశ్వరశంభుదేశికుల యాశీర్వచనాక్షతలు అమోఘములనీ సర్వదోషపరిహారకములనీ చెప్పలేకపోతివా?"

రుయ్యమ్మ: "స్త్రీలకు భర్తృసాహిత్తు పదైము కాదామరి!"

కామసాని: "పిచ్చిదానా, రుద్రమదేవినికూడా సామాన్యస్త్రీలెక్కతోపాటు లెక్కకట్టుచున్నావా? ఆమె గర్భములో ఉన్నప్పుడే గణపతిదేవుని యనంతరచక్రవర్తి పుట్టునని దైవజ్ఞులైక కంఠ్యముగా నిర్ణయించిరి. అందరస్త్రీలవలెనే రుద్రమదేవి పెరిగినదా?"

అంతవరకును మౌనముగా రుద్రమదేవి వారి సంభాషణ మాలించుచుండెను. ఉభయుల వాక్యములును ఆమె అంతరంగములో ప్రతిధ్వనింపగా నామెకు బాహ్యాభ్యంతరములలో నా సంవాదము జరుగుచున్నట్లనిపించినది. రుద్రమ ఇప్పుడు అందుకొనినది.

(22-వ పేజీ చూడుడు)

చక్కెర పరిశ్రమ

'గౌతమ'

మన "చక్కెర పరిశ్రమ" గత 17 సంవత్సరాలుగా ప్రభుత్వరక్షణలోనే పెరుగుతూ వచ్చింది. కాని ఈనాటికి తన పాదాలమీద తాను నిలబడి, విదేశవ్యాపారపుపోటీలో నిలవలేకుండా ఉంది. 1950 మార్చితర్వాతకూడా ఈ రక్షణను ఇల్లాగే సాగించాలా, అన్న విషయం త్వరితగా దర్యాప్తుచేసేందుకు టారిఫ్‌బోర్డువారు పూనుకొన్నారు. టారిఫ్‌బోర్డువారికీ, ప్రభుత్వానికీ, "చక్కెర పరిశ్రమ" విషయంలో గల క్లిష్టాంశాలను కేంద్రీకరించి దృష్టిలోకి తేవటమే ఈ వ్యాసకర్త ఉద్దేశము.

భారతసమాఖ్యలో 134 పంచదారఫ్యాక్టరీలు ఉన్నాయి. ఏటా, యీ ఫ్యాక్టరీలలో 10.75 లక్షల టన్నుల పంచదార, చెరకుగడనుండీ, 1.04 లక్షల టన్నుల మేలిరకపు పంచదార, బెల్లం, ఖండశర్కరగడలనుండీ, తయారు అవుతున్నది. విభక్తభారతదేశంలో 1947-48లో చెరకుపంటక్రింద 35.83 లక్షల ఎకరాల భూమి సాగులో ఉంది. 1945-46 లో మేలిరకపు చెరకుపంట 25.89 లక్షల ఎకరాల విస్తీర్ణంలో ఉండేది. చెరకుపంటలో 20 లక్షలమంది కర్షకులు పాల్గొంటున్నారు. వ్యవసాయంగానూ, పరిశ్రమగానూ కూడా, పంచదార, చెరకుల విషయం తెలిసికోటం చాలా ముఖ్యమైయున్నది.

మన చక్కెరధర మణుగు 28-8-0 రూపాయలకు పైననే సాగుతున్నది. ఇది ఈ ఋతువులో ఇండియన్ సుగర్ సిండికేటువారు స్వబుద్ధితో నిర్ణయించిన పంచదారకంట్రోలు ధర. గతసంవత్సరం వ్యాపారపు సంకెలన్నీ కలుపుకొని దిగుమతిఅయిన పంచదారధర మణుగు రూ 16-12-9 ఉండేది. విదేశీచక్కెరధర అప్పటికన్నకూడా పడిపోయింది ఇప్పుడు బస్తా 80 రూపాయలు అమ్ముతూంది. దిగుమతిఅయిన చక్కెర తక్కువధరకు, మనదేశవాళీ చక్కెర ఎక్కువధరకు ఒక సామరస్యం తేటంకోసం, అంటే దేశవాళీ పంచదారను విదేశీపోటీనుంచి రక్షించటంకోసం, సుగర్‌సిండికేటువారు ధరల ఈ తారతమ్యం కనబడకుండా కప్పిపుచ్చవలసివచ్చింది. అంటే దిగుమతిఅయిన పంచదారమీద మణుగుకు రూ. 12-9-7 లు, అదనపు పన్ను తగిలించాల్సివచ్చింది. దీనికిగానూ ఎక్సైజుపన్ను రూ 3-12-0, రక్షణపన్ను రూ 6-12-0, ఈ రెంటిమొత్తంలోనూ అయిదోవంతు అదనపు పన్నూ, మొత్తం అంతా కలిపి, మణుగుకు రూ 12-9-7 పైసలు, పన్నుపేరిట విదేశీచక్కెరధర హెచ్చించవలసివచ్చింది. దేశవాళీ పరిశ్రమను రక్షించటంపేరట, కొనుగోలుదారుడైన సామాన్యపౌరునికి ధర అధికంచేసి, జీవనవ్యయప్రమాణాన్ని భారావహం చేయవలసివచ్చింది.

ఇప్పుడు పంచదారదిగుమతిమీద నిషేధం ఉంది. కాని ఈ నిషేధం, పాతబాకీల పరిష్కారాలయ్యే కాలాన్ని మించి అధికకాలం సాగించటానికి వీలు లేదు. ఎందుకంటే, విదేశవాణిజ్యవ్యాపారసుంకాలు, తదితరఅంశాలపై సర్వసాధారణఒడంబడికలు చేసుకొన్న దేశాలలో ఇండియాకూడా భాగస్వామ్యాలు. ఈ దిగుమతి కంట్రోళ్ళను ఎత్తివేయగానే భారతీయపరిశ్రమ, జావా, బ్రేజిల్, క్యూబాలనుండి మన మార్కెట్‌లోకి అపారంగా వచ్చే పంచదారప్రవాహపుపోటీని ఎదుర్కోవాల్సి ఉంటుంది. తక్కిన ప్రపంచపు ధరలకు, ఇండియాలో తయారయిన పంచదారధర సముఘాయిదాలో తగ్గి నిలువలేనంతకాలమూ, ఈ రక్షణసుంకాన్ని దిగుమతులపై తగిలించి ధరను హెచ్చించి భారతీయపరిశ్రమకు రక్షణ యిస్తూ కాపాడటంతప్ప గత్యంతరము కనబడదు. స్వతంత్రంగా పోటీలో నిలబడవలసివస్తే, మన పంచదారపరిశ్రమ నాశనముఅయిపోయి, చెరకుపంటలోనున్న వ్యవసాయవర్గంకూడా చితికిపోవలసివస్తుంది. ఈ పరిస్థితులలో, 1950 మార్చితర్వాతకూడా, ఈ రక్షణనివ్వకుండా ఉండటం, అనుసరణీయమూ, అపేక్షణీయమూ కూడా కాకపోవచ్చును.

మరి ఇల్లాంటి సందర్భంలో, సామాన్యపౌరుడికి, కొనుగోలుదారుశ్రేయస్సు గమనించగల్గటం ఎల్లాగే అనేదే ప్రశ్న.

ఇండియన్ సుగర్ సిండికేట్ వారు భారతప్రభుత్వంతో ఒక సమాధానానికి వచ్చి, స్వయముగా, పంచదారధర మణుగు ఒక్కంటికి రూ. 28-8-0, ప్రస్తుతం ఉండేటట్లు నిర్ణయించారు. గత జూలై మధ్యదాకా ఈ ధర అట్లాగే నిలచే ఉందికాని ఆ తర్వాత నాటి నాటికి ధర పెరగటమూ, సిండికేటువారు, తమ నిర్ణయాన్ని తామే బాహాటంగా భంగించుకు రావటమూ జరుగుతూంది. ధరలు పెరిగి ప్రజల దగ్గిర డబ్బు పిండటం అంతా సాధారణవర్తకుల లాభకాంక్షపైన రుద్ది, వ్యాపారాన్ని నిందించి, తామేమీ ఎరగనట్లు తప్పించుకోజూసింది సుగర్ సిండికేటు. ధర పెరగటానికి, మిల్లులో, చిల్లర వర్తకులో, ఎవరు కారణమో ఆలోచించుకొనే తీరికగాని తెలుసుకొనే కుతూహలంగాని సామాన్యప్రజకుండటం కష్టం. ధరను సక్రమంగా ఉంచటానికి మిల్లులు బాధ్యత వహించాలో చిల్లరవర్తకులు బాధ్యత వహించాలో ప్రజ నిర్ణయించలేరు, కాని నిష్పాక్షికులు మాత్రమున్న వారికి తెలియకపోదు.


పంటకాలందాటి చివరికి వచ్చేటప్పటికి, బజారులలో స్టాకులు తగ్గి మాయమైపోతూవచ్చాయి. మిల్లులు ఈ అవకాశం చూచుకొని, తమదగ్గిర కొనుక్కోక తప్పకవచ్చిన వ్యాపారులదగ్గిరనుంచి ఎక్కువ ధర పిండసాగాయి. వాళ్లు కిమ్మనకుండా ఇచ్చుకొని, ఆ నష్టాన్ని వడ్డీతోసహా, సామాన్యపౌరునిదగ్గరనుంచి గుంజిపుచ్చుకొంటున్నారు. సరకుల నిల్వలు దాచేసి, ధరలు అమాంతంగా పెంచేస్తూ లాభాలు తీయసాగారు. ఈవిధంగా పరిస్థితులు అదుపు మీరిపోయినయి. పంచదారధర పెరిగి, బజారులో వస్తువు కనబడకుండా మాయమైపోయింది. భారతప్రభుత్వము మిల్లులలో స్టాకును దిగ్బంధం చేసి, వ్యాపారప్రవాహాన్ని సరిదిద్దటానికి ప్రయత్నించింది. ఎంతవరకు ఈ కృషి ఫలించిందీ, చెప్పతగ్గవారు ప్రజలే.


ఈ నాటకం మళ్ళీ మళ్ళీ సాగకుండా, ప్రభుత్వం చాల తీవ్రమైన చర్యలు తీసుకోవలసిఉంది. చెరకు, తయారీపంచదారలమీద ఎక్సైజుపన్నును (10%) పదోవంతన్నా తగ్గించవలసిఉంటుంది. ధాన్యాలు, వస్త్రాలుమీద ప్రభుత్వం ఈ పదోవంతు ఎక్సైజు పన్ను తగ్గించింది కాబట్టి, దీంట్లో తగ్గించటం, వాటితోపాటే అవుతుంది తప్ప, అసమంజసం కానేరదు. అల్లా చేస్తే, ప్రభుత్వం కంట్రోలుధరప్రకారం, మణుగుపంచదార (రూ 24/-) ఇరవైనాలుగు రూపాయలకు వస్తుంది. ఆ తర్వాత నెమ్మదిగా ఇండియా పంచదారధరను క్రమక్రమంగా తగ్గించుకొంటూ వచ్చి, విదేశాల పంచదారధరప్రమాణానికి తీసుకురావటం దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ప్రవర్తించాలి.


ఇండియాలో ఏటా 12 లక్షల టన్నుల పంచదార ఖర్చవుతోందని టారిఫ్‌బోర్డువారు అంచనా వేశారు. కాని "సుగర్ సిండికేటు" అధ్యక్షుడు, వార్షికసమావేశఉపన్యాసంలో, ప్రస్తుతం, $12\frac{1}{2}$ లక్షల టన్నుల పంచదార ఇండియాలో ఏటేటా ఖర్చవుతోందని చెప్పాడు. ఏమైనా, కారణాలు ఏవైనా, అంతకంతకూ ఇండియాకు కావలసిన పంచదార మొత్తం పెరుగుతోందనేది, సుస్పష్టమే. భారతవ్యవసాయ

(16-వ పేజీ చూడుడు)

చెరకు పిప్పినుంచి మేలిరకం కాగితం







ఏపరిశ్రమ అయినా వృద్ధిపొందాలంటే ఆ పరిశ్రమలో వృథా అయే వస్తువులను ప్రయోజనకరం చేసుకొనే పక్క పరిశ్రమలు వృద్ధిపొందాలి. పంచదారపరిశ్రమ వృద్ధిపొందాలని, చెరకు పిప్పినుంచి మేలిరకం కాగితం తయారుచేసే యంత్రాన్ని తయారుచేసి బ్రిటను ఇండియాకు పంపిస్తోంది. పై చిత్రంలోది ఈ యంత్రంలో పిప్పిని జీర్ణంచేసుకొనే గొట్టం. ఎడమవైపు చిత్రంలో పిప్పి గడ్డిగాదం, మొదలైన చెత్తను యంత్రానికి నింపుతున్నారు. కుడివైపు యంత్రం, వాక్యూమ్‌ఫిల్టర్, పల్పును, కడిగి సున్నితంగా వడపోస్తుంది. ఈ మిల్లును డాల్మియానగర్‌లో స్థాపించనున్నారు.

కథానిక:



ఆ యిల్లు

కొత్తగా ప్లీడరీప్రాక్టీసు పెట్టబోతున్న మా బావమరది రెండురోజులు ఊరంతా తిరిగి, ఇల్లు తన మనస్సులో నిశ్చయంచేసుకొనివచ్చి నన్ను ముందుగా ఒకపర్యాయం చూడమన్నాడు.

ఇంకా మేము వీధిచివరనే ఉండగా "చూసేవుకదూ, ఆ పచ్చమేడకి ఎదురుగా ఉన్న ఎత్తరుగుల పెంకుటిల్లు. అదే" అన్నాడు.

"అదేనా, అదయితే మరి నేను చూడ నక్కరలేదు. నువ్వు ఈ ఊళ్లో ఉన్నంతకాలం లోనూ, ఎన్నడయినా నేను నీయింటికి రావాలంటే, మరొక అయిదురూపాయిలు ఎక్కువయినాసరే వేరే ఇల్లు తీసుకో అని వెనక్కి తిరిగేను.

మావాడికి కష్టం తోచినట్టుంది. "నీకా ఇల్లు తెలుసునేమిటి?" అని నా సమాధానం కోసం ఆగకుండానే, "అయినా నువ్వెప్పుడో చూసిఉంటావు. ఈమధ్యనే మరమ్మత్తులూ అవీ చేయించేరు. అదివరకు రెండుమూడు చిన్న చిన్న కుటుంబాలుండేవిట; ఇప్పుడు మన ఒక్కరికే ముప్ఫైఅయిదురూపాయిలకి ఇచ్చేస్తున్నా" రంటూ అయిష్టంగా తాను వెనక్కి తిరిగేడు.

నాకు మరి వాడు చెప్పేమాటలు ఏవీ వినిపించుకోవాలనిపించలేదు. "నీకు ఇంకొక ఇల్లు వెతుక్కోడానికి కష్టంగా ఉంటే, నాలుగురోజులు నా పని మానుకొనిఅయినాసరే,తిరిగి ఏదో ఒకటి కుదిర్చి పెడతానుతే, అంతేకాని మరి ఈ ఇంటి సంగతిమాత్రం చెప్పకు" అన్నాను.

మావాడూ తక్కువవాడు కాడు. "పోనీ ఒక్కమారు ఆ ఇల్లంతా చూడకూడదా" అన్నాడు ఆఖరి ప్రయత్నంగా నేను ఆయింటి మీద అకారణంగా అపోహ పెట్టుకొన్నానేమోనని.

నాకు మరి ఆవిధంగా రోడ్డుమధ్యకి నిలబడి చర్చచేయడం చికాకనిపించింది. "నువ్వు వెయ్యి చెప్పు, లక్ష చెప్పు, ఆ యింట్లో నువ్వు ఉండే మాటయితే నేను రావడంమాత్రం. జరగదు. అందుకు నాకూ తగిన కారణం లేకపోలేదు. కావాలంటే, పోయి ఇంటిదగ్గర చెప్పుకొందాము" అన్నాను.

మేము ఇంటికి వెళ్లి వెళ్లడంతోనే మాఆవిడ వాళ్ళఅన్నయ్యను అడిగింది: "ఏమిటి చేసుకొని వచ్చేరు? మీ బావగారికి నచ్చిందా" అనిటీ మరుగుతున్న నీళ్లలో వేస్తూ.

నిస్పృహగా కుర్చీలో కూలబడుతూ "ఊఁహూఁ మళ్లీ మొదటికి వచ్చింద"న్నాడు మా బావమరది.

ఆవిడ కుర్చీలో కూర్చుని అంది: "నాకు మొదటే తెలుసును ఆయనకి నచ్చదని. వైద్యుణ్ణి కూరలు కొనడానికి పంపిస్తే, ఏ కూరా నచ్చక చివరికి తిప్పతీగ కొనుక్కొని వచ్చేడట. ఆ విధంగా ఆయనకి ఏ ఇల్లూ నచ్చదు. తానంటే ఇప్పటికి ఏదో ఇల్లు కట్టించుకొన్నారు గనక, ఇక అందరి ఇళ్లూ ఆమాత్రంగానైనా ఉండక పోతే వీలే దంటారు. అసలు ఇప్పుడు ప్రజలకి వస్తున్న జబ్బులలో నూటికి తొంభైవంతులు గాలీ వెల్తురూ సరిగా రాని ఇరకటపు ఇళ్లమూలంగానే వస్తున్నాయట."

"అంత అందరూ మంచి ఇళ్ళలో పరిశుభ్రంగా ఆరోగ్యంగా ఉంటే, మరి ఈ డాక్టర్ల అవసరమే ఉండదు" అన్నాడు మా బావమరిది.

"అవునయ్యా! అదే నేను కావాలనేది. ప్రజలకు జబ్బులు లేకుండా ఉంటే నా అవసరం ఉండదు. తగాదాలు లేకుండా ఉంటే, నీ పని ఉండదు. అయితే అటువంటి స్థితి ప్రపంచంలో ముఖ్యంగా మన దేశంలో ఎప్పుడు వస్తుందో, అసలు రానేరాదో..."

ఇంకా నా మాట పూర్తికాకుండానే లేచి టీ కలుపుతూ ఆవిడ, "ప్రపంచంమాట దేముడెరుగు, ముందు ఇంటి సంగతి చెప్పండురా" అంది.

శ్రీ పంతుల శ్రీరామశాస్త్రి

"చెప్పడాని కేముంది, నాకా ఇల్లు నచ్చలేదు" అన్నాడు.

"ఎందుచేత నచ్చలేదో, కొళాయీ, నుయ్యీ కూడా ఉన్నాయట. ఎలక్ట్రిసిటీ ఉందిట. ముందు పెద్దహాలుందిట. పూర్వకాలపు ఇల్లయినా కొత్తగా మరమ్మత్తులు చేయించేరట."

అంతలో మా బావమరిది "అసలు ఇల్లంటూ చూస్తేగదూ, వీధిచివరనుండి ఫలానా ఇల్లు అని చూపించడమే నాది పొరపాటు" అన్నాడు.

ఆవిడ పెదవివిరిచి, "అయితే ఇంతా ఇల్లు చూడకుండానేనా?" అంది.

నాకు మరి ఊరుకోబుద్ధిపుట్టింది కాదు. "నీకూ మీ అన్నయ్యకీ అంతగా ఆ యిల్లే కావాలనుంటే వద్దనడానికి మధ్యను నే నెవర్ని. కేవలం, తరవాత నామీద నిష్ఠురం వెయ్యకుండా ఉండడానికి, నేనుమాత్రం ఆ యింటికి రానే నన్నాను. అంతే. నా కారణాలు నాకూ ఉన్నై" అన్నాను.

"అవునవును. అవేమిటో ఇంటిదగ్గర చెప్తానన్నావు" అన్నాడు మా బావమరిది అప్పుడే నిద్రనుండి లేచినట్లుగా.

"నేను చెప్పాలనే అనుకొంటూఉంటే మీ రిద్దరూ భగాభగ అని ఒకరి తరవాత ఒకరు మాట్లాడుతూ నాకేమయినా సావకాశంఅంటూ ఇస్తేకదూ" అన్నాను.

అప్పటికి కొంచెం సర్దుబాటుమార్గానికి వచ్చి మా బావమరది "మరి నేనూ మాచెల్లెమ్మా ఏమీ మాట్లాడం, ఆ చెప్పేదేదో ఇప్పుడు చెప్తావా?" అన్నాడు.

"నేనేం చెప్ప ననడంలేదు. పద తోటలో పోయి కూర్చుందాము. అక్కడికే శారద టీ తెచ్చేస్తుంది" అన్నాను.

టీ తీసుకొన్నాక "శారదా! నీతో రెండు మూడుమార్లు లోగడ చెప్పాలనుకొని కూడా చెప్పడం కాలేదు. నువ్వూ కూర్చో విందువుగాని" అన్నాను.

ఆమె "అంతకంటేనా, ఒక్కక్షణం ఆగండి. నా అల్లిక తెచ్చుకొని వస్తా"నంది.

ఆలోపున నేను సిగరెట్టు ముట్టించి, కొద్దిగా కాల్చి, మధ్యలో అడ్డంకిగా ఉండకుండా పారేసి, పడకకుర్చీలో వెనక్కి చేరబడి చెప్పడం మొదలుపెట్టేను. చెప్పడం మొదలుపెట్టినతర్వాత నా కళ్లు తెరిచిఉన్నానో మూసుకొనిఉన్నానో తెలుసుకోవడం ఇప్పుడు నాకూ కష్టమే. కాని, నాకు కనిపించి నవిమాత్రం ఎట్టఎదురుగా ఉన్న చెట్లకొన కొమ్మలూ ఎగిరే పక్షులూ కాదన్న దిమాత్రల నిర్వివాదాంశం.

* * *

నేను నా పదిహేనవ ఏట స్కూలుఫయినలు పాసయేను. అంతవరకూ మా చిన్నాన్నగారి ఊళ్ళోనే గడిచిపోయింది. అప్పుడు ఇంటర్మీడియేటుకి ఈ ఊరు వచ్చేను. అప్పుడు నా బస ఎక్కడో తెలుసునా, ఇందాకా నువ్వు చూపిన ఆయింట్లోనే.

ఊఁహూఁ మరి నువ్వేమీ మాట్లాడకు నన్ను సాంతం చెప్పనీ.

అప్పుడు నేను నా వయస్సుకి తగినంత ఒడ్డు పొడవులతో ఉండేవాణ్ణి కాను. అందరూ నాని జమయిన వయస్సుకి రెండేళ్లు తక్కువగానే ఊహించేవారు. ఒక్క ఒడ్డుపొడవుల్లోనే కాదు. తక్కినవిషయాల్లోకూడా నాయీడు విద్యార్థులకంటె చాలా వెనకబడి ఉండేవాణ్ణి. ఒక్కస్కూలు మార్కులలో తప్ప. వాటిలోనూ మొదటిమార్కులు ఎప్పుడూ లేదుగాని, మొట్టమొదటి ముగ్గురు నలుగురు విద్యార్థులలోమా లెక్కకి వచ్చేవాణ్ణి. కాక,మరీ చిన్నవాడులాగా కనిపించడంమూలానకూడా లెక్చరర్లకీ తోడి విద్యార్థులకీ నేనంటే చాలా అభిమానం.

ఇంటికి వెనకభాగంలో ఒక డాబా. అంది మీద పిచ్చికగూడులాగా ఒక చిన్నగది. అది నా గది. దానికి నెలకి మూడురూపాయిలు అద్దె ఇచ్చేవాడిని. 'అనగాలసౌధంబుదాపల అన్నట్లు అన్ని వరండాలూ ద్వారాలూ దాటుకొని ఆ లోపలికి ఎందు వెళ్తాడయ్యా' అంటూ ఉండే వారు ఉన్న కొద్దిమంది స్నేహితులున్నూ. నాకు కావలసిందీ అదే. కాక అప్పుడు నాకింకొకగర్వముండేది, నా స్నేహితులు పేరుకూడా వినని ఎన్నెన్నో పుస్తకాలు చదివేనని. అప్పటికి కాలేజీలైబ్రరీలోనూ మునిసిపల్ లైబ్రరీలోనూ ఉన్న ఇంగ్లీషు నవలలలో నేను చదవనిది ఒక్కటిలేదు.

ఈ నా ఎల్లప్పుడూ చదువుకొనే అలవాటు వల్లనయితేనేమి, అదివరకుండే కుఱ్ఱవాళ్లలాగా నాసురించి పదిమంది స్నేహితులు వచ్చి గోల చెయ్యకపోవడంవల్లనయితేనేమి, నేనయినా ఎంతో మంచి ఫిలిమయితే మొదటి ఆటకి వెళ్లడం తప్ప, మామూలువిద్యార్థులలాగా తరుచు రెండవ ఆటకి వెళ్లి నడిరాత్రప్పుడు తలుపు తెరవమని గోలచెయ్యకపోవడంవల్లనయితేనేమి, మొత్తంమీద ఆ యింటిలో ఉండే మూడు కుటుంబాలవారికీ నేనంటే చాలా అభిమానంగానూ, గౌరవంగానూ కూడా ఉండేది. తరచు వాళ్ళ వాళ్ళ పిల్లలకి బుద్ధిచెప్పే సందర్భాలలో, నన్నొక ఆదర్శవిద్యార్థిగా లెక్కించి, "మూడు మేడమీద భూషణం, ఎప్పుడు భోజనానికి వెళ్తాడో ఎప్పుడు వస్తాడో, కాలేజీ ఉన్న రోజుల్లో తిన్నగా కాలేజీకి వెళ్ళివస్తాడు. అంతే. మరి ఒకళ్లజోలీ శొంఠీ తన కక్కరలేదు. అలా తన మానాన తను కూర్చొని చదువుకొంటాడు. అదీ బాగుపడేవాళ్ల లక్షణం" అంటూ ఉండేవారు.

ఇదంతా ఎందుకు చెప్పవలసివస్తున్నాదంటే, నేను అని మొదలుపెట్టి నా కథ చెప్తాంటేను అప్పుడూ ఇప్పుడూ ఒక్కలాగే ఉన్నాను కొంటారేమోనని. నిజానికి అప్పటి నా అశక్తినీ, ఒంటరితనాన్నీ తలుచుకొంటూఉంటే, ఇప్పుడు నాకు చికాకుగానే ఉంటుంది. సరే ఏదయితే నేం. జరిగినదేదో ఫలానారకంగా జరిగిందని చెప్పుకోవడంకంటె మనం చేయగలిగింది ఏమీ లేదు.

అట్టే డొంకతిరుగుడు లేకుండా అసలువిషయానికే వస్తున్నాను.

అవతల తాను ఎన్ని ఇబ్బందులుపడిఅయినా సరే, మా చిన్నాన్న నాకు పుష్కలంగానే డబ్బు పంపించేవాడు. అంటే ఒకటి, కాలేజీ జీతమూ, హోటలుకి ఇవ్వవలసినదీ కాక, ఎక్కువ ఎంతఅయినా నాకు ఎక్కువ అన్నట్లుగానే ఉండేది. ఆ యింటిలోని ముగ్గురు గృహస్థులూ అప్పుడప్పుడు నాదగ్గర రెండూ,మూడూ, అయిదూ చొప్పున పదిలోపుగా వాడుకొంటూ ఉండడమూ, మళ్లీ వీలునిబట్టి తీర్చేస్తూఉండడమూకూడా అంత అరుదైన సంగతి కాదు.

అప్పుడు ఇంటర్మీడియేటు పరీక్షకి డబ్బు కట్టవలసిన రోజులు. పరీక్షడబ్బూ, కాలేజీకి కట్టవలసిన జీతమూ, సైన్సులేబరేటరీలో నాచేత పగిలిన రెండుమూడు వస్తువుల ఖరీదూ, రైలులో పోయిన. ఒక లైబ్రరీపుస్తకంఖరీదూ, అంతా మొత్తం అరవైఎనిమిదిరూపాయిలు కట్టవలసి వచ్చింది. అదివరకు ఎప్పుడో మా చిన్నాన్న పంపినబాపతు నా దగ్గర మిగిలిఉన్నవి ఇరవైరెండే రూపాయిలు.

మా చిన్నాన్నదగ్గరనుండి, ఉత్తరం డబ్బూ రానన్నాళ్లూ, ఇంకా రేపు వస్తుంది ఇవాళ వస్తుంది అని ఎదురుచూసేవాణ్ణి ఎందుకయినా మంచిదని రెండురోజులకొక ఉత్తరం రాసి పడేస్తూ. చివరికి, మామూలు తేదీయేకాక, ఫైనుతో యూనివర్శిటీకి డబ్బు కట్టవలసిన రోజు కూడా సమీపించింది. మరి ఆలస్యం చెయ్యడానికి వీలులేదు. నా సైరు అందడమే తడవుగా టెలిగ్రాము మనియార్డరు వస్తుందనుకొన్నాను. కాని, నేను పోస్టాఫీసునుండి ఇంటికి వచ్చేసరికి అంతకు మూడురోజుల క్రితం మా పొరుగింటి ఆయన రాసిన ఉత్తరం వచ్చి ఉంది. మా చిన్నాన్న బ్రహ్మాండమయిన జబ్బుతో, ఏమిటో వివరాలులేవు. బాధపడుతున్నాడనీ, అంతకాలం నేను గాభరాపడతానేమోనని తెలియచేయవద్దన్నాడనీ, ప్రస్తుతం ఎక్కడలేని డబ్బూ ఆయన మందుఖర్చులకీ, డాక్టర్ల రాకపోకలకీ చాలటంలేదనీ, ఒకవారం పదిరోజులు గడువిమ్మని కోరవలసిందనీ, లేదా నేనే ఏదోవిధంగా సర్దుబాటుచేసుకోవలసిందనీ ఆ ఉత్తరంసారాంశం.

నాకు విచారమూ, ఆశ్చర్యమూ, నవ్వు అన్నీ కలిగేయి ఆ ఉత్తరం చూడడంతోనే.

ఏమిటి చెయ్యడం! అక్కడికి వెళ్లి చెయ్యగలిగింది లేశమాత్రమూ లేదు. కాక, ముందు ఈ డబ్బంటూ ఏదోవిధంగా కట్టేస్తే, తరవాత అక్కడికి వెళ్ళి ఒక నాలుగురోజులుండి అక్కడే చదువుకొంటూ ఉన్నా బాధ లేదు అనిపించింది.

ఇంటిలో నాదగ్గర చిల్లరమల్లరఅప్పులు తీసుకొన్న గృహస్థులు తీర్చిఉంటే మరొక ఇరవైనాలుగు రూపాయిలు చేరిఉండేవి. కాని అదేమిఖర్మమో వేళకి అందరూ అతివిచారాన్ని సూచించేవారేకాని, ఒక్కరూ ఒక్క దమ్మిడీ అయినా ఇవ్వలేదు. మరొక్క వారం రోజులు పోతే వందరూపాయిలయినా ఇవ్వగలనని ఒకాయనా, అయ్యయ్యో నిన్న కాదు మొన్ననే ఒకరికి ఇరవై రూపాయిలు ఇచ్చేసేను. అప్పుడే తెలిసిఉంటే ఎంతబాగుండును అని ఒకాయనా, ఏం, ఉంటే నీకేం ఉచితార్థం ఇవ్వాలా అని ఇంకొకఆయనా ఇల్లా ఏదో ఒక పద్ధతిని అందరూ అన్ని కారణాలు చెప్పేరు. నిజమే అయుండవచ్చును వాళ్ల కారణాలు. కాని,నాకు మాత్రం వాళ్లంతా కక్షకట్టి ఏదో ఘోరమైన అన్యాయం చేస్తున్నట్లు కనిపించేరు అప్పటి ఉడుకుబోతుతనంలో.

ఎవరినయినా తోడివిద్యార్థుల నడగడం ఒక్కటే మిగిలిఉంది. కాని, అందరికీ అవసరమయిన సమయమే. కాకపోయినా అంత డబ్బు ఒక్కమారు ఎవరియ్యగలరు. అయినా మూడు నాలుగు చొప్పునయినా అడిగి, సేకరించాలని పించింది లీలగా మనస్సులో. కాని, ఎంచేతో

(18 పేజీ-చూడుడు)

మనరాష్ట్రం: మనదేశం:

వ్యవసాయ సంస్కరణలు: ★ విచారణసంఘు నివేదిక

డాక్టరు రాజేంద్రప్రసాదు కాంగ్రెసు అధ్యక్షులుగా ఉన్నప్పుడు రివెన్యూమంత్రుల సమావేశముసలహామీద వ్యవసాయసంఘము ఒకటి నియమించారు. ఈ రివెన్యూ మంత్రుల సమావేశం 1947 డిసెంబరులో జరిగింది.

ఈ సంఘము తయారుచేసిన నివేదిక భూమి దున్నే రైతులకే చెందాలనీ, వ్యవసాయంలో దళారీ లుండరాదనీ నొక్కి చెబుతున్నది.

వరసగా 6 సంవత్సరాలపాటు భూమిదున్నే వ్యక్తికే భూమి చెందాలని ఈ సంఘం అభిప్రాయపడింది. ప్రత్యక్షంగా వ్యవసాయంలో పాల్గొంటూ, కొంతవరకైనా కాయకష్టంతో పనిచేసే భూస్వాములు వ్యక్తిగతంగా వ్యవసాయం చేస్తున్నట్లు పరిగణింపబడతారు.

రైతులను భూములనుండి తొలగించే పద్ధతి నుండీ, వారిదగ్గర అన్యాయముగా ఎక్కువగా శిస్తులు వసూలుచేసేపద్ధతినుండి రక్షించాలని కూడా ఈసంఘము సిఫారసుచేసింది. కాంగ్రెసు కార్యవర్గం ఈ వ్యవసాయసంస్కరణసంఘము చేసిన సూచనలననుసరించి చర్చింపగలదని తెలుస్తున్నది.

జె. సి. కుమారప్పగారు ఈ సంఘానికి అధ్యక్షులుగా ఉన్నారు. ఈ సంఘము రాష్ట్రప్రభుత్వాలకు, కాంగ్రెసు సంఘాలకు, విశ్వవిద్యాలయాలకు, కొంతమంది ప్రముఖులకు, ఒక ప్రశ్నావళి పంపించింది. ఈ ప్రశ్నావళికి సుమారు 2 వందలమంది ప్రముఖులు సమాధానాలు పంపించినారని తెలుస్తున్నది.

దేశంలో వివిధములైన వ్యవసాయపద్ధతులను మనస్సులో ఉంచుకొని ఈ సంఘము ముఖ్యంగా ఈ క్రిందిసూచనలు చేసింది.

(1) వ్యవసాయవ్యవస్థవల్ల రైతువ్యక్తిత్వం సర్వతోముఖంగా అభివృద్ధి చెందాలి.

(2) ఒక వర్గం మరి ఒక వర్గాన్ని దోచుకోడానికి ఎంతమాత్రము అవకాశం ఉండకూడదు.

(3) వీలైనంత ఎక్కువగా ఉత్పత్తి చెయ్యడానికి అవకాశాలు కల్పించాలి.

(4) సంస్కరణలు ఆచరణయోగ్యంగా ఉండాలి.

(5) ఒక్కొక్క రైతుకు ఎంతెంత భూమి ఉండాలి అన్న విషయం ఆయాప్రాంతాల ఆర్థికానుకూలాన్ని బట్టి నిర్ణయించాలి. ఒక రైతుకు ఎంతవరకు ఎక్కువ భూమి ఉండాలో కూడా సంఘం సూచించింది. అయితే కొన్ని కొన్ని సందర్భాలలో ఈ సూచనలకు సడలింపులు ఉండవచ్చునని కూడా ఈ సంఘంవారు అభిప్రాయపడ్డారు.

ఈ సంఘం సహకారపద్ధతిని వ్యవసాయం చేయించడం అవసరమని సూచిస్తూ ఇది క్రమక్రమంగా అమలులోకి రావాలని వ్రాసింది.

వ్యవసాయపరిశోధనకు ప్రభుత్వం అధీనంలో కొంతభూమి ఉండడం అవసరమనికూడా ఈ సంఘం నిర్ణయించింది. భూమిహక్కువిషయంలో ఈ సంఘం కొన్ని కొత్త సూచనలు చేసింది. వ్యవసాయం బాగా సాగాలంటే భూమిహక్కుదారు తన ఇష్టంవచ్చినట్టు భూమిని వినియోగపరచడం మంచిదికాదని అభిప్రాయపడింది. కొన్ని నియమాలకు లోబడి రైతు భూమిని దున్నుకోవాలని కూడా ఈ సంఘంవారు అభిప్రాయపడ్డారు.

ఈ సంఘం ఆ తరవాత వ్యవసాయదారుల ఋణాలనుగురించి చర్చిస్తూ ధాన్యం ధరలు ఎక్కువయినా రైతుల ఋణభారం తగ్గలేదనీ రైతుల ఆర్థికావస్థలననుసరించి వారి ఋణాలు క్రమంగా రద్దుపరచాలని అభిప్రాయపడింది. వ్యవసాయ కూలీలైతే వారి అప్పులు పూర్తిగా రద్దుపరచాలని కూడా ఈ సంఘంవారు అభిప్రాయ పడ్డారు.

తరవాత వడ్డీవ్యాపారము చేసేవారు సక్రమంగా వ్యాపారం చేసేటట్లు చూడవలసిన ఆవశ్యకత ఉన్నదని కూడా, వీరు సూచించారు.

ఆ తరువాత ధాన్యంసరఫరానుగురించి వ్రాస్తూ సహకారసంఘాలద్వారా ధాన్యం అమ్మకం జరగాలనీ ధాన్యంకొట్లు నిర్మించాలని ప్రధానంగా సూచించారు.

ఆ పిమ్మట వ్యవసాయకూలీల పరిస్థితులను గురించి వ్రాస్తూ ఈ సంఘంవారు వెట్టిచాకిరీ మొదలయిన పద్ధతులు మద్రాసు గుజరాతు ప్రాంతాలలో ఉన్నాయనీ, ఇవి వెంటనే రదు చెయ్యాలనీ అభిప్రాయపడ్డారు.

వ్యవసాయదారులకు ధాన్యానికి న్యాయమైన ధరలు ఉండేటట్లు చూడాలనీ ఇన్స్యూరెన్సు ద్వారా వారికి సరియైన ప్రతిఫలం ముట్టేటట్లు చూడాలనీ, వ్యవసాయానికి సంబంధించిన లెక్కలు జాగ్రత్తగా వ్రాయించడం చాలా అవసరమనీ, దీనివల్లగాని వ్యవసాయ పరిస్థితులు తెలుసుకోవడం కష్టమనీ, సంఘంవారు సిఫారసులు చేశారు.

రంగా, రామస్వామి రెడ్డిగార్ల ఆక్షేపణ

కమిటీలో సభ్యులుగా నున్న మద్రాసు మాజీ ప్రధాని ఓ. పి. రామస్వామిరెడ్డియారు గారును, ఆంధ్రరాష్ట్ర కాంగ్రెసుకమిటీ ప్రెసిడెంటగు ప్రొఫెసరు యన్. జి. రంగాగారును పై జెప్పిన అధిక సంఖ్యాకులగు కమిటీ సభ్యులతో ఏకీభవించక తమ భేదాభిప్రాయములను క్రోడీకరించుచు మరొక నివేదికను తయారు చేసి సమర్పించిరి. ఈ అల్పపక్ష నివేదికయొక్క ప్రతులు, ఈ వ్యవసాయసంస్కరణ కమిటీని నియమించియుండిన కాంగ్రెసు ప్రెసిడెంటగు డా॥ రాజేంద్రప్రసాదుగారికిని, యీ కమిటీ అధ్యక్షులగు జే. సి. కుమారప్పగారికిని, కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులకును పంపబడెను. వీరిద్దరి ప్రత్యేక నివేదికలో అధిక సంఖ్యాక కమిటీసభ్యుల నివేదికాంశమును యీ క్రిందరీతిగా ఖండించుచు వ్రాసిరి.

మెజారిటీ సభ్యుల నివేదికలోని సిఫార్సులను అనుసరించే యెడల, భూఖామందులకును, సేద్యముచేయు రైతులకును చాల అనర్థదాయకమైన కోర్టుతగాదాలు సంభవింపగలవు. భూమికి సొంతహక్కు అనేదిన్నీ సాగుచేసుకునేహక్కు అనేదిన్నీ వేర్వేరుగా పురాతన కాలము నుండియు ఉన్నట్లుగా మనుస్మృతి మొదలైన గ్రంథములవల్ల తెలియుచున్నది.

నేలహక్కు, సాగుహక్కు ఇవి రెండున్నూ సమష్టిగా ఒకరియందే ఉండే పద్ధతిని వీలైనంత వరకు అత్యధిక సంఖ్యాకులకు సౌకర్యము కలుగజేయవలెననియే మేము సంకల్పించియున్నాము. ఆ రెండు హక్కులను వేర్వేరు అసాములకు కల్పించుటయను పద్ధతి వీలైనంతవరకు తగ్గించవలెనని మా ఆశయము. కాని, దుర్బలశరీరులు, పోషకులు లేనివారు, వితంతువులు, మైనర్లు, దేవాదాయ ధర్మాదాయ సంస్థలు మొదలైన విషయములలో భూములను గుత్తకివ్వవచ్చును. చట్టబద్ధమైన కట్టుబడి రేట్లకు లోబడి కవులు కీయవచ్చునని మెజారిటీ రిపోర్టులోని అంశమును ఆమోదించుచున్నాము. రైతులకు, భూఖామందులకు మధ్య ఉండవలసిన పరస్పర సంబంధములను గూర్చి మీరు (అనగా అధిక సంఖ్యాక కమిటీ సభ్యులు) మీ నివేదికలో సూచించిన సలహాలను అనుసరించే యెడల ఉభయులకు అనర్థదాయకమైన కోర్టు తగాదాలు వృద్ధికాగలవు. కనుక, మేము యీ భిన్నాభిప్రాయ నివేదికలో ఏ ప్రత్యేకదృక్పథము ననుసరించితిమో ఆ దృక్పథమునే మీరు కూడా అనుసరించేయెడల, మీరు మీ నివేదికలో సూచించిన అనేక సలహాలలోని చిల్లర అంశములను ఆమూలాగ్రముగా మార్చుకోవలసివచ్చును.

దేశములో ఉత్తరోత్తర వ్యవసాయవిధానమును సంస్కరింపదలచినయెడల 10 ముఖ్య సూత్రములను గమనించవలెను. వీటిని అనుసరించేయెడల వ్యవసాయమునందు నిమగ్నులైయున్నవారి కందరికిని జీవితము సుఖముగా హాయిగా సాగ మండగలదు. ఆ పది ముఖ్యసూత్రము లేవి యనగా:—

(1) వ్యవసాయదారులైన వారిలో అత్యధిక సంఖ్యాకులకు వ్యవసాయభూములయందే మక్కువ కలదు. అట్టి మక్కువను వారు సద్వినియోగము చేసికొని ఆర్థికంగా వారు స్వతంత్రజీవనం చేయగల్గుటకై వారికి అవకాశములను కలుగజేయవలెను. వారు నివసించెడి ప్రాంతములో వారికి సాధ్యమైనంతమేరకు ఎక్కువపంటను వారు పండింపగల్గుటకును, జీవితసౌకర్యములను వృద్ధిచేయగల్గుటకును అవకాశము లీయవలెను. (2) ప్రస్తుతము ఏ రైతులైనను భూమిలో సాగు హక్కులను కలిగియున్నయెడలను, భూస్వామ్యము కలిగియున్నయెడలను, భూములలో భవనములను నిర్మించుకొని యుండిన యెడలను అట్టి హక్కు స్వామ్యములను గౌరవించవలెను. ప్రభుత్వంగాని, కో-ఆపరేటివు సంఘంగాని, ఇదితరులుగాని అట్టి రైతుల హక్కులను తొలగించి వాటిని తీసికొనేయెడల, రాజ్యాంగ చట్టములోని 24 (2) నిబంధన ప్రకారముగా సక్రమమైన నష్టపరిహారమును యిచ్చి తీసికొనవలెను. (3) ఏ రైతున్ను అతని భూమిలోనుండి అతనిని తొలగించేయెడల, అతనికి అన్యత్ర జీవనోపాధిని చూపించిననే తప్ప, నష్టపరిహారమిచ్చినప్పటికి, అతనిని నిర్బంధవిధిగా తొలగింపగూడదు. (4) ఏ గ్రామములోని, లేదా ప్రాంతములోని రైతులందు మూడింట రెండు వంతులమంది అంగీకరించిననే తప్ప ఆ గ్రామంలో అమలునం దున్న వ్యవసాయ అమరకపు విధానమును మార్పుచేయకూడదు. అట్టి నూతన భూవినియోగవిధానములోనికి గాని, నూతన వ్యవసాయసంస్థలోనికిగాని చేరవలసినదిగా ఏ రైతును నిర్బంధింప వీలులేదు. (5) వ్యవసాయవృత్తివంతులకును, వ్యవసాయేతర వృత్తివంతులకును దేశములో గలసంపద సమవిభాగమై ప్రస్తుతము లేనందువల్లను అట్టి అసమవిభాగము వ్యవసాయవృత్తివంతులకే నష్టదాయకముగా నుండుటవల్లను, అట్టి వ్యత్యాసమును వీలైనంత త్వరలో తొలగింపవలెను. (6) వ్యవసాయములో పనిచేయు పనివాండ్లకును, యితర రంగములలో పనిచేయు పనివాండ్లకును కూలి రేట్ల విషయంలోను, యితర, కార్మిక సౌకర్యముల విషయములోను సమప్రమాణమును వెంటనే కల్పించవలెను. (7) వ్యవసాయమునే వృత్తిగా కలవారు దానివల్ల జీవింపగల్గునట్లుగా ఆర్థిక స్వతంత్రతను వారి వ్యక్తివికాసమునకు అవకాశమును, వారికి కలుగజేయవలెను. (8) పరస్పరము వంచనచేసి పీడించుట వ్యవసాయ విధానములో వుండరాదు. (9) వ్యవసాయము వల్ల గరిష్ఠసస్యోత్పత్తి కలుగవలెను. వీలైనంత అత్యధిక సంఖ్యాకులకు వ్యవసాయవృత్తిని కల్పించవలెను. (10) చేయదలచిన వ్యవసాయ విధాన సంస్కరణములు ఆచరణయోగ్యములై యుండవలెను.

ఈ పది సూత్రములలోను చివరి నాలుగు సూత్రములను మాత్రమే కమిటీ అధికసంఖ్యాక సభ్యులు వ్రాసిన నివేదికలో అంగీకరించిరి. కాని మొదటి ఆరుసూత్రములను అంగీకరించియుండలేదు. ఏ గతా ఆరుసూత్రాలనకూడా అంగీకరిస్తేనే తప్ప యీ దేశంలోని వ్యవసాయదారుల స్థితి బాగుపడదు. అంతేగాక-పంట వృద్ధి కాదు.

భూవసతుల విస్తీర్ణపరిమితి:

ఒక్కొక్క అసామికి ఎంత భూవసతి ఉంటే జీవింపగలడో, అట్టి ఆర్థికజీవనాధార భూవసతియొక్క కనిష్టవిస్తీర్ణపరిమితి ఎంత ఉండవలెనో నిర్ణయించుటకు ఆయా ప్రాంతముల భూసారములనుబట్టియు, వర్షాధారములనుబట్టియు ఇతర నీటి వనరులనుబట్టియు సాధ్యమగును. కనుక, అన్ని ప్రాంతాలకు, ఏకతీరుగా శాశ్వతంగా వర్తింపజేడి పరిమితిని నిర్ణయింప వీలులేదు. ఒక జతఎద్దులు కలవాడు ఎంత పొలమును సాగు చేయగలడో, ఆ జతఎద్దులను భరించుటకు ఎంత పొలము ఉండవలెనో ఆ లెక్కనుబట్టి ఆర్థికాధారమైన భూవసతిపరిమితిని నిర్ణయించవచ్చు నను వాదన పనికిరాదు. ఎందుకనగా [illegible] కొత్తర ఎద్దులజతలతో గాక, మరనాగళ్లు ట్రాక్టరులతో వ్యవసాయము చేయగలరు. కనుక ఎద్దులజతలతో చేయబడు సాగును ప్రమాణంగా స్వీకరింపతగదు.

ఇక అత్యధిక వ్యవసాయభూమి [illegible]మితి ఏ అసామికైనను యెంత ఉండవలెనను విషయములో స్వతంత్రజీవనోపాధికి కనీసం యెంత ఉండవలెనో దానికి మూడు రెట్లుగా గరిష్ఠపరిమితి ఉండవలెనని ఈ కమిటీసభ్యులలోని అధికపక్షమువారి నివేదికలో వ్రాయబడెను. కాని గరిష్ఠపరిమితిని ఈ రీతిగా నిర్ణయించరాదు. వ్యవసాయమునందేమి, ఇతరవ్యాపారరంగములందేమి ఎవరికైనను గరిష్ఠఆదాయప్రమాణము ఎంతవరకు ఉండవలెనను విషయమై నిర్ణయించుట కొక కమిటీ ఏర్పడవలెను. ఆ కమిటీ నిర్ణయించిన గరిష్ఠప్రమాణాదాయపరిమితినిబట్టియే వ్యవసాయభూవసతుల గరిష్ఠవిస్తీర్ణమును కూడా నిబంధించవచ్చును. ఎందువల్ల ననగా అన్ని వ్యాపారరంగములందును ఒక సూత్రమును వర్తింపజేయవలెను. కనిష్ఠపరిమితికి అయిదు మొదలు 10 రెట్లవరకు గరిష్ఠపరిమితి యుండవచ్చునని మా అభిప్రాయము.

నిర్బంధసహకార వ్యవసాయము పనికిరాదు:

ప్రతి గ్రామంలోను వ్యవసాయమును సహకారసంస్థద్వారా జరిపించుటకు ప్రభుత్వము పూనుకొనవలెనని యీ కమిటీ అధికపక్ష నివేదికలో సూచింపబడెను. కాని, అట్టి సహకార సంస్థల నేర్పాటుచేసి వ్యవసాయమును ఆ సంస్థల ద్వారా సాగించుటకు తగినంతమంది సహకార వ్యవహారనిర్వాహకులు లేరు కనుక నిర్బంధవిధిగా సహకార వ్యవసాయవిధానమును అమలుపరచవలెనను సిఫార్సును మేము ఆమోదించము. కాని, డెన్మార్కు, నార్వే, అమెరికా, సంయుక్తరాష్ట్రములు, కెనడా రాజ్యములందు సహకారసంస్థలద్వారా వ్యవసాయము జయప్రదంగానే సాగుచున్నదిగనుక, ఆ వ్యవసాయ పద్ధతిని మేముకూడా ఆమోదించుచున్నాము. స్వంత పెట్టుబడిదారులకు భూఖామందులకు గల సొంతలాభసౌకర్యములన్నియు అటువంటి సహకార వ్యవసాయమునందును కలవు. వారిలోని వ్యవసాయదారులందు ముప్పాతికవంతుమంది సహకారవ్యవసాయమే తమ ప్రాంతానికి లేదా గ్రామానికి ఉండవలెనని తీర్మానించిన యెడల, అట్టి సహకారవ్యవసాయములో చేరవలెనని మిగిలినవారిని కూడా నిర్బంధింపవచ్చును.

వ్యవసాయమువల్లనే దేశానికి ఆహారపదార్థములున్నూ, కట్టుకొనుటకు బట్టలున్నూ లభించ

(21 వ పేజీ చూడుడు)

[కోడి కూస్తూఉంటుంది]

రామయ్య : దీని కేం పని లేనట్టున్నది, కూస్తున్నదప్పుడే. ఇక నిద్ర పూర్తి అయినట్టే లేదు. కండ్లరెప్పలు బరువుగ లేస్తున్నాయి. ఏమున్నగాని, నాకు తెలివైంది. దాన్ని గూడ లేపుతా—ఏమేయ్!—ఇగో! — లేవేయ్ అంటే!

మల్లమ్మ : ఊఁ!—ఎంటిదీ మోటుతనం—కొంచెం పండుకోనియ్యి.

రా : ఇంక అద్దరాత్రనుకున్నావా ఏంటిది! కోడి కూసింది—కోడీ!—తొలికోడి!

మ : ఊకె బొంకకు. రెండు కూగ్కలన్న దీనివట్టు లేదుగని, కోడికూసిందంట—కోడి! కలగిట్టపడలేదుగద—లేకుంటె కలవరిస్తున్నవా?

రా : అవు. పిల్లకు కంటినిండ నిద్రపట్టలేదని కోడి కయ్యకుంటనే కూకుంటుంది. పొద్దుకూడ పొడువకుండనే ఉంటుంది.

మ : ఏదీ ఎవలకోసం ఆగదు. లేస్తనిగ తీ.

రా : ఆ—గట్ల తొవ్వకు రా— నెగడు రాదు కున్నదేమో సూడు—సుట్టమీద కింత ఇంగలం పట్కరా.

[నెగడులో కట్టెలు జరిపిన చప్పుడు]

మ : అయ్యో! నెగడు చల్లారిపోయింది. రాత్రి చినుకులు పడితే నాన్పిదడ్వా అనుకున్న. సాంలేటి అననే దంచినట్టున్నది. కప్పసింది లేమో—నెగడు సల్లారిపోయింది.

రా : ఏదీ సూతాం—అయితే ఉప్పరెంకయ్యను పిల్చి చూపించాలె. నాల్గుదినాలుగా లేదు షల్లుకప్పి. హాలంపత్తె టి గిదె తంట. కూలి పైకము తీస్కోనేది పరిగ నేకనీ—రెక్కవంచి పని జెయ్యాలంటే పానంమీదికి వస్తది.

మ : మన్ను పెట్టి నిదానంగ పనిసెయ్యకుంటె కూల్లకు పైస ఎల్లు పెనబెడ్తదోనంట—ఏదీ-జల్దిల చకముక గొట్టు, నీకు సుట్టమీదికీ, నాకు పొయ్యి రాజేసేతందుకు. ఇద్దరి పని ఎల్లుతది.

[చకముకి కొడ్తాడు]

రా : నీవు పిల్లగాన్ని లేపు. కోలుకాడికి పోతె బాగుంటుంది. కూరగాయలమడీ, ఉల్లి నారు, గిట్ట చూసి వస్తుండె. నేను కొట్టంలకి పోతున్నా.

మ : అట్లనే తీ—నువ్వయితె బో.

[రామయ్య పోతాడు]

అ దెక్కడి మాట. కోలతేతాం రా అంట ఆడకట్టోల్లు పట్టుకపోతే పోయిండు కొడుకు. ఆడుకోని ఇంటి కొచ్చెటాల్లకు అద్దరాత్రి అయింది. అల్సిపోయిండు యాల్లపూట పండుకున్న ముసల్దాన్ని, నాకే నిద్ర సాలనట్టున్నది. పడ్డుసుపానం! పొల్లగాని కెట్లుండాలె!—ఊఁ!—పోతడుగని తీ, తెల్లారినాంక. ఇప్పటంతె మున్గిపోతున్నదె ఆడ!

[రామయ్య తిరిగి వస్తాడు]

రా : పిల్లగాడు లేవలే ఇంక. అగో! నువ్వు కూడ ఇక్కడ్నే కుచున్నావు...ఎచ్చగ కాపుకుంట!

మ : కొట్టంలో నీపని అంత అయినట్టే మాట్లాడుతున్నవు.

రా : అట్టి పెడ్తనుకుంటివా నీ మన్నుకు! ఆడిగోజలను లేపిన. దుడ్డెను—బర్రెను—ఏరే ఏరే గుంజలకు కట్టేసిన. మొన్న అలసుర్చిన కోడెను—పొట్టి కొమ్ముల గిత్తను, కోటకాడికి నర్సయ్య కొట్టుక పోతడేమోనని, ఈవల్కి కొట్టుకొచ్చి కిట్లకొట్టంకు కట్టేవేసిన—అతగాడింక లేవకనన్న సాయె!

మ : ఆడకట్టోల్లు ఆటకోసానికి ఈడ్చుక పోయింది గుర్తే ఉండె—ఇంకా లేవలేదంటవు!—అది పోనిగని, దీనికేమనాలె నిన్ను; నిన్న రాత్రి ఇంత అనగొట్టింది గుర్తే ఉండె—మోటగొట్టటందుకు! ఎడ్లను తీస్కరాకడా సరే—మోటకోలుకు కొట్టుకపోకడా సరే!

రా : నీవద్దనే ఎడ్డోన్నయిపోతి!—(ఇద్దరూ నవ్వుకుంటారు). అవుగని, బర్రెనన్న పిడుకతవా, అదీలేదా. దానికేమన్న గిట్లనే సెత్తవా?

మ : తెల్లారలేదు—మొదలైందేమో ఇగ. నాపంతు పని నేను శెయ్యనన్ననా? ఎచ్చగ కుంపటిముందు ఎందుకు కూసున్నదిరా ఇది అనిపిస్తున్నదిలే నీకు? నువ్వు దెచ్చిన సన్నటి

శ్రవ్యనాటిక :

పొలం పని

శ్రీ వెల్దుర్తి మాణిక్యరావు

పొలమూరుగొంగడి కప్పుకుంటె శెంటలొస్తున్నాయి—అబ్బ—

రా : మా అత్తగారు పెట్టిన పట్టంచుదోతులు శీలమండలకు తట్టుకుంటున్నయి!

మ : మీ మొగోల్లకు ఎం తిచ్చినా ఆస తీరదు. కావాలె, కావాలె, అనే మాటనే. ఇంతకీ ఏం తక్వ శేశింద్రు అంట మావోల్లు? ఇంతకంటె ఎవరెక్వ పెట్టింద్రో—ఏది చూపియ్యి. ఎనకటి దంత యాజ్జేసి నాకు కోపం దెప్పియ్యకు!

రా : బల్లి తీర్గ మాటకు మాట గుంజకు! కోడలుపిల్ల నన్న లేపి కుండలకాడికి తోలు. నువ్వు పాలు పిండబో—పని జర్గుతుందని.

మ : నువ్వన్నట్లు పొద్దుపొడిస్తె పుట్టేడు పన్ల. లచ్చవ్వా!...ఓలమ్మా! లెవుబిడ్డ—లెవు. తెల్లారుతున్నది.

లచ్చు :...ఆ...అస్తున్న అత్తా.

[గదిలోంచి వస్తుంది]

అత్తా! మశిదికాగుకింద అగ్గేసి, కుండలు కడిగెటందుకు పోదునా.

మ : పో—కని, పాలకుండలు మొదలు కడుగు. అట్లనే పాలదాయికూడ రాజెయ్యి.

[రామయ్య కొట్టంల కెల్లివస్తడు-అంబా అంబా అంట ల్యాగలు ఒర్లుతయి. నర్సయ్య లేచివస్తడు]

రా : లేసినావు బిడ్డ-దా - కూసో—కొంచెం బిరాన లేసుంటె, కోటకాడికి పోతుంటివేమో అనుకున్న.

నర్సయ్య : ఇప్పటికైనా ఏసుంత ఆలస్యం గాలె. పోతె పొద్దున్నది. కనీ, నన్నడుగుతె, ఈయాల్ల రేపు ఆ మాటనే వద్దంట. ఎల్లుండి అంగడి. పొద్దున్నె పోయి గంపెడు ఉల్లగడ్డ తెస్త. చుట్టోగ నాటిన కంపకు ఏమన్న బీరపిందెలు పడొచ్చు. అవ్విగూడ తెంపుకొస్త. ఒక్కపెట్టున అమ్మితె, శేతినిండ యాగాండ్లు కండ్లబడతె. బర్కతుంటది. ఇప్పుడు కలుపు సంగతి చూస్కోవాలె మనం.

మ : లేసినావు బిడ్డ—నువ్వు లేపలేదని మీ అయ్య ఇది జేస్తున్నడు. కలుపుమాటనే మాట్లాడుకోండి.

న : నేనూ ఆ మాటనే తీస్తున్న. ఈయాల్ల రేపు కలుపు ఎల్లకుంటె, పంట శేతికి రాదనుకోవాలె.

రా : నేను అద్దూ అంటున్నాను. కాతనైనంత శేస్తనే ఉంటి. రెండు దినాల సంది, మాలోల్ల ఆడకట్టుకు—తెన్గోల్ల ఆడకట్టుకు తిర్గినోన్ని తిర్గినట్టే. భతిమిలాడ్తి—బామాడ్తి. రాకపోయిరి. "నీకేం పో! పదిమందిని తోల్కని సక్కంగ మీ పొలాలకే అస్తిమి" అన్నది. కూసున్న, కూసున్న. మూడుమాట్లు సుట్ట నింపుకున్న. 'ఇగో ఇది రాదు!—అగో అది రాదు!' అనబట్టె.

న : ఎవ్వరే అది

రా : బాలవ్వరా—మూలమీద ఉంటది సూడు—శాదబాయిపక్కకు.

మ : కొమ్ముబాలవ్వ అను. అది అసుంటిదే. ఎప్పుడు జూసినా అగావు కూల్లు తీస్కుంటది. మందిని జోపుకొస్తనంటది. కాని, దాందగ్గిర ఇంకో పాడుగునం మిడ్కిపోయింది. దినదినం కూల్లు పెంచుతది. ఎక్వకూలి స్తేనే పనిమీదికి పోవాలంట తిర్గుతది—ఎంతో పని ఉన్నట్టు!

న : ఎట్ల మాట్లాడ్తవే అవ్వా! దాం దా పాడుగునం - మనదా? నేను తవ్వడేస్తా నంటె నేను మానెడేస్తా అనుకుంట అల్ల ఇంటిసుట్టు తిర్గి నేర్పుతున్నది మనఅసుంటోల్లే. పెద్దమాట గర్జ మనది. ఎట్లనన్న పని ఎల్లగొట్టుకోనాలె.

రా : అ అట్లడిగినంత ఇచ్చుకుంట కూసుంటె, బాగనే శేస్తం సంసారం.

మ : నాకు ఇసుంటి ఇచ్చులు, కచ్చకాయలు తెల్వవు. మన అసుంటోల్లు ఊల్ల ఎందరు లేరు. అందరితోటి మనం.

రా : ఎవరు కాదంటడే మరి. ఎంకటయ్యను, రంగయ్యను పిల్చుకొస్త. అల్ల పొలాలు, మన పంపుల్నే ఉన్నయిగద. కలుపు అల్లదీ ఎల్లలేదు. అందరం కల్సి యోశనశేతాం. ఎట్లా అంటె అట్ల.

మ. న : పోయి తోల్కరా పో.

న : ఈయాల్ల ఏదో మాటకు రావాలె. ఇట్లో—అట్లో—

[ఎంకటయ్య, రంగయ్యల్ని తోలుకొని రామయ్య వస్తడు]

మ : లచ్చా! ఎంకడెయ్య బిడ్డా, రంగన్న గిట్లఅస్తున్నరు. కొట్టంల నర్సయ్య ఉన్నడేమో పిల్సుకొస్త.

[పోయి నర్సయ్యను పిల్చుకొస్తుంది]

న : సెప్పురా—మీ పొలాల సంగతి. కలుపు సంగతి ఎటున్నది?

రంగయ్య : అన్ని గట్లనే ఏడ్సినై.

ఎంకటయ్య : మన ముగ్గిరి పొలాలు ఆండాల పిల్లలనకో!

[అంతా నవ్వుతారు]

[ఇంతలో లచ్చుఅన్న సోమయ్య వస్తడు]

సోమయ్య : బాగున్నారు మామా?

రా : గిట్లున్నం దేవుని దయతోటి. అంతా బాగున్నరా?

సో : ఆ!

మ : లచ్చవ్వా! మీ అన్న అచ్చిండే నివద్దనే. కాల్లకు నీల్లు తీస్కరా!

ల : (సీలిస్తూ) అన్నా—ఇంటికాడ అంత బాగున్నరా?

సో : సో అంత బాగున్నరు.

రా : ఎట్లో వచ్చినవు అల్లుడా!

సో : మొన్న పోయిన విగ్రానికి ఇంటికో డెనో దాన్ని అలమరిపింటి. దానిక్తోడు ఓ గిత్తను కొందామని నార్సంగి అంగడికి పోతున్న. ఎట్లనో ఓ బండిని నిలబెడ్దామని ఉన్నది. తీరికె ఉన్నప్పుడు బాడిగె కొట్టుకుందామనుకుంటున్న.

రం : యోశనతోటి ఏదో శేస్తుంటె నే సంసారం నడుస్తది.

ఎం : ఈగలు కొట్టుకుంట కూసుంటె, జర్గుతాదయ్య!

న : బలె సమయాని కొచ్చినవు బావా! కలుపులు కాకపాయె. కులం జర్గబట్టె. కూల్లు పెర్గుతుండె, ఎం జెయ్యాలె అంట అనుకుంటున్నం.

రం : పెద్ద ఎగసం ఉన్నోల్లు పెంచుతున్నారు.

రా : 'ఇదే పని' అంట ఈల్లు గుంజుతున్నరు!

న : బావా—మీదగ్గిరి సంగతి చెప్పక పోతివి.

సో : మూడునాల్లు బిగాలున్నటోల్లమే ఇట్ల కింద మీద పడ్తుంటె, 20—30—నాగండ్లు, కట్టెటోల్ల నెత్తిమీద ఎంత బర్వ ఉంటాచ్చు? అయినగని, పున్యాని కేపడు తోడిపెడ్తడు!

రం : సోమయ్యమాటినవద్దనే అనిపిస్తది. పెడమీదకొస్తైనే, ఎవడైన పెయ్యి వొదలు చేస్తడు.

ఎం : అడ్డెడు పోయి కుంచెడాయె. దినదినం అనాల్లన తోకతీర్గ పెంచుకుంట బోతె నెట్లవయ్యా?

మ : ఇంకా అయిన ఏమనుకున్నరు. బారెడు పొద్దెక్కినాక అస్తరు—ఆసువేసుకుంట, పాగాకు నములుకుంట. అపో ఝూను శేస్తరు పగలు, మూరెడు పొద్దుండగనే కలవార్లు బొడ్లె శెక్కుతూఉంటరు.

సో : ఇంటోల్లు ఎంబడి ఉండుకుంట, మంచిగ పని తీస్కోవాలె. రెక్కాడ్తనే బుక్కాడ్తది గద. యాడాదికి పన్నెండు నెల్లు, నిత్తె, తప్పకుంట కూలి దొర్కుతదా అంటె, ఎగుసంల పనిజేసే కూలోల్లకు అదీ లేదు.

ఎం : కలుపులు ఎల్లినయంటె, కోతలదాంక పుర్సతు.

సో : అందుకే అంటున్న. రేపటి కింత మిగిలించుకోవాలని కూలి ఎక్వజేస్తరనుకుండి. అడ్డకమ్మర్ల దగ్గిర, ఉప్పరి కూల్లు, గిర్నిలల్ల కూల్లు, ఒక్కతీర్గ జగ్గలయి. మన ఎగుసంపని అట్ల కాదుగద. అందరం ఒక్కసారి అల్కతిమి. ఒక్కసార మొలుస్తయి. కలుపూ ఒక్కసారే తియ్యాలె. ఒక్కసారే కొయ్యాలె. అందుకనే ఈ గుంజులాట.

రం : శిన్నోడైనా, సోమయ్య ఖరాగా చెప్తున్నడు.

రా : అడిగినంత ఇస్తాంగనీ — అంతో ఇంతో ఇచ్చి ఎట్లనో పని ఎల్లదీసుకున్నోడే బుద్ధిమంతుడు.

రం, ఎం : ఇక పోతాం రామన్న—

[పోతారు]

న : అవ్వా! నాకో ఉపాయం దోసిందే. నేను కోలుకాడికి పోయి ఉల్లిగడ్డ పీకిపెడ్త. ఆ కోడలును బిరాన తోలింను. నేను, బా, అవీ కల్సి, 30 - 40 కట్టలు కట్టుకోని. సక్కంగ బెత్త అపెకట్టకు పోతాం. ఇంటికోకట్ట ఇస్త. నిన్న ఉన్న కూలి తీస్కమంట. ఎట్ల రారో, మాస్తగదూ ఎట్లున్నద?

సో : అదినేనమన్నది—అత్తా, నువ్వు మామా కలిసి ఇంకో 30—40 కట్టలు కట్కరండి. పొద్దుపోకి, కూల్లు ఏసేటప్పుడు, ఇంకో కట్ట ఇట్టుకోటి అంటకర్తారి.

రా : అట్లనే సేగాం. ఏదో ఉపాయాన్ని శేసి పని ఎల్లగొట్టుకున్నోడో బుద్ధిమంతుడు ఈయాల్ల రేపు.

[తిర్వాలె పొలంలో .కలుపుతీసెటప్పుడు]

వంకాయ తోటకాడ

వరుసలొద్దు—

మొల్కచల్లుతుండంగ

గెల్కవద్దు

కలుపుతీస్తుండంగ

కజ్జమొద్దు—

సాటోల్లు ఉన్నకాడ

సరసమొద్దు—

కల్లంలో రాసికాడ

కయ్యమొద్దు


వెన్నెట్లో వన్నెకాడ

విరసమొద్దు

వంకాయతోటకాడ


వరుసలొద్దూ.............

[హైదరాబాదు రేడియో సౌజన్యంతో]



పాంగిపారలి ప్రవహిస్తున్న నాగావళీనదీ, దానివంతెన


శ్రీకాకుళంలో తుపానుదెబ్బ




కలకత్తా ట్రంక్ రోడ్డు గండ్లుపడినందున పరిసరాలలోని వేలాది ఎకరాల వరిపైరు నీటిపాలై పోయినది.



పాలకొండరోడ్డుపై నీటిప్రవాహం



నాల్గువైపులా నీటితో ముట్టడింపబడిన శ్రీకాకుళం సబ్ కోర్టుభవనం



శ్రీకాకుళంలోని కాకివీధిలో ప్రవాహం



నాగావళీనది గట్లు తెంపుకొనివచ్చి పట్టణంలోని ప్రతిగడపనూ ముంచెత్తింది




పడిపోయినచెట్లు : టెలిగ్రాఫ్ స్తంభాలు ఒక దృశ్యం




రాజమండ్రి ప్రాంతాలకు వెళ్లే రైలుప్రయాణీకులు రైళ్లు లేనందున
విజయవాడ ప్లాట్‌ఫారంమీదే వంటలు చేసుకుంటున్న దృశ్యం.

బందరు-విజయవాడ
రైలుమార్గంపైన చిల
కలపూడి స్టేషన్‌కు
మూడు మైళ్ళ ఇవతల
తుపాను తగ్గిన తరు
వాత కొన్నిరోజుల వర
కూ నీరు ప్రవహి
స్తూనే ఉన్నది.






నివాసాలు కోల్పోయిన బీదాబిక్కి విజయవాడస్టేషన్‌వద్ద తలదాచుకుంటున్న దృశ్యం.



గన్నవరంవద్ద రైలుమార్గానికి నష్టం—మరమ్మతుచేస్తున్న దృశ్యం.

ఆంధ్ర
తు
బీభ



విజయవాడ స్టేషన్‌వద్ద తుపానుదెబ్బకు నేలకు ఒరిగిపోయిన టెలిగ్రాఫ్ స్తంభాలు.




గుడివాడలో ఒక ఇల్లు కూలిపోవడంవల్ల ముగ్గురు మరణించారు.
లో కానవగును. బుడమేరు వరదలవల్ల జనార్దనపురం
తుపాను తట్టుకున్న ఇళ్లల్లో నీరు చేరడంవల్ల ఉండడా




బందరులో నేలమట్టమైన ఒక పెంకుటిల్లు.



విజయవాడలో తుపానువల్ల ఇల్లూవాకిలీ కోల్పోయిన సంసార
బిట్టా కట్టా రోడ్ల పక్కకుచేర్చి ప్రాణాలు దక్కితే అంతేచాలున



నిలవనీడలేక ప్రజలు శ్రీకాకుళం రివెన్యూ ఆఫీసర్ల భవనంలో తలదాచుకుంటున్న దృశ్యం.




విజయవాడలో నైజాం రైల్వేపుడ్సుషెడ్ ఆఫీసు ఒకచెట్టు విరిగిపటడంవల్ల కొద్దిగా దెబ్బతిన్నది. ఈ విధంగా ఎన్నిచోట్లనో చెట్లు విరిగి ఇళ్ళను ధ్వంసం చేసినవి. రహదారులకు ఆటంకా లేర్పడినవి.

...శంలో
...సన
...వము




బుడమేరు వరదఫలితంగా ఇల్లు, వాకిలి కొట్టుకొనిపోగా, రోడ్లమీదికి కాపురాలు మార్చిన ప్రజల దైన్యావస్థ.




తుపానులో విజయవాడ కళాశాల, దాని హాస్టలుభవనమూ కూడా బాగా దెబ్బతిన్నవి. హాస్టల్ దృశ్యం.




...కుడివైపు చిత్రం
...జలమయమై పోయింది.
...గాకుండా పోయింది.




విజయవాడ రైలుస్టేషనులోని ప్రయాణీకుల షెడ్ పై పెంకులు ఎగిరిపోయినవి. వర్షంవల్ల లోపల ఉండేందుకు ప్రయాణీకులకు వీలుగాక పోయింది.




గన్నవరంవద్ద రైలుమార్గానికి మరమ్మతుచేస్తున్న దృశ్యం. బెజవాడ గన్నవరం మధ్య రైలుమార్గం విపరీతంగా దెబ్బతినిపోయింది. మరమ్మతు జరుపుతున్నారు.



...నవిపోగా మిగిలిన
...ం చేస్తున్నారు.







బందరులో తుపాను బీభత్సం: నిర్మాణంలోవున్న ఒక సినిమాహాలు పూర్తిగా కూలిపోయింది. (1,2 చిత్రాలు) / రాబర్ట్సన్ పేట వద్దనున్న వరాలు దుకాణాలన్నీ పూర్తిగా ధ్వంసమైనవి.(3 వ చిత్రం)



తీతువు పిట్ట

శ్రీమతి నందివాడ పుతలీ

అనగాఅనగా ఒక రాజుగారుండేవారు. ఆయనకి పిల్లలు లేరు. సంతానంకోసం ఎన్నో వ్రతాలూ, పూజలూ చేశారు. ఐనా పుట్టలేదు. ఇక పుట్టరని నిర్ధారణ చేసికొని నిరాశ చెందినతర్వాత ఒక కొడుకు పుట్టాడు. చాన్నాళ్ళకి సంతానం కలిగినందుకు సంతోషం పట్టలేక ఊరంతా మిఠాయి పంచిపెట్టించారు రాజుగారు. ప్రజలంతా పండుగ చేసికొన్నారు.

కాని పాపాయి పుట్టిన పదకొండవ రోజున రాణీగారికి చాలా జబ్బు చేసింది. డాక్టర్లు లాభం లేదని పెదవి విరిచారు. రాణి అవసానకాలమందు భర్తని పిల్చి ఇలా చెప్పింది 'నాకోసం మీరేంతమాత్రం విచారించవద్దు. దేవుడు పిలిచాడు. ఎప్పటికైనా చావాల్సిందేకదా! వంశం నిలపగలిగాను. నాకు చాలా సంతోషంగా ఉంది. కాని నా కొక కోరిక ఉంది. మీరు మళ్లీ పెళ్లిచేసికోండి. ఆమే, మా బాబాయికమ్మ అని చెప్పండి.'

అని రాజుచేత వాగ్దానం చేయించుకొని కళ్లు మూసింది.

పాపాయి పుట్టినందుకు రాజుగారికి సంతోషం లేకపోయింది. పెళ్లి చేసుకుంటే సవతితల్లి కుర్రవాణ్ణి సరిగా చూడదేమొ నని దిగులు పట్టుకుంది రాజుగారికి. పాపాయికి 'చిరంజీవి' అని పేరుపెట్టారు. తల్లి లేని పిల్లవాడని అతిగారాబంగా పెంచారు. చిరంజీవి అతిగారాబంవల్ల తండ్రి అంటే భయంపోయి పెంకివాడయాడు.

ఒక రోజున రాజుగారు షికారు వెళ్లారు. అక్కడ ఒక 18 ఏళ్ల అమ్మాయి ఏడుస్తోకూర్చుంది. రాజుగారామెని ఎందుకమ్మా ఏడుస్తున్నా' వని అడిగారు.

'నాకు నాఅనేవారెవరూ లేరు. తెచ్చింతా, దొంగ లెత్తుకుపోయి నన్నిక్కడ వదిలేశా' రని ఏడ్చింది.

రాజుగారికి జాలేసింది. ఆ అమ్మాయిని ఇంటికి తీసికొని వచ్చారు. ఆ అమ్మాయి చిరంజీవి నెంతో ముద్దుగా చూచేది. మంత్రులందరూ రాణీ కోరిక జ్ఞాపకం చేసి రాజుగారిని పెళ్లాడుమన్నారు. అంత బాగా చిరంజీవిని చూస్తోంది కనక ఇంక పిల్లవాని విషయం బెంగ అక్ఖర్లేదు. పెళ్లాడమని పట్టుబట్టారు.

చిరంజీవి రాజుగారిని చూచి 'నాన్నా ఆవిడెవరని'అడిగాడు. ఆమె వెంటనే 'మీ అమ్మని బాబూ' అంది. రాజుగారామె తెలివితేటలకీ యుక్తికీ ఎంతో సంతోషించారు. రాజుగారామెని పెళ్లాడారు.

రాజుగారి భార్య నిజంగా అమ్మాయి కాదు రాక్షసి. రాజుగారిని మోహించి అమ్మాయివేషం వేసుకుంది. పాపం రాజుగారికీ సంగతి తెలియదు.

రానురాను రాజుగారి భార్యకి చిరంజీవిమీద అభిమానం తగ్గిపోయింది. చిరంజీవి అల్లరిచేస్తోంటే చిరాకు వచ్చేదావిడకి. ఒక రోజున రాజుగారి దగ్గరకి చిరంజీవిని రెక్కపుచ్చుకుని తీసికొచ్చి 'ఇలా ఊరుకుంటే లాభం లేదు. పాడయిపోయాడు. ఏడేళ్లు నిండాయి కధా చదువుకోమనండి. భయం చెప్పకపోతే పనికి రా' డంది.

రాజుగారికి కోపం వచ్చింది.

'వాడినేం కేకవెయ్యకు, చేతనయితే అల్లరి మాన్పించు. లేకపోతే ఊరుకో. కాని చెయ్యిచేసుకుంటే మాట దక్కదని కసిరాడు.

రాణీకి కోపం వచ్చింది. ఆమాత్రం అనడానికి తనకి హక్కు లేదా? తనమీద నిజమైన ప్రేమే ఉంటే రాజుగారలాగ తనని కసురుకొనునా? చిరంజీవిని బాగా పెంచుతోందికదా అని పెళ్లి చేసుకున్నాడన్నమాట. ఆవిడకి ఏం చెయ్యాలో తోచలేదు. ఈ వెధవ లేకుంటే ఎంత హాయిగా ఉంటుంది!


ఇంతలో చిరంజీవి వచ్చాడు. వాణ్ణి చూసేసరికి రాణీకి వెర్రెత్తినట్టయింది. వెంటనే చంపెయ్యాలనుకుంది. చంపేస్తే ఏం లాభం? వాడేం బాధపడ్తాడు? రాజుగారు విచారపడుతారుగాని. ఆలోచిస్తోన్నకొద్దీ దుర్బుద్ధులెక్కువ వస్తున్నాయి.

చిరంజీవిని దగ్గరకి పిల్చి మిఠాయి పెట్టింది. తింటోనే నిద్రపోయాడు చిరంజీవి. అందులో మత్తుమందు కలిపింది! కత్తితో నాలిక పెదవులు పీకేశింది. రాజుకి తెలిస్తే! తన్ని బ్రతకనిస్తాడా! రాణీకి భయం వేసింది! 'పొరబాటు చేశాను. చంపెయ్యాల్సింది. పీడ వదలిపోయే' దనుకుంది. కాని రాక్షసిబుద్ధు లెక్కడికి పోతాయి! తన ప్రాణంలో వందోవంతు ఒక మేకులో పెట్టి ఆ మేకుని చిరంజీవి నెత్తిమీద కొట్టింది. రాక్షస జీవితం మేకులో ఉండబట్టి రాక్షసులు తప్ప మనుష్యులు చిరంజీవిదగ్గరికి రాలేరు. మేకున్నంతసేపూ చిరంజీవి ప్రాణం పూర్తిగా పోకుండా బాధతో అలాకొట్టుకుంటూనే ఉంటాడు. రాక్షసకృత్యాలంటే ఇలాటివే మరి!

చిరంజీవిని పెట్టెలో పెట్టి తాళం వేశిదాన్ని నదిలో పారెయ్యమని బంట్రోతు కాజ్ఞ ఇచ్చింది. రాజుకు తెలియకుండా చెయ్యమని దోసెడు బంగారునాణెములిచ్చింది. వాడల్లే చేశాడు.

మునీశ్వరుడొకడు సూర్యుడికి అర్ఘ్యం ఇస్తున్నాడు. నదిలో కొట్టుకువస్తూన్న పెట్టెను తీసి జాగ్రత్తగా తెరచి చూశాడు. చిరంజీవిని చూడగానే జరిగిన సంగతంతా దివ్యదృష్టినగ్రహించాడు. తపశ్శక్తివల్ల మేకు పీకేశాడు. మేకు వెంటనే ఎగిరిపోయింది. చిరంజీవికి దాహం వేసింది. ఎలా చెప్పగలడు? సంజ్ఞ చేశాడు. ముని నీరు పోశాడు. నాలిక లేనప్పుడు మనిషిజన్మమెందుకని వానిని, ముని పిట్టగా మార్చేశాడు. కన్నతల్లి ఇంత ద్రోహం చేసినందుకు చిరంజీవి కెంతో కోపం వచ్చింది. మానవజాతిలక్షణమే ఇదనితిట్టడం ప్రారంభించాడు. ముని ఆమె తన తల్లి కాదని, అసలువిషయం ఎంత చెప్పినా చిరంజీవి కర్థం కాలేదు. అసలు వినిపించుకోలేదు. మానవులంతా చావాలని తిట్టడం మొదలెట్టాడు. ముని ఎంత చెప్పినా వినలేదు చిరంజీవి. మునికి కోపం వచ్చింది. 'నువ్వు మానవజాతిని ద్వేషిస్తున్నావు కనక నిన్నూ మానవులందరూ ద్వేషిస్తారు.' అని శపించాడు.

పిట్టగా మారిన చిరంజీవి 'తీతుతీ' తని కూస్తూ ఎగిరిపోయాడు. ఆ పిట్టే తీతువు పిట్ట. అది మనిషిమీదుగా ఎగిరితే అతనికి ప్రాణగండం అంటారు. అది వచ్చిన ప్రదేశంలో అశుభం జరుగుతుం దంటారు. తీతువు పిట్టకి నాలిక లేక నీళ్లు త్రాగలేదు. వర్షం వస్తే ఆ నీళ్లు నెత్తి చిల్లుమీద పడ్తే దాని దాహం తీరుతుంది. దాహం వేస్తేవర్షం కోసం తహతహలాడి 'తీతుతీ' తని అంటుందిట. అది అరిస్తే వర్షం వస్తుం దంటారు.



రేడియో కంట్రోలుద్వారా ఇంగ్లీషు ఛానల్‌ను దాటేందుకు ఈస్టాఫ్ అనే ఒక బ్రిటిష్ ఉద్యోగి ఒక పడవను తయారుచేశాడు. ఆ పడవనమూనా ఇది. అసలు పడవకు మూడుమైళ్లదూరంలో ఉండి రేడియోకంట్రోలుద్వారా ఈ పని చేయించవచ్చునట.

బాలానందం :

నిజమైన ప్రేమ

శ్రీ జూజారు టాకోజిరావు

అనగనగా ఒక రాజ్యాన్ని వీరసేనుడు అను రాజు పాలించుచూ యుండెను. ఆయనకు కొడుకులు లేరుకాని కుమార్తెలు ఉన్నారు. రాజు ముసలివాడయినందున తన రాజ్యాన్ని తన కుమార్తెలకు పంచియిచ్చేదామని తన ముగ్గురి కుమార్తెలను పిలిపించెను, తనమీద ఎంత ప్రేమ యుందో తెలుసుకొందామని.

మొదటి బిడ్డ మోహిని "నాయనా! ప్రపంచములో వున్న వస్తువులలో కెల్ల నేను నిన్నే ప్రేమించెదను" అనెను. రాజు ఆమెకు రాజ్యములోని మూడవ భాగము పంచియిచ్చెను. రెండవ బిడ్డకూడ అట్లే అనెను. ఆమెకు రాజు రాజ్యము మూడవవంతు యిచ్చెను. మూడవ బిడ్డ లలితమ్మ తన తండ్రికి తన అక్కలు రాజ్యముకొరకు ప్రేమించకున్నను అబద్ధములాడి రాజ్యము సంపాదించినారని తెలిసి తన తండ్రిదగ్గరకు రాగానే "నేను ప్రేమించేది తక్కువ కాదు, ఎక్కువ కాదు, ఏమియు లేదు." అని జవాబిచ్చెను. దీనికి ఆగ్రహాము చెంది రాజు వెనుక ముందు చూడక "ఏమే నీకింత పొగరు. నీకు నామీద ఏమియు లేని యెడల నీకును రాజ్యములో ఏమియు లేదు. ఛో! నీవు నా కూతురవు గావు" అని కసిరెను. తరువాత మిగిలిన మూడవ భాగమును వారికి సమానముగా పంచియిచ్చెను. పెద్దకూతుళ్లకు పెండ్లి అయింది. వారు వారి వారి భర్తలతో రాజ్యము సుఖముగా పరిపాలించుచుండిరి.

ఇది విని రాజనగరులోని సేనాధీపతులు, మంత్రులు కోపపడిరికాని రాజు కెదురుతిరుగుటకు భయపడి ఊరకుండిరి. అందులో ఒక సామంతరాజైన రామరాజు రాజువద్దకు వచ్చి యిది అన్యాయమని రాజుతో చెప్పగా రాజు కోపమునొంది 'ఓరీ! నీవా నాకు బుద్ధి చెప్పువాడవు. నీవు ఇప్పుడే నా రాజ్యము విడిచి పొమ్ము. ఇప్పటినుండి పదహారు దినములలో కనబడినయెడల నీవు నీ ప్రాణమును పోగొట్టుకొందువు. జాగ్రత్త' అని చెప్పెను.

రాజుమూడవ బిడ్డయైన లలితను పెండ్లిచేసికొనుటకై రెండు దేశముల యువరాజులు వచ్చిరి. మధురదేశపు యువరాజు తన కేమియు వరదక్షిణ రాదని ఆమెను వివాహమాడుటకు సమ్మతించలేదు. కళింగదేశపు యువరాజు లలిత సుగుణములు విని, తనకు వరదక్షిణ రాకున్నను సంతోషించి లలితను వివాహమాడెను. లలిత పోవునపుడు తనతండ్రిని బాగుగ చూడుమని హెచ్చరించి మగనియింటికి పోయెను.

ముసలిరాజు కొంత విశ్రాంతి తీసికొందమని, జీవితము సుఖముగా తన పెద్దబిడ్డలవద్ద గడుపుదమని నిశ్చయించెను. దాని కనుగుణ్యంగా మొదటి బిడ్డవద్దకు వెళ్లినాడు. పెద్దబిడ్డ మోహిని కొద్ది దినములు బాగుగా చూచినది. కాని కొంత కాలమునకు ఆమెకు అసూయ జనించినది. తండ్రిని సరిగా గౌరవించుటలేదు. రాజు తాను నూరుమంది సేవకులనుంచుకొని యుండ ఏబదిమందిని రాజుకు తెలియకుండ తీసివేసినది. ఒక దినము రాజన్నము తినుచుండ ఒక పరదేశస్థుడు వచ్చెను. వాడు రాజును చూచి రాజా! నాకేదైన యుద్యోగ మిచ్చెదరా?" అని యడుగగా రాజు "నన్ను నీవు సంతోషపెట్టినట్లైన నీకు ఉద్యోగ మిచ్చెద" ననెను ఆ దినముననే వంటవాడు రాజును అగౌరవపరచెను. అందుకు క్రొత్తగావచ్చిన సేవకుడు వానిని పట్టి కొట్టెను. రాజు అతని పేరడుగగ వాడు సుబ్బడు అని జవాబిచ్చెను. ఈ సుబ్బడు క్రొత్తవాడు కాదు. మునుపు రాజుచేత నూకబడిన రామరాజు.

రాజు తనకు పెద్ద బిడ్డ చేసిన అవమానమునకు దుఃఖించి రెండవ బిడ్డవద్దకు పోవుటకు ప్రయాణమైనాడు. అందుకై తెలుపుటకై సుబ్బన్నను రెండవ బిడ్డయింటికి పంపించెను. అచటికి పోయినవెంటనే రాజు రాణి నేరే రాజుయింటికి పోయినారని విని అచటికి పోయెను. అచట సుబ్బన్న తాను యింతకుముందు కొట్టిన వంటలవానిని చూచినాడు. వాడొక జాబు రెండవ బిడ్డ కిచ్చుట చూచెను. అంతట నతడు వానిని పట్టుకొని కొట్టసాగెను. ఇది చూచి రెండవ బిడ్డ తన సేవకులతో వానిని ఒక స్తంభమునకు కట్టించెను. ఇంతలో రాజుకూడ వచ్చెను. రాజు తన సేవకునకు జరిగిన అవమానము చూచి కోపపడి దుఃఖించెను. ఆ బిడ్డ ఆయనను చూచి "నీవు పోయి నా అక్కతో నేను తప్పు చేసినాను. క్షమించుము, నన్నింటిలోనికి రానిమ్మని యడుగుము" అని కసిరినది. ఇంతలో మోహినికూడ వచ్చినది వారిద్దరను చూచి కోపపడి నాడు వారి తండ్రి. తండ్రికి ఈవిధముగా అవమానము జరిగినందుకు వగచి అచ్చట నుండి వెడలిపోయెను. వారక్క చెల్లెండ్రు నిర్దయతో తండ్రి యని కనికరించక తపీమని వాకిలి వేసిరి.

ఆ దినముననే వాన జోరుగా కురిసినది. ఆ వానలో రాజు, సేవకులు పరుగెత్తిరి. దిక్కున కొకరుగా పరుగెత్తిరి. రాజు పిచ్చివానివలె పరుగెత్తుచుండెను. ఇంతలో సుబ్బన్న (రామరాజు) కట్లు విడిపించుకొని రాజువద్దకు వచ్చెను. అతడా రాజును ఒక పాడుపడిన యింటిలోనికి తీసికొనిపోయెను. కొంచెము బాగు కాగానే రాజును ఆ సామంతరాజు తన ఊరికి తీసికొనిపోయెను. ఆ సామంతరాజు కళింగదేశపు యువరాణి యగు లలితకు కబురంపెను. సమాచారమంతయు ఆమెకు తెలిపెను.

ఆమె తన తండ్రికి జరిగిన అవమానమునకు చింతించి సైన్యముతో తన అక్కలను ఓడించవలెనని వచ్చెను. లలిత తన తండ్రితో కలిసి మాట్లాడెను. దురదృష్టవశమున ఒక సామంతరాజు చుట్టముకొడుకు దుష్టబుద్ధి యను వాడు లలితసైన్యమును యుద్ధములో ఓడించి లలితను, ఆమెతండ్రిని బంధించెను. లలితను క్రూరముగా చంపించినాడు దుష్టబుద్ధి. కూతురు గుణము కనుగొన్న రాజు తన చిన్నారిబిడ్డ పోయినందుకు చింతించి చనిపోయెను.

దుష్టబుద్ధి కొక దుర్బుద్ధి, తానే రాజ్యమేలవలెనని. అందుకై రాజు ఇద్దరుబిడ్డలను మోహించి తన కోర్కె చెప్పెను. వారును తమలో ఒకరు మాత్రమే పెండ్లియాడవలెనని ప్రయత్నించిరి. రెండవ బిడ్డభర్త ఇంతలో మరణించెను. రెండవబిడ్డ తన భర్త చనిపోయెనన్న దుఃఖము కొంచెము కూడ లేక దుష్టబుద్ధిని వివాహమాడెదమన్న సంతోషముతో నుండెను. ఇది విని మొదటి బిడ్డ మోహిని తన చెల్లెలను విషము పెట్టి చంపించెను. ఇది కనుగొని మోహినిభర్త, మోహినిని ఖైదిలో వేయించెను. ఆమె అందులో పడి జీవములు విడిచెను, తరువాత మోహినిభర్త దుష్టబుద్ధి యొక్క దుర్బుద్ధి తెలిసికొని అతనిని ఖైదిచేసెను. అతడు సింహాసన మెక్కి రాజ్యపాలనము సుఖముగా చేయదొడగెను.

అనర్హునికి వరం ఇస్తే?

శ్రీ చి. లక్ష్మీనారాయణ

అనగాఅనగా ఒక రాజు. ఆ రాజు సాటిరాజులకన్న యెక్కువ సిరిసంపదలతో తులతూగుచుండెను. ఇట్లుండ ఒకానొకనాడు ఆ రాజుకు క్షురకుడు బాగుగా క్షౌరము చేసినందుకు మెచ్చుకొని నీ కేమి కావలయునో కోరుకొమ్మనెను. అందుల కా మంగలి, అతనికి కావలసినది కోరుకొనక రాజా! నాకు మంత్రిత్వ మిమ్మనియెను. ఆ రాజు సత్యలోపము కలుగునని యిదివరకున్న మంత్రిని తొలగించి మంగలికి మంత్రిత్వ మిచ్చెను. ఈ వార్త అతని శత్రురాజులకు తెలిసినది. ఆ రాజులు పెక్కుదినములనుండి వేచియుండిరి. మంత్రి తెలివితేటలను చూచి రాలేకపోయిరి. ఈ వార్త తెలిసిన వెంటనే ఇదే సమయమని శత్రురాజులందరు యేకీభవించి యీ రాజురాజ్యమును చేరి కోటను ముట్టడించిరి.

ఈ వార్త రాజు తెలిసికొని వెంటనే మంగలిమంత్రిని పిలిచి శత్రురాజులు మన కోట ముట్టడించిరి. ఇప్పుడేమి చేయవలయునో చెప్పుమనిన వాడిట్లనియె, "రాజా! నా తల్లికి నేనొక్కడనే కుమారుడను. మీరును అట్టివారే గదా? బ్రతికియుండిన బలుసుకూరైనం దినవచ్చును. ఈ శత్రురాజుల నెవ్వడు గెలువగలడు. నాయొద్ద మా తాత సంపాదించినవి రెండు మంగలిపొదులున్నవి. ఒకటి మీ కిచ్చెదను. రెండవది నేను తీసికొనెదను. అట్టి వేషములతో పారిపోయినచో మనలను శత్రురాజులు చంపక విడిచిపెట్టెదరు. తర్వాత నే యూరికైనను బోయి దినమున కిద్దరికి క్షౌరము చేసినచో పొట్ట గడువకపోదు. దీనికై యింత విచారింపవలయునా?" అని చెప్పెను. రాజు ఆ మాటలు విని కోపముతో ఛీ! నిర్భాగ్యుడా! నీకు మంత్రిత్వ మిచ్చినందులకు మంచి బుద్ధి చెప్పితివి. నీ సాంగత్యము చాలు పొమ్మని విడిచిపెట్టెను. వెంటనే పూర్వపు మంత్రి ఆ గ్రామమందే వున్నాడు. కనుక నతని యొద్దకు పోయి తన కాపద దాటింపుమని పాదంబుల బడియెను. ఆ మంత్రి ఆపత్కాలమందు వచ్చిన రాజును తిరస్కరింపక భయపడవద్దని ధైర్యము చెప్పి శత్రురాజుల కిట్లు జాబు వ్రాసెను, ఇపుడు మీ యిష్టప్రకారం కోట పట్టి ఇచ్చెదను. కోట స్వాధీన మైనపిమ్మట దీనికి మీలో రాజెవ్వడు కాబోవునో తెలియజేయుడని వ్రాసిన అట్టి చీటీని చదువుకొని యా రాజు లందరు నాకే కావలయును నాకే కావలయు నని ఒకరితో నొకరు దారుణమైన యుద్ధము చేసి తుద కొకరిచే నొకరు హతులైరి. తర్వాత రాజు పూర్వపు మంత్రి కే మంత్రిత్వ మిచ్చి ప్రజలను కన్న బిడ్డలవలె పాలించెను.

బొంబయికంపెనీల కబుర్లు

బొంబాయినగరంలోని పెద్ద కంపెనీలలో ఈ మధ్య ఆకస్మికంగానే కొన్ని మార్పులు జరిగినాయి. ఇంకా జరిగేలాగున కన్పిస్తుంది.

"బొంబయిహౌసు" అంటే సుమారు నలభై సంవత్సరాలనుంచి ప్రసిద్ధిచెందినది. అందు తాతా వారి యాజమాన్యాన నడుపబడే కంపెనీ లుంటవి. స్టీలుకంపెనీపితామహుడు, స్థాపకుడు, జమ్షెదు తాతాకు ఇద్దరు కుమారులు సర్ రతన్ తాతా, సర్ దోరబు తాతా ఉండేవారు. వా రిద్దరూ సంతతి లేకుండా చనిపోయినారు. దోరబు తాతా చనిపోయినతరువాత ఆ కుటుంబంలోనివారే సర్ నౌరోజీ శక్లత్వాలాగారు ఆధిపత్యం నడపినారు. వారియనంతరము ప్రస్తుతం తాతా కంపెనీలకన్నిటికి అధిపతిగ నుండే జహంగీరు ఆర్. డి. తాతాగారు పైకి వచ్చినారు. వీరందరుగూడా గొప్ప వ్యవహారదక్షులు, వ్యవహారనీతిని గమనించినవారే. కాని వీరి కెవరికిని కుమారులు లేరు.

తమకు సాయము చేయుటకై ప్రముఖులైన, సమర్థులైన పార్శీలను డైరెక్టరులుగ తీసికొనేవారు. సర్ సొరబ్జి శక్లత్వాలాగారు మిలువ్యవహారాలను, సర్ అర్దేషిర్ దలాలుగారు స్టీలు కంపెనీవ్యవహారాలను, సర్ హోమీ మోడీగారు సాంపత్తిక వ్యవహారాలను అతిసమర్థతతో చూచేవారు. అనేకసంవత్సరాలు వీరితోగూడ డాక్టరు జాన్ మత్తయిగారు డైరెక్టరుగ నుండినారు. వీరిలో మొదటి ఇరువురు గడచిన రెండుసంవత్సరాలలో చనిపోయినారు. మోడీగారు సంయుక్తరాష్ట్రాలకు గవర్నరైనారు. మత్తయిగారు రెండుసంవత్సరాలన్నరగా భారత ప్రభుత్వ సభ్యులుగ నున్నారు. జహంగీరు తాతాగారు (జే. ఆర్. డి. అంటారు ఇతనిని) ముఖ్యంగా వైమానికవ్యవహారములందు అనుభవం గలవారు. మిగిలినవానిలో ఎక్కువ శ్రద్ధ పుచ్చుకోటానికి వీరికి వ్యవధి యుండదు. అందుచేత బాధ్యత చాలవరకు ఏ. ఆర్. డి. ప్రాఫ్‌గారు వహించుచుందురు. ప్రాఫ్‌గారు చాలకాలం స్టాకు, షేరుబ్రోకరుగ నుండినారు. అంతకుపూర్వము ప్రొఫెసరుగ నుండినారు. అందుచేత వీరికి వ్యవహారదక్షతకన్న పాండిత్యమే హెచ్చుగ గలదు. ద్రవ్యవినియోగమున చాల ధైర్యము గలవారు. ఈతని ధైర్యము ఇతరుల కుండినదికాదు. డైరక్టరులలో హిందువులు, ముసల్మానులు గలరు. కాని వీరు అతిస్వల్పసంఖ్యాకులు. వీరికి పెత్తనము ఎక్కువ యుండదు. ప్రాఫ్‌గారి ధైర్యసాహసములు ఎక్కువైనకొలది హోమీ మోడీగారి, అర్దేషిర్ దలాలుగారికి కంపెనీల నిర్వహణమునందు శ్రద్ధ తగ్గినది. కంపెనీల భావిదశయందును వీరికి వెనుకటి విశ్వాసము లేక యుండినదని వాటాదారులు చెప్పకొనుచుందురు.

ఇట్లుండ తాతావైమానికశాఖయందు లాభములు తగ్గుటయేగాక క్రమముగ నష్టము వచ్చుచున్నది. కంపెనీవాటాల విలువ తగ్గినది. రఫీ అహమ్మదు కిద్వాయిగారు వైమానికటపాలుసర్దుబాటులను నూతనపద్ధతులపై గావించుటతో డైరక్టరు సర్ గురునాథబెవూరు గారికిని ఉత్సాహము తగ్గినది, జే. ఆర్. డి. గారికిని కొంత అధైర్యము గల్గినది. దేశాభిమానముమాత్రము తగ్గలేదు. కంపెనీ లన్ని చాలవరకు పార్శీఉద్యోగులతో నుండును. త్వరలో జే. ఆర్. డి. గారు సమర్థులైన డైరెక్టరులను, మతజాతివివక్షత లేకుండా, నియమించవలసి యుండు నని పలువురు తలంచుచున్నారు.

సెంట్రల్ బ్యాంకు స్థాపకులగు సర్ సొరబ్ పోచ్‌ఖానావాలాగారుండినంతకాలము చాల జోరుగ నుండినవి, ఆ బ్యాంకువ్యవహారాలు. సర్ ఫిరోజ్ సెత్నాగారు పెత్తనం వహించిన పిమ్మట బ్రాంచీల సంఖ్య హెచ్చినది. సర్ హోమీమోడీగారు అధ్యక్షులై హెచ్. సి. కేప్టనుగారు మేనేజింగు డైరెక్టరైనపిమ్మట బ్రాంచీల సంఖ్య ఇంకా హెచ్చినది. డిపాజిట్లు, ఋణముల వైశాల్యమును హెచ్చినది. మోడీగారు లక్నోకు వెళ్లినపిమ్మట అనుభవశాలియగు అధ్యక్షుడు లభింపలేదు. గొప్పఉద్యోగములలో ఎక్కువమంది బ్యాంకింగుయోగ్యత గల్గినవారు కారు. కేప్టనుగారు అప్పుడప్పుడు అనారోగ్యమువలన సెలవుపెట్టవలసియో, లేకున్న ఇంటినుండియే వ్యవహారములను చూచుటయో తటస్థించుచున్నది. ఈ బ్యాంకునందును చాలవరకు పెద్ద, చిన్న యుద్యోగములందు పార్శీల సంఖ్యయే హెచ్చుగ నుండును. ముఖ్యంగా బొంబయినగరములోని ప్రధానకార్యాలయమున. హిందువులు కొందరు యోగ్యత గలవారు ఉద్యోగములలో నున్నారుగాని వారికి బాధ్యత గల పదవులు లభించుట అరుదు.

కేప్టనుగారు చాలకాలం మేనేజింగు డైరక్టరుగా నుండక పోవచ్చును. ఇదివరకు మన కామర్సుమంత్రిగ నుండిన సి. హెచ్. భాభాగారు ప్రస్తుతం డైరెక్టరుగ నున్నారు. కొంతకాలానికి వారు మేనేజింగు డైరెక్టరుగ నియమింపబడవచ్చు నను ఊహలు గలవు.

న్యూ ఇండియా అష్యూరెన్సు కంపెనీకి ప్రస్తుతము ఎ. ఆర్. డి. ప్రాఫ్‌గారు అధ్యక్షత వహించియున్నారు. ఆ కంపెనీలోగూడ ప్రాఫ్‌గారి ధైర్య పాండిత్యములతో గూడిన మహిమ ఉపయోగపడుచున్న దని తలంపు. కొన్ని సంవత్సరాలనుండి జనరల్ మేనేజరుగ నుండిన బి. కే. షాగారు ఇండస్ట్రియల్ ఇన్వెస్టుమెంటు కార్పొరేషనులో డైరెక్టరుగ ఎన్నుకోబడినారు. భీమా కంపెనీలలో ఇది చాలకాలరకు ప్రసిద్ధి చెందియున్నది.

సిండియా స్టీమ్ నేవిగేషన్ కంపెనీయందును మార్పులు జరిగినవి. ఇంకా జరగనున్నవి. అధ్యక్షులుగ నున్న వాల్చందు హీరాచందుగారికి రెండు సంవత్సరాలనుండి ఆరోగ్యం తిన్నగా ఉండటం లేనందున ఆయనకు ఇటీవలవరకు జనరల్ మేనేజరుగ నుండిన ఎం. ఏ. మాస్టరుగారు చాల సాయంగా నుండినారు. కాని కొన్ని విషయాలలో ఇరువురకు భేదాభిప్రాయాలు గల్గినందున గౌరవంతోనే మాస్టరుగారు తమ పదవిని విరమించుకొన్నారు. ఎంతో కాలం కలకత్తా బ్రాంచికి జనరల్ మేనేజరుగ నుండిన గగన్‌విహారి ఎల్. మెహతాగారు కంపెనీ ఉద్యోగాన్ని తాత్కాలికంగా వదలుకొని టారిఫ్‌బోర్డు కధ్యక్షులయినారు. ఈమార్పులన్నిటివల్ల వాటాదారులలో చాల సంచలనం గల్గింది. వాటాల విలువలలోగూడ మార్పులు గల్గుతుంటాయి. ఓడవ్యాపారంలో ప్రాధాన్యం వహించిన ఈ కంపెనీ ఈవిధంగ నుండటం ప్రభుత్వవారి కిష్టం లేక యున్నది. జరుగనున్న జనరల్ మీటింగులోపుగ వాల్చందు హీరాచందుగారు తమ ఆధిపత్యమును వదలుకోవచ్చునని, మాస్టరుగారు ఒక డైరెక్టరు కావచ్చు నని అనుకొంటున్నారు.

బ్యాంకు ఆఫ్ బరోడావ్యవహారాలు బాగుగ నడుస్తున్నవి. రిజర్వులు, డిపాజిట్లు, ఋణముల నీయటం ప్రశంసనీయములుగ నున్నవి. బరోడా బొంబయిరాజధానిలో లీనమైపోవటంవల్ల, బరోడామహారాజాగారి విదేశప్రయాణాలవల్ల ఆ బ్యాంకు నభివృద్ధిపరచువిషయమై డైరెక్టరులు ఎక్కువ ధైర్యము వహించలేకయున్నారు. కాని ఈ బ్యాంకుకు భావిదశ గల దని ఇదివరలో బరోడా దివానుగ నుండినట్టియు, ప్రస్తుతం ఈ రాష్ట్రంలో పబ్లికువర్క్సుమంత్రిగ నున్నట్టియు డాక్టరు జీవరాజ్ మెహతాగారు ప్రకటించి యున్నారు.

దక్షిణదేశంలో ప్రధానకార్యాలయం గల్గి ఈ రాష్ట్రంలో బ్రాంచీలు గలిగిన బ్యాంకులలో నెల్లఇండియన్ బ్యాంకు బాగుగ వ్యాపారమును సాగింపగల్గుచున్నది. దక్షిణదేశపు భీమా కంపెనీలలో 'యునైటెడ్ ఇండియా' గూడ బాగుగ వ్యాపారాన్ని సాగించుచున్నది.

శ్రీ బై. హనుమంతరావు

చక్కెర పరిశ్రమ

(7-వ పేజీ తరువాయి)

పరిశోధకసంఘంఉపాధ్యక్షుడు, ఐదేండ్లలో ఇండియాకు కావలసిన పంచదారమొత్తం 16 లక్షల టన్నులకు పెరగగల దని అంచనా వేశాడు. అంటే మన దేశం ఫ్యాక్టరీలు, ఏటా అధమంగా 16 లక్షలటన్నుల పంచదారనైనా తయారు చేయాల్సివుంటుందని రూఢి అవుతోంది. కాని ఇంత పంచదారను మన ఫ్యాక్టరీలు తయారుచెయ్యటం ఎటాగా అనేది ఆలోచించవలసిన సమస్య. ఇది తీరనిదే, పంచదార కరువుతీరటం కనబడదు. ఇప్పటి ప్రమాణంలో పని చేస్తే, మనదేశపు ఫ్యాక్టరీలు ఇంత పంచదార తయారు చెయ్యగలవనేది అనుమానాస్పదమైన విషయమే. ఒక్క 1939-40 సంవత్సరంలో మాత్రం మనఫ్యాక్టరీలన్నీ మహాధికంగా తయారు చేయగల్గిన పంచదారమొత్తం 12.42 లక్షల టన్నులు. ఆతర్వాత అంతకుముందూకూడా, ఈ మొత్తానికంటే తగ్గటమేకాని హెచ్చు లేదు. ఇంగులోనూ, 20,000 టన్నులు, ఇప్పుడు పాకిస్తాన్‌లోకి వెళ్ళిపోయిన 7 ఫ్యాక్టరీలు తయారు చేసిన సరకు మొత్తంకూడా కలిసి ఉంది. ఈ మిగిలిన ఫ్యాక్టరీలలో కూడా ఎక్కువ అన్నీ ఉత్తరహిందూస్థానంలో ఉన్నవి. అక్కడి వాతావరణంకూడా పరిశ్రమ పెరగటానికి ఎక్కువ అనుకూలంగా లేదు. చాలా ఫ్యాక్టరీలు ఆర్థికసౌష్ఠవంకలవి కావు. కొన్ని నష్టాలమీదే నడుస్తున్నాయి. ఆర్థికంగా పుష్టిలేనివాట్లను సమిష్టికూటంగా చేసి ఆర్థికపుష్టి నిచ్చి, కొత్త ఫ్యాక్టరీలను విరివిగా స్థాపించటం అత్యవసరమని తేలుతూంది. దక్షిణదేశంలో పంట, వాతావరణం, పరిస్థితులు, అన్నీకూడా, పుష్టిగా పని చేయగల ఫ్యాక్టరీలను విరివిగా స్థాపించటానికి అత్యనుకూలంగా ఉన్నాయి. కాబట్టి ఈ పరిశ్రమ, ఏకమొత్తంగా, సక్రమపురోభివృద్ధికల మార్గంలో, సప్రణాళికంగా నడిపించి, తగుకాలంలో, కావలసిన 16 లక్షల టన్నుల పంచదారతయారీకి తయారు కావలసిఉంటుంది.

భారతదేశానికి కావలసిన పంచదారనంతా, మిల్లులు వాట్లంతట అవే తయారుచేస్తాయి లెమ్మని ప్రభుత్వం ప్రమత్తతతో ఉండటం ఎంతమాత్రం తగదు. చక్కెరలోటును రాకుండా చేయడానికి తగిన చర్యలు తీసికోటం అవుసరం. అంటే ఉత్పత్తిలో లోటు రాకుండా చూడవలసిన బాధ్యత ఉంది. ప్రజలకు కావలసిన మొత్తం ఎప్పటికప్పుడు సరిగ్గా అంచనావేసి, అంతకు మించి అధమం లక్షన్నర టన్నుల పంచదారనైనా ఎప్పటికప్పటికి మిల్లులు తయారుచేసి నిల్వచూపించగలిగేటట్టు చూడాలి. కొరత కలుగగలదన్నప్పుడెల్లా ఈనిల్వను ప్రభుత్వం బజారులో పెట్టవచ్చును. ప్రస్తుతానికి అక్కరలేకపోతే, పై ఋతువుకు జాగ్రత్తపరచవచ్చును.

ఇదే కాకుండా ప్రస్తుతపరిస్థితులలో విదేశీ దిగుమతులుకూడా ప్రభుత్వం కొంత రానిచ్చి, "అవసరానికి నిల్వగా" ఉంచుతూ, కొరత ఏర్పడినప్పుడెల్లా బజారులో పంపకం చెయ్యటం మంచిది. ఈ దిగుమతులు కొరత ఏర్పడే కాలంలోనే చేసుకోవచ్చును. మనదేశానికి అవసరమైన ఈ 16లక్షలటన్నుల పంచదారను ఏటామిల్లులు తయారుచేసేస్థితిని శాసనక్రమంలోనైనా ప్రభుత్వం తెప్పించవలసిఉంటుంది. అంతతో ఈ ఐదేళ్లు పూర్తి అయేటప్పటికి విదేశీపంచదారధరతో మన పంచదారధర సమంగా రాగలిగేటట్టు చూడాలి. కాబట్టి ఎప్పటికప్పుడు విదేశీస్వదేశీ సరకుధరల తారతమ్యాన్ని పరీక్షిస్తూ 1950 తర్వాత ఐదేళ్ళ వరకైనా పరిశ్రమకు ప్రభుత్వం రక్షణఇస్తూ రావలసివస్తుంది.

బాలవిజ్ఞానము :

ప్రకృతి - మానవుడు

శ్రీ భైరవభొట్ల రామబ్రహ్మ శాస్త్రి

ఇంత మహాప్రపంచములో మనము మానవులము నిరంకుశముగా నివసిస్తున్నాము. నివసించటమే కాదు, ఏకచ్ఛత్రాధిపత్యంగా పరిపాలిస్తున్నాము. అంతే కాదు, ఇతరలోకాలను గూడ జయించాలని యత్నిస్తున్నాము. అందుకనే చంద్రలోకం, కుజలోకం మున్నగు లోకాలలోకి దూకటానికి సన్నాహాలు చేస్తున్నాము. ఆహాహా! ప్రకృతిలో మానవుడు ఎంత గొప్ప స్థానాన్ని ఆక్రమించాండో!

అట్టి యీ మానవుని ఉత్పత్తినిగురించి అనేకులు అనేకభిన్నాభిప్రాయాలతో ఉన్నారు. గొప్ప బ్రాహ్మపండితుడైన డాక్టరు జాన్ లైట్‌ఫుట్ గారును, కేంబ్రిడ్జి విశ్వవిద్యాలయోపాధ్యక్షుడును అయి యుండిరి. "ప్రకృతిలో మానవుడు క్రీ. పూ. 4004 వ సంవత్సరమున అక్టోబరు 25 వ తేదీని ప్రొద్దుటపూట సరిగా 9 గంటలకు మొట్టమొదటి మానవుని సృష్టించె" నని వారు చెప్పెదరు. కాని సర్ ఆర్థరుమహాశయుడు (కీత్) "మానవుడు ప్రస్తుతస్థితిలో నున్న మెదడును పొంది అనగా జ్ఞానవివేకములను పొంది కనీసము 10 లక్షల సంవత్సరాలైనా అయియుంటుంద" ని యంచనా వేసినాడు. ఒకటి కుడివైపుకు లాగుతే యింకొకటి ఎడమవైపుకు లాగుచున్నట్లు ఈ రెండు సంఖ్య లున్నవి. ఏది ఎట్లున్నా లైట్‌ఫుట్ గారి కంటె సర్ ఆర్థరుకీత్ గారి మాటే నూటికి 90 పాళ్లు తప్పు మరి పెద్ద లంటారు. అనటమే కాక నిశ్చయించారుకూడా.

ఇప్పుడు జేమ్సు యంగ్ సింప్సను అను శాస్త్రజ్ఞుడు తన పుస్తకములో నీవిధముగా వ్రాసినాడు. "సోమనదీలోయల్లో తిరుగాడు చున్నప్పుడు ప్రస్తుతనదిమట్టముకన్న 100 అడుగులఎత్తున మన కక్కడ మానవచిహ్నాలు, మానవనిర్మితవస్తుచిహ్నాలు గోచరించినవి. అనగా నీ నది ఇప్పటి మట్టముకన్న నూరడుగులు పైగ నున్ననాడే మానవజాతి యీ నదీ పరిసరప్రాంతములో నివసించి రని తెలియుచున్నది. ఈ నది ఎంతకాలములో 100 అడుగులలో తుకు పోయినదో అంతకాలముక్రిందటనే మానవులు నాగరీకులైయుండిరి రని తేలుచున్నది. అటువంటప్పుడు మానవుని పుట్టుపూర్వోత్తరాలు క్రీ. పూ. 4004 వ సంవత్సరమునుండి ప్రారంభమైన వనుట నమ్మరాని చోద్యము. అందుచే క్రీ. పూ. 4,00,004 సంవత్సరములో మానవు డుదయించినా డనుట కొంత సమంజసము." అని వ్రాసినాడు. ప్రస్తుతము మానవు డున్న తీరుగా కొన్ని లక్షల సంవత్సరములక్రింద గూడా మానవు లున్నారు. అంతకుముందు మానవునికి చాలా దగ్గరగా పోలిన, పార్శ్వ సంబంధ మున్న జంతురూపకమనుష్యు లున్నారనుట నిర్వివాదాంశము.

తర్వాత లైట్‌ఫుట్ వ్రాతకు, కీత్ వ్రాతకు ఇంకా చాలా అగాధభేద మున్నది. ఎందుకనగా మానవుడు అక్టోబరు 25 వ తేదీన ప్రొద్దున సరిగా 9 గంటల కుదయించినా డని లైట్‌ఫుట్ వ్రాయుచున్నాడు. కాని నవీనశాస్త్రరీత్యా, కీత్ వ్రాసినప్రకారము మానవు డనే ద్విపాద పశువు సహజంగా ప్రకృతిపరిణామములవల్ల అంతకంతకు మారుచున్న ఇతరజంతుసంతానమని తెలియవలయును. సర్వజంతువులు, సర్వవృక్షాలు, సర్వపక్షులు, సర్వమానవులు ప్రకృతిమాతకన్నబిడ్డలు. అందుచే సృష్టిలోని సర్వజీవములు, జడములు మానవుని, అన్నదమ్ములు, అక్కచెల్లెండ్రు. సహోదరులేకదా! అట్టిచో మానవునికి నితరజంతువులకు పుట్టుపూర్వోత్తర సంబంధబాంధవ్యాలున్నవనిచో మానవునికి గల్గు న్యూనత యేమి? మరి మానవునికి మేధాశక్తి ఉన్నది. అనేకవిజయములను సాధించినా డని యందురా! అవును, అందుకు కారణ మతని పూర్వీకులలో సరియైన ప్రొవ్వు బలిసి యుండుటయే.

మానవుని పూర్వీకులు

ప్రకృతివిజ్ఞాన మెరిగిన ఏ శాస్త్రజ్ఞుడు మానవుడు కోతిలోంచి పుట్టినాడంటే, నమ్మడు. ఇది చాలా అసంబద్ధము. కాని కాలక్రమేణా మానవుడు, కోతి ఒకేరకముగా ఒకే పద్ధతిలో ప్రకృతిపరిణామములను పొందుతూవచ్చినవి. అందుకని స్థూలదృష్టికి మానవుడు కోతివంశము లోనివాడే నని అనిపించకమానదు. మానవుని పోలికలలో పూర్వము చాలా పెద్ద కోతులు, ఓరింగ్, గోరిల్లా, చింపంజీ మొదలయిన రకాలుండేవి. కాని అంతమాత్రముచే కోతి మానవుని పూర్వీకుడు కారాదు. ఒక వృక్షమునకు - ప్రకృతిమాతయొక్క వంశవృక్షమునకు - మానవత్వస్కంధము, మర్కటస్కంధము లను రెండు పెద్ద కొమ్మలు పుట్టి పెరిగి విడిపోవుచూ పెరిగి పోవుచున్నవి.

పూర్వకాలంలో 20 లక్షల సంవత్సరాల క్రిందట, అంటే దాదాపు త్రేతాయుగంలో రామాయణకాలమునాడు ఒకానొక రకపు జంతువులు ప్రస్తుతం వాటిని మానవత్వమర్కటము లందాము - ఉండేవి. అవి యీ చెట్టుయొక్క మానవత్వస్కంధాగ్రము నాక్రమించి యుండిన వనుకొందము. అయితే అంతకుముందే ఆ చెట్టుకు మర్కటస్కంధ మను కొమ్మ విడిపోయి పెరుగుచున్నదిసుమా! ఈ కొమ్మయొక్క ఆకులు, బుల్లికొమ్మలు, పిల్లకొమ్మలు - ఇవన్నీ నవీనయుగమర్కటము లని యందాము. పూర్వయుగమర్కటములు - అనగా రామాయణకాలమునాటి మర్కటములు - మానవత్వమర్కటము లందాము. ఈ పూర్వయుగమర్కటము లుండే రెండవ పెద్ద స్కంధమును ఆ మర్కటములు బాగా చిగిర్చి, వికసించి, పూలు పూచేటట్లు, కాయలు కాచేటట్లు చేసి అవి ఒక ఉపస్కంధముగా విడిపోయినవి. ఇంకా ఈ అసలు పెద్ద స్కంధములు రెండునూ విడిపోవుచునేయున్నవి. ఎక్కడా ఏమాత్రం దీనికి దానికి అతుకుగాని అంటుగాని లేదు. కాని ఈ పూర్వయుగమర్కటస్కంధ మున్నామే, దానిలోనుంచి రెండు చిన్న కొమ్మలు బయలుదేరినవి. అసలుస్కంధ మట్లాగే చిగుర్చుచు పెరిగిపోవుచునే యున్నది. ఆ రెండు చిన్న కొమ్మలలో మొదటిది చాలా చిన్నజాతిమానవత్వమర్కటముల కొమ్మ. రెండవ కొమ్మ చాలా పెద్దజాతిమానవత్వమర్కటముల కొమ్మ. ఈ రెండూ పుట్టిన స్కంధముమాత్రము మానవత్వస్కంధమే. ఈ మానవత్వమర్కటములు మన మిప్పుడు చూచు కోతులకన్నా చాల భేదించినవిసుమా! ఇంకను ఆ పెద్దకొమ్మలు విడిపోవుట మానలేదు. అంతకంతకు విడిపోయి పెరిగిపోవుచున్నవి. ఇంకా కొంతకాలానికి ఆ మానవత్వస్కంధము లోంచి "పితికన్‌త్రోపస్" అను తల ప్రేలాడు వేసికొనియున్న మానవజాతి ఉద్భవమైంది. ఇది పెద్దమానవత్వస్కంధానికి మూడవ చిన్న కొమ్మ యనుమాట. ఇంకా మిగిలి పెరిగిపోవుచున్న మానవత్వస్కంధము అచ్చపు నవీనజాతి మానవస్కంధ మన్నమాట. ఇట్లు మానవులు ప్రకృతిలో నుద్భవమైరి. కాబట్టి దీని సారాంశమేమని తేలుచున్న దనగా మానవులు, మర్కటములు ఒకే తల్లిజంతువుబిడ్డ లనియూ, కాబట్టి మానవులూ, మర్కటములూ సోదరసమాను లనియూ తేలుచున్నది. సోదరులలో సహజముగా అనేకపోలిక లుండుచుండును. అంతమాత్రముచే మానవులు కోతుల సంతాన మనుట భ్రమ. ఈ నవీనజాతిమానవస్కంధమునుండి ఆఫ్రికావారు, ఆస్ట్రేలియావారు, ఆసియావారు యిరోపావారు అను నాల్గు తెగలు విడిపోయిరి. ఇంకా ఏమంటే "నియాన్‌డేర్తెలరు" లను నొకజాతిజంతువులుకూడా మానవుని పూర్వీకులు కా దనియు, కాని ఎట్టిదో పార్శ్వసంబంధ ముండియున్న దనియూ తెలియుచున్నది. మర్కటస్కంధము వేరుగా నున్నదికాబట్టి మానవత్వస్కంధము విడిగా చీలిపోలునదికాబట్టి మానవులు ప్రకృతిమాతకు గల్గిన బిడ్డలలో నొక ప్రత్యేకజాతివారు. మర్కటములు కాలక్రమేణా వాటికి కల్గు పరిణామముల పద్ధతిలో నవి మార్పులు చెందుచున్నవి. ఇట్లాగే మానవత్వమర్కటములుగూడా. కానీ యింకా ఈ మానవు డనే జంతువుకు నాలుగు కాళ్లున్నవి. కొంతకాలానికి ముందటి రెండు కాళ్లు కురుచ అయిపోయినవి. ఇది ఎప్పుడు జరిగినదో, ఎట్లా జరిగిందో ఎవ్వరికీ తెలియదు. ముందటి రెండు కాళ్లు కురుచ అవటంతోటే మానవుడు వెనుక రెండుకాళ్ళతో నడవవలసివచ్చినది. మొట్టమొదటలో వంగి ముందటికాళ్లు నేలకు ఆని, ఆనకుండా పాపము! అవస్థపడి నడిచేవాడు. మన చంటిపిల్లలు ప్రాకటం ఈ సమయంలో ముఖ్యంగా జ్ఞప్తికి తెచ్చుకోవాలి. అట్లా ప్రాకుతూ ముందటి రెండు కురుచకాళ్ళతో అనగా చేతులతో - తన ఆహారమును - అచ్చు మన చంటిపిల్లవానివలెనే - పట్టుకునేవాడు. తీసికొనేవాడు. నోటిలో పెట్టికొనేవాడు. తర్వాత తర్వాత మన చంటిపిల్లవాని మోస్తరు లేచి నించోటం అలవాటుచేసికొన్నాడు. ఈ మానవుని ముందటికాళ్లు పొట్టి అయినందువల్ల యీ తగ్గిపోయిన మాంసభాగము మానవుని మెదడులో చేరుకొన్నది. ఇప్పుడు అంతకుముందున్న మెదడుకన్న ఎక్కువమెదడయినది. కాబట్టియే యీ ద్విపాదపశువు మిగతాపశువులకన్నా మేధావంతుడైనాడు. ఇక యీ జాతి పెరుగుకొద్దీ వంశపారంపర్యముగా అంగములు నాజూకులు, నిగ్గులు దేరి నవనవలాడుచు మిసమిసలాడినవి. ఈ మానవుని మనస్సు నూత్నకళలతో, తళుకుబెళుకులతో వికసించుకొద్దీ మానవుడు జ్ఞాననేత్రము తెరచుచున్నాడు. స్వార్థపరత్వము అడుగంటుచున్నది. కష్టసుఖా లంతరించుచున్నవి. ప్రపంచ మన నేమో గ్రహించుచున్నాడు. మిగతా జనులతో కలసిమెలసి వర్తించుట నేర్చుకొన్నాడు. సాంఘికసంబంధ బాంధవ్యము లభివృద్ధిచేసికొనుచున్నాడు. పెద్దలు "మానవుడు సంఘనియంత కాడు. సంఘమే మానవుని నియంత" అని యుక్తియుక్తంగా అన్నారు.

ఈ మనోబుద్ధివికాసము మానవునిలో వచ్చినప్పటినుండి చెట్లమీద నివసించుట మానివేసినాడు. భూమివాసు డైనాడు. అయినా చాలా కాలముపాటు చెట్ల ఆకులుమాత్రమే వాని దుస్తులు, చెట్ల ఫలములుమాత్రమే వాని ఆహారము, చెట్ల బెరడుమాత్రమే వానికి కాగితము, చెట్ల రసములుమాత్రమే వానికి ఔషధములు. ఇప్పు డితడు ద్విపాదపశువు. ఈ పశువు నోటిలోనుండి శబ్దాలను పుట్టించవచ్చని తెలిసికొన్నది. ఆ శబ్దాలను ఒక క్రమంలో పెడితే ఒకరి నొకరు అర్థము చేసికోవచ్చు ననుకొన్నాడు. అప్పుడొక భాష తయారయింది. ఇది ఐరోపావారికే చెందుతుంది. మన హిందువులలో ప్రతి అక్షరము ఒక దేహ అంతరింద్రియమునకు సంబంధించినది. తర్వాత మనవారు అచ్చులు 16 ఉండుటకు ఏవో వేదాంతాలు జ్ఞానయోగసూత్రాలు కారణం చెప్తారు. ఈ మనవారి విషయాలు, భాషావిశేషాలు ఇదమిత్థ మని తేల్చటం చాలా దుర్లభం, కష్టసాధ్యము.

మనం మాట్లాడుకునే మానవుడు, ఆ శబ్దాల నింకో క్రమంలో పెడితే అనేక విధాలుగా ధ్వనిస్తా యనుకొన్నాడు. ఇట్టిధ్వనులలో కొన్ని హృదయానికి ఉద్రేకము, ఉత్సాహము, ఉద్వేగము ఇంకా ఉన్మత్తతకూడా కలిగించగల వని కనుగొన్నారు. దీనినే సంగీత మని, కీర్తన రాగము లని పేరుపెట్టి పిల్చుచున్నాడు. తనచుట్టూ గల వస్తువులను పరికించినాడు.

మనోవిజ్ఞానముతో వానిని జల్లించినాడు. అడుగుకి నిగ్గుదేరి నవనవలాడుచున్న వానిని సేకరించినాడు. వాటితో నాగరికతాభివృద్ధి చేసికొంటున్నాడు. శత్రువులను నిర్జించటం నేర్చుకొన్నాడు. కొందరు మనుష్యులు చనిపోవటం చూశాడు. మానవత్వం నిలబెట్టేందుకు మార్గాలు వెదికాడు. మానవత్వంగల, కాని ఆ కారంలో కొద్దిమార్పులుగల ఇంకో ద్విపాదపశువుతో కూడి చనిపోయేవారి సంఖ్య భర్తీ చేసేందుకుగాను సంతానం కనటం మొదలుపెట్టాడు. కాని నవీనకాలంలో ఆ యుద్దేశమే దాదాపు అంతరించినది. మానవునికి నాగరీకత, మెదడు, విజ్ఞానము అభివృద్ధి యగుచున్నకొద్దీ మిగతా సోదర జంతువుల కున్న నీతి నియమాలనుగూడా కామ విషయంలో విసర్జించాడు. అనేకమందితో కలసి పనిచేయటం నేర్చుకొన్నాడు. బంధుప్రేమల నలవర్చుకొన్నాడు. అనేక జనులు కలసినసంఘము నేర్పరుచుకొన్నాడు. ఈ విధంగానలు మూలలా సర్వశాస్త్రవీధులలో, సర్వకళలసందులలో మానవుడు పురోగమించి పోతున్నాడు...



లండన్‌లో రాడార్ ప్రదర్శనం: బ్రిటిష్ సప్లయిశాఖవారి రాడార్ పరిశోధనాలయంవద్ద పదాతిదళాల ఉపయోగంకొరకు ప్రత్యేకం తయారుచేయబడి రాడార్, పౌరుల పరిశీలనకుగాను ప్రత్యేకం ప్రదర్శింపబడినది.

ఆ యిల్లు

(8-వ పేజీ తరువాయి)

ఆ సాయంత్రం ఆ పనిమీద కదలలేకపోయేను.

ఏమిటి ఆలోచిస్తున్నానో నాకే నిశ్చయంగా తెలియకుండా డాబామీద పడకకుర్చీలో పడుకొన్నాను. రాత్రి హోటలుకి భోజనానికి వెళ్లాలన్న విషయమే స్ఫురణకి రాలేదు. ఎప్పుడు నిద్రపట్టిందో కూడా తెలీదు.

ఆనాటి నిద్రలో కలలువచ్చేయో లేవో చెప్పలేను కాని, మెలకువవచ్చినతరవాత కనిపించిన దృశ్యమూ, జరిగిన సంఘటనామాత్రం ఈనాటికీ కలలగానే కనిపిస్తాయి. కలలయినా అంతటివి ఎప్పుడో తప్ప, తరచుగా వస్తాయనుకోను.

ఆమె మెత్తనిచేయి నా చేతిని తగలడంతో మెలకువ వచ్చింది. అప్పుడు తెల్లవారుజాము మూడో నాలుగో అయి ఉంటుందనుకొంటాను. ఎంచేతంటే అది కృష్ణపక్షం; ఆ వేళ తిథి దశమి. అల్లంత ఎత్తున ఉన్న చంద్రవంక వెలుగు రేకలు ఆమె మొగంమీద, ముఖ్యంగా కళ్లలో పడి నాకళ్లలోకి ప్రతిఫలిస్తున్నాయి. ఆ అప్పుడే నిద్రలేచిన ప్రశాంతిలో, ఆమెగాని మాట్లాడకుండా చల్లగా వెళ్లిపోయి ఉంటే, మళ్లీ నేను నిద్రలో మునిగి రాత్రి కలలో ఎవరో దేవతామూర్తిని చూసే ననుకొని ఉందును.

ఆమె ఎక్కువ మాట్లాడలేదు. "నాకు మా అత్తయ్య తను చచ్చిపోయేముందు ఎవ్వరికీ తెలియకుండా ఇచ్చింది. ఇందులో నలభై అయిదురూపాయి లున్నాయి తీసుకోండి, మీ కిప్పు డవసరంగా ఉన్నట్టున్నాయి" అంటూ నాచేతికి ఒక చిన్న బార్లీ గుండడబ్బా నందించి, "చాలునా?" అంది తన చిటికెన వ్రేలికున్న ఉంగరంవంక చూస్తూ.

"చాలునుగాని, ఎందుకూ, మీకు మళ్లీ తిరిగి ఇవ్వడానికి..."

అంటూఉండగా ఆమె వారించి, "ఇవ్వకపోయినా మరేం బాధ లేదు లెండి, నేను వెళ్తాను. ఎవళ్ళయినా వస్తారు" అంటూ డాబా మెట్లమీంచి దిగినట్లు కాకుండా జర్రున జారినట్లుగా వెళ్ళిపోయింది.

ఆమె ఎలా వచ్చిందో, నన్ను లేపడానికి ముందు ఎంతసేపు అల్లా నిలబడి ఉందో తెలియదు. వెళ్ళిపోవడాన్ని ప్రత్యక్షంగానే చూసినా ఏమో అతిలోకస్వాప్నికవృత్తాంతంలాగే తోచింది. అయితే ఆమె నాచేతికి అందించిన డబ్బామాత్రం ఎటువంటి సందేహానికీ తావియ్యలేదు. అందులో ఒక సన్నని సిల్కుగుడ్డతో చుట్టబడిఉన్నాయి నోట్లు. వాటిని మరి లెక్కపెట్టాలనిపించలేదు. ఇప్పటికీ, ఆ రూపాయిలను కేవలం రూపాయిలమానంలోనే లెక్కకట్టడం ఆమెసౌహార్దానికి పరమఅపచారం చేయడం అనిపిస్తుంది.

అంతసేపూ శ్రద్ధగా విన్న మా బావమరది మరి ఉండబట్టక, "ముందు ఆమె ఎవరో ఏమిటో మాకు చెప్పకుండా, అలా అల్లుకొనిపోతూంటే, మమ్మల్ని ఆమెను ఏవిధంగా అర్థం చేసుకోమన్నట్లు? ఆమె మానవలోకంలోని మామూలుమనిషా? లేక స్వర్గలోకమునుండి వేళకు దిగివచ్చిన దేవతా? లేక, ఉపలోకంలోని ఊర్వశా? ఎవరనీ నిర్ణయించేదిరా అన్నంత సందేహంలో మమ్మల్ని ఉంచేస్తే ఎలాగ? అసలు కథకుడు కానివాడు పెద్దఎత్తున కథ చెప్పడం మొదలు పెడితే వచ్చే అనర్థమే ఇది" అన్నాడు.

మామూలుగా అయితే అటువంటి వాదనసావకాశాన్ని నేను తేలికగా పోనిచ్చేవాణ్ణి కాను, గాని ముందుగా నా చెప్పే సంగతి పూర్తి కాకుండా వాదనలోకి దిగా లనిపించలేదు. "అవునయ్యా, నే నెలాగూ నీలాగ కథకుణ్ణని చెప్పుకోవడం లేదు. కాక ముందుగా ఏది అత్యంత ముఖ్యమయిన విషయం అయితే, దాన్నే పరిశీలించడం మా డాక్టర్ల లక్షణం" అన్నాను.

అంతలో మాఆవిడ కథ పక్కదారి తొక్కుతున్న దేమోనని అనుమానించి, "అయితే తరవాత ఏమి టయింది చెప్పరూ, అందులో గాని డబ్బు అనుకొన్నంతా లేదా ఏమిటి" అంది.

అహాఁ అటువంటి దేం లేదు. అంతా సరిగానే ఉంది. కాని, ఆమె ఎవరన్న సంగతి కదూ ఇంతవరకు చెప్పలేదు.

ఆ యింట్లో ఒక భాగంలో కుటుంబయ్యగారని, ఒక ప్లీడరుగుమాస్తా ఉండేవాడు. వాళ్ల ప్లీడరుఆర్జనకంటె ఆయనఆర్జనే ఎక్కువగా ఉండేదిట. కాని, అందులో మూడువంతుల ముప్పాతిక తన వ్యసనాలకే ఖర్చుపెట్టేసేవాడనే వారు. ఆయన ఎటువంటివాడయితే నేం. వాళ్ల పెద్దమ్మాయి పేరు శాంతి. ఆమెను నేను అదివరకు చూడకపోలేదు. కాని, ఆ చూడడం వేరు, ఆ తెల్లవారుజామున చూడడం వేరు.

ఆమె నాకంటె వయస్సులో ఒకటి రెండేళ్లు చిన్న యిఉండవచ్చునుకాని, పెద్దన్నట్లుగానే కనబడేది. నేను అప్పటికి పదహారున్నరసంవత్సరాలవయస్సున్నా బాగా పెరగకపోవడంవల్లనూ, ఆమె పరికిణీ పల్లెవాటు కూడా మానేసి చీరలే కట్టుకొంటూఉండడం వల్లనూ.

తరవాత కొన్నాళ్లు ఏమో నాకే తెలియని వింతకదలిక. నా కృతజ్ఞతను ఏయేరీతుల ఎంత ఉదాత్తంగా ప్రదర్శించాలీ అన్న ఆలోచనతో ఎన్ని పగటికలలు కన్నానో లెక్కలేదు.

ఎల్లప్పుడూ ఆమెను చూడాలనే ఉండేది, మాట్లాడడం ఎలాగూ సాధ్యంకాదుగనక. కాక మేమిద్దరమూ తారసపడినప్పుడు దగ్గర ఎవ్వరూ లేకపోయినాసరే, నిబ్బరంగా ఆమెకళ్లలోకి చూడడానికి సాహసం చాలేదికాదు.

తరవాత మా చిన్నాన్న తేరుకొని డబ్బు పంపేవేళకు ఆమె అత్తవారింటికి వెళ్లిపోయింది. ఇప్పుడంటే ఇంత తేలికగా అనేస్తున్నాను గాని, అప్పుడు ఎవర్నీ అడక్కుండా ఆ విషయం తెలుసుకొందికి ఎంత అవస్థపడ్డానో, తెలుసుకొన్న తరవాత, అరరే ఆమెకు నా కృతజ్ఞతను తెలుపలేకపోవడమే కాదు, అధమం ఋణంఅయినా తీర్చుకోలేకపోయే నే అని ఎంత తపించేనో ఇప్పుడు నాకూ సరిగా ఊహకు అందదు. అప్పుడదొక జీవితంలోని అతి ముఖ్యమయిన సమస్య.

తరవాత నాకు ఉన్న అతిఅమూల్యమయిన వస్తువులలో ఒకటి అన్నంత భద్రంగా ఆ డబ్బాను నా పెట్టెలో దాచిఉంచేవాణ్ణి. ఒకమారు నా బట్టలూ అవీ సర్దడంలో ఈవిడే (శారద) తీసిపారేసిందట. అవేళే చెప్పాలనుకొన్నాను గాని, అవతల ఏదో తొందర కేసు ఉండి వెళ్లిపోవలసివచ్చింది.

ఆవెనుక అదివరకు ఏడెనిమిదిసంవత్సరాలుగా సాగిన దావా మా చిన్నాన్నకి చాలా అనుకూలంగా పరిష్కారం కావడంతో నేను హుషారుగా యమ్. బి. బి. యస్ చదువుకుందికి వెళ్లిపోడానికి వీలుకలిగింది.

చదువు పూర్తయినతరవాత ఈ ఊళ్లోనే ప్రాక్టీసు పెట్టేను.

ఆరంభించి అప్పటికి ఒక పదినెలలకంటె ఎక్కువ కాలేదు. ప్రాక్టీసు ఏదో ఒకమాదిరిగా ఉంటున్నా అంత మరి ప్రోత్సాహకరంగా లేదు. తీరికగంటలంటూ చాలా ఉండేవి.

ఆరోజు పూర్ణిమ. అప్పుడే ఉదయించిన చంద్రబింబం చెట్లచాటునుండి, ఇంకా ఎరుపుధాతువుతోనే కనిపిస్తున్నది. ఒంటరిగా డాబామీద కూర్చొని, ప్రపంచంగురించి, దేశంగురించి, నాగరించి, సంఘంగురించి కలగాపులగంగా ఆలోచిస్తున్నాను.

అంతలో కిందనుంచి పిలుపు వినవచ్చింది. నాకరుర్రవాడితో మేడమీదకు తీసుకొని రమ్మన్నాను. వచ్చిన మనిషి కుటుంబయ్యగారే; చూపిన కుర్చీమీద కూర్చోకుండానే దండకం చదివినట్లుగా అందుకున్నాడు. "అప్పుడు తమరు మేమున్న ఇంట్లోనే ఉండి చదువుకొని, ఇంతవారవడం చాలా సంతోషం. తమ దర్శనం చెయ్యాలనుకొంటూఉండడం ఎప్పటికప్పుడే తీరికలేకపోతూ ఉండడమున్నా. మరి కూర్చొందికి నాకు వీలులేదు. మా శాంతమ్మకి ఒళ్లెరగని జ్వరం. నాలుగయిదురోజులు అదే పోతుందని ఊరుకున్నాము. తరవాత కొయినా (క్వినైను) మాత్రలు వేసినా తగ్గలేదు. ఏమిటో భయంగా ఉంది బాబూ, ఇంతవరకూ జ్వరం తిరుగుముఖానికి రాలేదు. తమరు ఒక్కమారు దయచేస్తే" అన్నాడు.

ఈ మాటలు వినడంతో అతనికంటె నాకే తొందర ఎక్కువయింది. ఏమాత్రమయినా ఉపయోగిస్తాయని తోచిన మందులన్నీ పట్టుకొని, జట్కాలో బయలుదేరేను.

జబ్బుగురించిన లక్షణాలే దారి పొడుగునా కుటుంబరావుగారిని అడిగేను. ఆయనా అవే చెప్పేడు, అంతే. కాని, వెళ్ళి ఆమెమంచం పక్కను కుర్చీలో కూర్చునేవరకూ ఆమె వితంతువు అన్న సంగతి తెలీదు. డాక్టరుగా నా కనవసరమయిన అంశంమీద నా మనస్సు లగ్నం కావడం నాకే చిన్నతనంగా తోచింది. ఎవరయితేనేం, ఆమెకు నేను ఋణపడిఉన్నాను. నాచేతనయినంతగా పరిశ్రమించి ఆమెకు ఆరోగ్యం చేకూర్చడం నా విధి అనుకొని పరీక్ష ప్రారంభించేను. కుటుంబయ్యగారు చెప్పినంత ప్రమాదంగా కాకపోయినా, జ్వరం చాలా ఎక్కువగానే ఉంది. టైఫాయి డనడానికి ఏమీ సందేహంలేదు. కాని, టైటివాళ్లు చెప్పే మాటలు తీలగా అర్థంఅవుతున్నాయి.

నేను నా పరీక్ష ముగించి థర్మామీటరు చేతులూ కడుక్కొందికని దివాకిలిలోకి వచ్చేను.

ఎదురుగా డాబా కనిపించింది. ఉఁహుఁ, కనిపించింది డాబామాత్రమే కాదు, ఆ వెన్నెలలో పడకకుర్చీలో నేను పడుకొనిఉండడమూ, ఆమె ఎట్టఎదురుగా దేవతామూర్తివలె నిలబడిఉండడమూ అతిస్పష్టంగా కనిపించింది. ఆహా, ఆ దివ్యసౌందర్యానికీ, ఈ మంచంమీద దుర్బలంగా పడిఉన్న ఆకృతికీ ఏమి సంబంధం? ఒక్క ఆరు సంవత్సరాలలో అంత మార్పు రావడానికి వీలుందని ఎవళ్లయినా అంటే, నా కళ్లతో నేను చూడకపోతే నమ్మలేకపోయేవాడిని అనుకొన్నాను.

నన్ను పిలవడంతో కుటుంబయ్యగారి పని చాలా తేలికపడిఉంటుంది. ఏమంటే వాళ్లందరూ తీసుకోవలసిన శ్రద్ధ అంతా నేనే తీసుకొంటూ, ఇదేదో నేను డబ్బు పుచ్చుకుని కుదర్చవలసిన జబ్బు అనికాక, నాకే సంబంధించిన జీవన మరణసమస్య అన్నట్లుగా తాపత్రయపడసాగాను. కుటుంబయ్యగారూ వాళ్లూ ఏమో ప్రాక్టీసు బాగా లేదుకాబోలు. అంచేత గట్టిగా శాయశక్తులా పనిచేసి ఒకటి రెండు చోట్ల నయంచేస్తే, పేరువస్తుందని పని చేస్తున్నానని నా విపరీతమయిన శ్రద్ధకు అర్థం చెప్పుకొని ఉంటారు. కాని, ఆ సందర్భంలోమాత్రం, పేరు రాకపోతే మానిపోయెను. అపకీర్తి వచ్చినా బాధ లేదు. ఆమెకి ఆరోగ్యం చేకూరితే అంతే చాలు ననిపించింది. అందుకు మనం శాస్త్రీయంగానూ, సామాన్యదృష్టితోనూ ఎన్నెన్నో కారణాలు చెప్పుకోవచ్చునుగాని, అసలు పరిస్థితి మాత్రం అది.

మరేం ప్రమాదకరమయిన లక్షణాలు లేవు, నేనే నయంచేయగల నన్న నమ్మకం ఉండినప్పటికీ, ఏమో నేను పొరబడుతున్నానేమో, ఇటువంటి సందర్భాలలో నా అహంభావం కోసం పాకులాడడం మంచిది కాదని అప్పటిలో ఊరంతటికీ ప్రసిద్ధుడయిన డాక్టరు శ్యామలరావుగారిని నాలంతట నేను తీసుకొని వెళ్ళేను.

నాకయితే ఎంత స్వల్పంగానయినా కష్టం ముట్టచెప్పి, తక్కినదంతా కృతజ్ఞతావాక్యాలరూపేణ చెల్లించవచ్చునన్న కుటుంబయ్యగారికి, డాక్టరు శ్యామలరావుగారి రాక ఒకవిధంగా ఇష్టమే అయినా ఇంకొకవిధంగా గర్భరాకి కారమయింది. కాని, ఆయనను అట్టేసేపు ఆ స్థితిలో ఉంచకుండా, "డాక్టరుగారి బిల్లు సంగతి మీకేం పూచీ లేదు. అదంతా నేను స్వయంగా చూసుకొంటాను. అంటే, అసలు, ఇటువంటి సందర్భంలో మే మిదివరకు చదివి చదివి ఎంత తెలుసుకున్నా వారి అనుభవంనుండి నేర్చుకోవలసినవికూడా చాలా సంగతు లుంటాయి. అందుకోసమే ఆయనను తీసుకొని వచ్చేను. ఆయనా, నేను అభిప్రాయపడ్డట్టే అభిప్రాయపడుతున్నారు. మరొక్క అయిదారు రోజులు ఈవిధంగానే ఉండవచ్చును. కాని క్రమంగా తగ్గుతుంది. మరేం పర్వాలేదు" అన్నాను.

అనుకొన్నట్లుగానే, కాదు, ఆశించినట్లుగానే ప్రమాదపు రోజులు గడిచిపోయాయి. రోగం తిరుగుముఖం పట్టింది.

ఆ రోజు ఉదయం ఆమె నన్ను విస్పష్టంగా గుర్తించిం దనడానికి ఎట్టి సందేహమూ లేదు. ఆ కన్నుల కదలిక ఇప్పటికీ నాకు కన్నుమూసుకొంటే స్పష్టంగా కనిపిస్తుంది

అదివరకు రోజుకి కొన్నిగంటలు ఆమె మంచంప్రక్కనే కూర్చొనేవాడిని, ఆతరవాత ఏదో చిత్రమయిన మొగమాటాన్ని అనుభవించసాగాను.

రోజు రోజుకీ ఆమెపరిస్థితి బాగుపడుతున్న కొద్దీ, నేను కనే కలల సంఖ్యకూడా అతిగా వృద్ధిపొందసాగింది. కొన్ని పగటికలలు, కొని రాత్రికలలు.

ఆమెను నేను పెళ్లి చేసుకొందికి ఎన్నెన్నో అవాంతరాలు ఏర్పడినట్లు, బాగా కావలసిన బంధుమిత్రులంతా వద్దని చెప్పినట్లు, ఇందరినీ అలక్ష్యంచేసి పెళ్లి చేసుకొన్నట్లు, ఆమె ఏవో కారణాలు చెప్పి తనకు ఇష్టంలేదంటే, ఎన్నో విధాల నచ్చజెప్పి చిట్టచివరకి ఒప్పించినట్లు, ఇద్దరం కలిసి అలా ఒకరి చెయ్యి ఒకరు పట్టుకొని ఏసాధనం లేకుండానే గాలిలో తేలిపోయినట్లు, అలా అలా ఏవో అడవులూ, కొండలూ దాటి వెళ్లిపోతూండగా, అకస్మాత్తుగా ఒకరు ఏ అగాధమయిన లోయలోనికో పడిపోతూఉంటే రెండవవారు చేయూతనిచ్చి రక్షించినట్లు...ఓ ఒకటేమిటి, ఎన్నెన్ని రకాలుగానో కలలు.

అయితే కలలరూపంగానయినా సంతోషం ఒక పదిరోజులకంటె ఎక్కువ నిలవలేదు.

ఆవేళ ఉదయం నే నింటిదగ్గర లేవప్పుడు కబురు వచ్చిందిట వ్యాధి తిరగబెట్టిందని. నేను తెలుసుకొని వెళ్లేటప్పటికి శ్యామలరావుగారు వచ్చి ఉన్నారు. ఆయన అట్టే ఆశ లేదంటూ ఉన్నా, చిట్టచివరివరకూ అంత సమీపంలోనే మృతి కాచుకొని ఉందని నే ననుకోలేకపోయేను. ఆరాత్రి పదకొండుగంటలతో సమాప్తమయి పోయింది.

ఆరాత్రే కాదు, తరవాత చాలా రాత్రులు నిద్ర సరిగా ఎరగను. అయితే ఆరకంగా ఒకరితో చెప్పుకోలేకుండా విచారించడంవల్ల నా శరీరాన్ని చెరుపుకోవడంకంటె మరేమీ చేసేదిలేదన్న వ్యావహారికజ్ఞానంతో, తరవాత మామూలుమనిషి నయి పెళ్ళికి సిద్ధపడ్డాను.

అయితే ఇంతికీ చెప్పవచ్చే దేమిటంటే, దరవాత కొంతకాలం ఎంత ముఖ్యమయిన కేసు లున్నాసరే, ఆవీధిలోంచి వెళ్ళడం అంటేనే బాధగా ఉండేది. ఇటీవల ఎంత మొరటుదేరిపోయినా, ఆ యింటిని తేరిపారి చూస్తే మాత్రం కళ్లంట నీళ్లు వచ్చేస్తాయి. ఇక లోపలికి వెళ్ళి ఆ డాబా ఆగదులూ చూస్తే బిగ్గరగా ఏడ్చేస్తానేమో!

సరే, ఇక నీయిష్టం, మీ చెల్లెలుఇష్టం... తరవాత ఆలోచిద్దాముగాని, లే, హాయిగా ఏదైనా సినీమా చూసివద్దాం – అంటూ లేచేను కుర్చీలోంచి.

పరిశ్రమలను జాతీయంచేయడం ప్రయోజనకరమా?

శ్రీ ప్రతాప రామసుబ్బయ్య

(గతసంచిక తరువాయి)

[illegible] దేశాలలో అమల్లో వున్న జాతీయ విధానం పరిశీలిస్తే, ఏది నిజమైనదో, ఏది బూటకమైనదో బోధపడుతుంది.

1945 జూలైలో జరిగిన బ్రిటిష్ పార్లమెంటు యెన్నికల్లో లేబర్‌పార్టీ గెల్చింది. తమ యెన్నికప్రణాళికలో బాంక్ ఆఫ్ ఇంగ్లండును, రాకపోకలను, రవాణాసాధనాలను, విద్యుచ్ఛక్తిని, బొగ్గుపరిశ్రమను, లోహపరిశ్రమను జాతీయం చేస్తామని వాగ్దానం చేశారు; నిరుద్యోగము పూర్తిగా తొలగించే కార్యక్రమం జయప్రదం చేయడానికి యేయేపరిశ్రమలో యెంతెంత పెట్టుబడి అవసరమో, దానిని సద్వినియోగం చేయడానికి యెన్నికప్రణాళికలో వివరించబడ్డది. బాంక్ ఆఫ్ ఇంగ్లండు ఒక ప్రయివేటు సంస్థ; యిది 1694 నుంచి వ్యవహరిస్తున్నది. 1946 మార్చి 1 వ తేదీన యీ బ్యాంకును జాతీయం చేయడానికి ఒక చట్టాన్ని పార్లమెంటులో ఆమోదించారు. తరాల తరబడిగా బ్రిటిష్‌ప్రభుత్వం పాలసీని యీ బ్యాంకీయే రూపొందించి, నడుపుతూవస్తున్నది. నూతనంగా ప్రవేశపెట్టబడ్డ సంస్కరణవల్ల బ్రిటిష్ కోశాధికారికే యీ బ్యాంకి పాలిసీ నిర్ణయించే అధికారం సంపూర్ణంగా లభిస్తుంది. ఈ సంస్కరణ యేనాడో జరగాలసింది. చాలాకాలం క్రిందటే పెట్టుబడిదారీ రాజ్యాలు తమ బ్యాంకులను ప్రభుత్వాల స్వాధీనం చేసుకున్నాయి. "జాతీయత" అనే పేరుతో, చాలా మితవాదసంస్కరణ మాత్రమే ప్రవేశపెట్టబడింది. ఈ సంస్కరణవల్ల బ్రిటిష్ ప్రజలకు చాలా నష్టం వాటిల్లింది. కారణమేమంటే, బ్యాంకువాటాదారు పెట్టిన పెట్టుబడి వారికి యేనాడో చెల్లించబడినా, తిరిగి నష్టపరిహారం క్రింద విపరీతమొత్తములను ప్రభుత్వ బాండుల ద్వారా వీరికి ప్రభుత్వం చెల్లించింది. ప్రభుత్వపరమైన బ్యాంకును నూతనంగా నియమించబడ్డ ముగ్గురు వ్యక్తులతోపాటు, యిదివరలో నడుపుతున్న పాత సభ్యులే నిర్వహిస్తున్నారు.

బ్యాంకుల పరిపాలనానిబంధనావళిని నామమాత్రంగా సవరించి బ్రిటిష్‌ప్రభుత్వం పెట్టుబడిదారీవర్గంయెడల తమకుగల సానుభూతిని ప్రదర్శించింది; కాని బ్రిటన్‌లో బలవత్తరమైన పలుకుబడి సంపాదించిన వ్యాపార బ్యాంకులమాటే తలపెట్టలేదు. బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండే వ్యాపార బ్యాంకులయొక్క పాలసీని కూడా నడపవచ్చునని ఒక నిబంధనైతే ఉన్నది కాని, అది కేవలం నామమాత్రంగానే ఉన్నది.

బ్యాంక్ ఆఫ్ ఇంగ్లండును జాతీయం చేసిన తర్వాత, పెట్టుబడిదారీవర్గాలే యీ సంస్కరణ పూర్తిసంస్కరణ కాదని, కేవలం పైపూత మాత్రమేనని వ్యాఖ్యానం చేశాయి. ఇలా వ్యాఖ్యానం చేసినవారిలో సుప్రసిద్ధపెట్టుబడిదారీపత్రిక అయిన "ఎకనామిస్టు" ఒకటి.

బ్రిటిష్ ఆర్థిక జీవితంలో ప్రధానపాత్ర వహించింది బొగ్గుపరిశ్రమ. దీనినిబట్టి యీ పరిశ్రమను జాతీయం చేయడంలో విశేషప్రాముఖ్యత ఉన్నది. బ్రిటన్‌లో వివిధపరిశ్రమలను జాతీయం చేసే కార్యక్రమంమీద బొగ్గుపరిశ్రమను జాతీయం చేయడంవల్ల కలిగే ప్రభావం ప్రసరిస్తుంది

బ్రిటిష్ పెట్టుబడిదారీసంక్షోభం విశేషించి బొగ్గుపరిశ్రమలో వ్యాపించింది. 1913 లో బొగ్గు ఉత్పత్తి 29 కోట్ల టన్నులైతే, 1946 లో 18 కోట్ల టన్నులకు దిగజారింది. గడచిన దశాబ్దంలో బొగ్గు ఉత్పత్తి క్రమేణా క్షీణించింది. బొగ్గుకార్మికుల్లో నిరుద్యోగం, యితరపరిశ్రమలలోకన్న విపరీతంగా ప్రబలింది. ఇతరకార్మికుల వేతనాలకన్న బొగ్గుగనుల కార్మికుల వేతనాలు తగ్గుముఖం పట్టాయి. గనుల్లో పనిచేసే కార్మికులు శారీరకంగా కష్టించడం అత్యధికమవడంచేత, క్షయ మొదలైన రోగాలు వారిని పీడించడం మొదలుపెట్టాయి. బ్రిటిష్‌బొగ్గుపరిశ్రమలో వినియోగించే యంత్రసాధనాలు యితరదేశాలలో కన్న తక్కువ. నిరుపయోగమైన యంత్రాలస్థానే, నూతనయంత్రాలను స్థాపించే సావకాశంకూడా బ్రిటన్‌లో తక్కువే. ఈ కారణంచేత బొగ్గు పరిశ్రమలో వర్గసంఘర్షణలు తరచుగా యెక్కువవుతూవచ్చాయి.

బొగ్గుపరిశ్రమను పునర్నిర్మించాలసిన అవసరం యెన్నాళ్లక్రిందనో యేర్పడింది. ప్రభుత్వం నియమించిన ఉపసంఘాలు యిదివరకే యీ పరిశ్రమను ప్రభుత్వపరం చేయాలని సిఫారసు చేశాయి. కాని ప్రభుత్వం యీ పరిశ్రమమీద కంట్రోలు రద్దుచేసి, పరిశ్రమయజమానులకే సర్వహక్కులు సంక్రమించేటట్లు చేసింది. చివరకు అనేకమంది నిపుణులు, ప్రజాసామాన్యం చేసిన వత్తిడిఫలితంగా ప్రభుత్వం యీ పరిశ్రమను జాతీయంచేయక తప్పలేదు. దీనివల్ల బొగ్గుపరిశ్రమయజమానులకు 16 కోట్ల 50 లక్షల పౌనులు నష్టపరిహారం యివ్వబడ్డది.

ఇతరపరిశ్రమలు ప్రయివేటువ్యక్తుల యాజమాన్యములో నుండి బొగ్గుపరిశ్రమమాత్రం ప్రభుత్వపరం గావడంవల్ల, బొగ్గును ఉపయోగించే యితర పారిశ్రామికుల కెంతో లాభదాయకం. ఎందువల్లనంటే, బొగ్గుధరనిర్ణయం, సిండికేట్లతోగాక ప్రభుత్వంతో సంప్రదింపులవల్ల జరుగుతుంది. కాబట్టి బొగ్గుగనులను జాతీయంచేయడం గురించి బ్రిటిష్‌పెట్టుబడిదార్లు అంతగా తీవ్రమైన వ్యతిరేకత చూపలేదు. ఈ పరిశ్రమను జాతీయం చేయడంవల్ల తమకు నష్టం కలుగకపోవడమే దీనికి కారణం.

బొగ్గుపరిశ్రమలో హెచ్చుగా యంత్రనిర్మాణం చేయకపోతే, ఉత్పత్తిశక్తి క్షీణిస్తున్నది. కార్మికులు అధికసంఖ్యలో యీ పరిశ్రమలోకి రావటంలేదు. ఈ పరిశ్రమను జాతీయం చేయడంవల్ల లోగడ వీటిపైన పెత్తనం చేస్తున్నవారే యికముందుకూడా దీనిమీద యాజమాన్యం వహిస్తారు; పరిశ్రమపైన కార్మికులకు పెత్తనం లేదు. ఇతరపరిశ్రమల్లోకూడా యిట్టి మితవాద సంస్కరణలే ప్రవేశపెట్టడంతో, కార్మికులకు ఉత్సాహం, చొరవతగ్గి, ఉత్పత్తి క్షీణించడంలో ఆశ్చర్యం లేదు. బ్రిటిష్‌లేబర్ పార్టీ బ్రిటిష్ గుత్తదారులకు లొంగిపోయి, యినుము, ఉక్కుపరిశ్రమలను జాతీయం చేయడం వాయిదా వేసింది. లోహపరిశ్రమలను జాతీయం చేయక, ఒక బొగ్గుపరిశ్రమను మాత్రం - అదీ మితవాదధోరణిలో - జాతీయం చేయడంవల్ల, యెప్పటినాదిరే, యీ పరిశ్రమలో ఉన్న అవకతవకలు, కార్మికుల కడగండ్లు, ఉత్పత్తిపతనం, దీనిమూలంగా, యితర పరిశ్రమలు దెబ్బతినడం, చివరకు ప్రజాసామాన్యం నష్టాల పాల్గావడం తప్పడంలేదు.

ప్రయివేటుగుత్తదారులనుంచి, ప్రభుత్వపు స్టేటుకాపిటలిజమ్‌లోనికి పరిణామంచెందిన పారిశ్రామికవిధానం ప్రజలనేవిధంగానూ సంతృప్తిపరచడంలేదు. వేరొకవంక పెట్టుబడిదారీవిధానంమృత్యువునుండి తప్పించుకోడానికై యిట్టి సంస్కరణలు ప్రవేశపెట్టుతుంటే, కార్మికవర్గం యీ అవకాశాన్ని తీసుకుని మానవసమాజాన్ని సోషలిస్టుపునాదులపైన పునర్నిర్మించుటకు ఆయత్తమైంది. పెట్టుబడిదారీ సమాజంలో ఒక మెట్టు ఉన్నతస్థాయికి పోవడమంటే, యీ సమాజంలో అంతర్గర్భితమైఉన్న వైరుధ్యాలుకూడా తీవ్రతరం చెందడమన్న మాటే.

ఫ్రాన్సులో పరిశ్రమలను జాతీయం చేసే విధానం పూర్తిగా మరొక స్వరూపం తీసుకున్నది. ఈ దేశంలోని పెద్ద పెద్ద పెట్టుబడిదార్లందరూ జర్మనుఆక్రమణదార్లకు మద్దతిచ్చి, దేశశ్రేయస్సుకు, పారిశ్రామికాభివృద్ధికి, జనాభ్యున్నత్యానికి వ్యతిరేకంగా కృషిచేసి, కళంకం తెచ్చారు. పూర్తిగా చెడిపోయిన పరిశ్రమలను జాతీయంచేసి, పునరుద్ధరించడమే ఫాసిస్టులను ప్రతిఘటించి పోరాడిన వివిధ సంస్థలు తమకార్యక్రమంలో ముఖ్యవిషయంగా యెంచుకున్నాయి. ఇలా చేస్తేగాని హిట్లరు రాజ్యాంగయంత్రానికి సర్వసహాయం చేసిన "200 కుటుంబాల" పలుకుబడి నిర్మూలం కాదనుకున్నారు. ఫాసిస్టుమూకలను తరిమివేయగానే యేర్పడిన ప్రజాప్రభుత్వం, యీ కార్యక్రమానికి పూనుకోగానే, పెద్దపెద్ద పెట్టుబడిదార్లు, యితరదేశాల పెట్టుబడిదారీవర్గాలతో కలిసి, జాతీయకార్యక్రమానికి తీవ్రప్రతిబంధకాలు కల్పించ ప్రయత్నించారు.

1935-36 లో అనగా ప్రజాసంయుక్తసంఘటనాప్రభుత్వంలో రైల్వేలు, విమానపరిశ్రమ, ఆయుధపరిశ్రమ జాతీయం చేయబడ్డాయి. గతయుద్ధానంతరం భారీబ్యాంకులు, పెద్ద భీమా కంపెనీలు జాతీయం చేయబడ్డాయి. గనుల పరిశ్రమలుకూడా ప్రభుత్వపరం చేయబడ్డాయి. ఈ పరిశ్రమలోని యావదాస్తి 'నేషనల్‌బోర్డ్' కంపెనీపరం చేయబడ్డది. ఈ కంపెనీలో నూటికి 51-వాటాలు ప్రభుత్వానికి, 49 వాటాలు ప్రయివేటు వ్యాపారస్థులకు విభజించబడవి. ఈ పరిశ్రమల యాజమాన్యంలో కార్మికులకు స్థానం గ్యారంటీ చేయబడ్డది.

తర్వాత విద్యుచ్ఛక్తిపరిశ్రమలు, మోటారు పరిశ్రమలుకూడా నష్టపరిహారం యివ్వకుండానే జాతీయం చేయబడ్డాయి. ఇతరపరిశ్రమలు మాత్రం, యజమానులవద్దనుంచి కొనడం ద్వారానే జాతీయం చేయబడ్డాయి.

ఈ సంస్కరణాలకు పెట్టుబడిదారీగుత్తవ్యాపారులు విపరీతమైన వ్యతిరేకత చూపుతున్నారు. యుద్ధానంతరం యేర్పడ్డ తాత్కాలిక ప్రజాప్రభుత్వం విచ్ఛిన్నమైనందున, అదివరకు అములుజరిపిన చట్టాలన్నీ పెట్టుబడిదారీ ప్రతినిధులైన నూతనప్రభుత్వవర్గం ఒక్కొక్కటే దిగమ్రింగి ప్రజాశత్రువులుగా పరిణమించారు.

పెట్టుబడిదారీదేశాల్లో పారిశ్రామికజాతీయ విధానం యిన్ని అవకతవకల నెదుర్కొంటూ ఉంటే, తూర్పుయూరప్ దేశాల్లోను, చైనా మొదలైన ప్రాచ్యదేశాల్లోను విస్పష్టమైన మరొక సిద్ధాంతంపైన, ఆర్థిక, రాజకీయ పునాదులపైన పరిశ్రమలు జాతీయంచేయబడి, ఆర్థిక, సాంఘిక జీవితం పునరుద్ధరింపబడుతున్నది. ఈ దేశాల్లో పెట్టుబడిదారీ, జమీందారీ, భూస్వామివర్గాలను రద్దుచేయడంతో, నిసలైన ప్రజాస్వామిక శక్తులు జాతీయజీవనంలో నాయకత్వం వహించి నూతనసాంఘికనిర్మాణానికి అనువైన పరిస్థితులు కల్పించాయి. బీదరైతులకు, వ్యవసాయక కార్మికులకు భూములు పంచి, వ్యావసాయక చట్టాలను ప్రవేశపెట్టి, ప్రభుత్వమే కో-ఆపరేటివ్ ఉద్యమంద్వారా రైతులకు వ్యవసాయక పరికరాలను పంచడంతో అత్యధికసంఖ్యాకులైన ప్రజల్లో ప్రభుత్వమందు విశ్వాసం పెంపొంది దానికంటగా నిలబడ్డారు. వారిలో నవజాగృతి మోసులెత్తింది; సోషలిస్టు సమాజనిర్మాణానికి పునాది యేర్పడ్డది.

ఈ దేశాల్లో పెద్దపెద్ద పరిశ్రమలు, మధ్యరకపు పరిశ్రమల్లో కొన్ని, రవాణాలు, బ్యాంకులు ప్రజాపరం చేయబడ్డాయి. ఇదంతా యెలా సాధ్యమయింది? రాజకీయ, ఆర్థికరంగాలలో, ప్రభుత్వాలు సంపూర్ణంగా మారి, నూతన ప్రజాచైతన్యంద్వారా, నిసలైన ప్రజారాజ్యాలుగా మార్పుచెందడంవల్ల, వివిధరంగాలలో ఉత్పత్తి అభివృద్ధి యితోధికంగా జరగడం సంభవించింది. ప్లానుప్రకారం ప్రతి కార్యక్రమం కొనసాగింది. ప్రతి కార్మికునికి పని, ప్రతి పౌరునికి ఉద్యోగం, నిరుద్యోగం లేకపోవడం, చాలినంత వేతనం, విద్యా, సంస్కృతి రంగాల్లో అందరికీ సమానావకాశాలు, హెచ్చుతగ్గులు లేక అందరికీ వైద్యసౌకర్యాలు, బలిష్ఠమైన, ఆరోగ్యమైన ఆహారం-యివీ సూక్ష్మంలో యీనాడు పరిణామంచెందిన ప్రజాజీవితం యీ దేశాల్లో.

గడచిన నాలుగేండ్లలో ఉత్పత్తి యుద్ధానిపూర్వంకన్న చాలా యెక్కువయినట్లు లెక్కలవల్ల రుజువయింది. పీడించే వర్గం అంతరించి, దున్నే రైతుకే భూమి, కష్టించి పనిచేసే కార్మికునికే పరిశ్రమలపైన అధికారం లభించడంవల్ల, సామాన్య ప్రజల్లో జీవనభృతి సంతృప్తిగా చేకూరడంవల్ల, యీ దేశాల్లో శాంతి, సౌఖ్యాలు నృత్యం చేస్తున్నాయి.

భారతదేశంలోకూడా మధ్యతరగతిప్రజల నుంచి వ్యవసాయకూలీవరకు జీవనోపాధి చాలా దుర్లభమైంది. పెట్టుబడిదారీవర్గానికి సహజమైన ఆర్థికసంక్షోభం మనంకూడా అనుభవిస్తున్నాము. ప్రజల జీవితావసరాలు నానాటికీ కరవైపోతున్నాయి. ఆకలిజ్వాలలు మిన్నుముట్టుతున్నాయి. ధరలు చుక్కలంటుతున్నాయి. మధ్యతరగతిజీవనప్రమాణం కూడా క్షీణిస్తున్నది. రోజురోజుకు, జీవితవ్యయప్రమాణం మితిమీరుతున్నది. ఆహారరంగములో క్లిష్టత అధికమయింది. ఈ దుస్థితి తొలగి ప్రజలందరకూ వస్తువులు చౌకలో లభించాలన్నా, వివిధ పేదవర్గాలకు వేతనాలు, జీతాలు చాలినంతగా దొరకాలన్నా, కార్మికులకు, కర్షకులకు, ఉత్సాహం, చొరవ పెంపొంది అధికోత్పత్తి సాగి, వారి వేతనాలు అధికం కావాలన్నా, ప్రస్తుతం పెట్టుబడిదార్ల అధీనములోని కీలక, భారీ పరిశ్రమలు ప్రజలపరం చేయాలసి ఉంటుంది. ప్రభుత్వం ఈ విధానం అవలంబించక, సంకుచితదృష్టితో, బ్రిటిష్‌ప్రభుత్వం అవలంబించినరీతిగా "జాతీయత" కార్యక్రమం అమల్లో పెడితే, బ్రిటిష్ ప్రజలీనాడు యే సుఖాలనుభవిస్తున్నారో, ఆ సుఖాలే మన ప్రజలు, మన కార్మికులు అనుభవిస్తారు. పైపేర్కొన్న తూర్పుయూరప్ దేశాల్లోగాని, సోవియట్ యూనియన్‌లోగాని, చైనాలోగాని, ఆర్థిక సంక్షోభం, నిరుద్యోగం, పేదరికం, కరువుకాటకాలున్నవేమో చూడండి. ఇన్ని శతాబ్దాలుగా ప్రజలను పీల్చిన పెట్టుబడిదార్లను, జమీందార్లను సంతృప్తిపరచక వారితో యెట్టి రాజీ చేసుకోక, పరిశ్రమలను జాతీయం చేయడం ద్వారాను, భూసంస్కరణ విధానాన్ని అమల్లో పెట్టడంద్వారాను, ప్రభుత్వం ప్రజలను సంతృప్తిపరచి, వారి విశ్వాసాన్ని సానుభూతిని చూరగొనగలదు. ఇలాగాక, మనల నెదుర్కొనే ఆర్థికసంక్షోభంనుంచి బయటపడగలమనిగానీ, ప్రజలకు మేలు చేయగలమనిగానీ, ప్రభుత్వం భావిస్తే, అది కేవలం వెర్రిభ్రమే కాగలదు.

నేటి ప్రపంచం

★ ఇండొనీషియా దాస్యవిముక్తి

★ ఇండోచీనా పరిస్థితి

ఇండొనీషియాకు స్వాతంత్ర్య ప్రదానం గురించి చర్చించిన హేగ్ సమావేశం అనుకున్న వ్యవధిలో ముగిసింది. సమావేశనిర్ణయాలు ఉభయవర్గాలకూ సంతృప్తి కలిగించకపోయినప్పటికీ, ఇండొనీషియాకు స్వపరిపాలనాధికారం ఇచ్చే విషయంలో సమాధానం కుదిరింది. డిసెంబరు 30 లోగా ఇండొనీషియాపరిపాలన డచ్చివారి హస్తాలనుంచి ఇండొనీషియన్ల హస్తాలలోకి వస్తుంది.

భారతదేశస్వాతంత్ర్యం విషయంలో బ్రిటిష్‌పాలకులు భారత నాయకుల సౌజన్య సహనాలను దృష్టిలో పెట్టుకుని హేగ్ లో ఉభయవర్గాలూ కృషి చేశాయి. అమెరికన్ రాజకీయ వర్గాల ఒత్తిడి కూడా కొంతవరకూ డచ్చివారు లొంగిరావడానికి హేతువయింది.

ఇదిగాక భారతదేశం నాయకత్వం కింద ఆసియా దేశాల ప్రభుత్వాలు న్యూఢిల్లీలో జరిపిన సమావేశంవల్ల డచ్చివారు ఆసియా దేశాల జాతీయోద్యమాల బలం గ్రహించగలిగారు. ఆసియా వాసుల జాతీయవాంఛల్ని పరితృప్తి పరిస్తేగాని పరిస్థితులు చెయ్యిదాటిపోగలవనీ, ఆసియాలో కమ్యూనిజం బలపడే ప్రమాదం ఉన్నదనీ ముందుగా అమెరికా, ఆ తరవాత బ్రిటన్, హాలండ్ మొదలైన దేశాలు గ్రహించాయి.

జాతీయస్వపరిపాలనాధికార మిచ్చినప్పుడే ఆర్థికబాంధవ్యమైనా నిలుపుకోవడం సాధ్యపడుతుందని భారతదేశం నిరూపించింది. ఈ దేశాల ఆర్థికసంపద తోడ్పడనిదే యూరోపియన్ దేశాలు దివాలాతియ్యక తప్పదు. కాని ఈ వలస దేశాలకు స్వాతంత్ర్యమిచ్చి, పరిమితంగా ఆర్థిక బాంధవ్యాలు పెట్టుకుంటే ఎవరికెంత ప్రయోజనకారి కాగలదో ఇంకా ముందుగాని తెలియదు. భారతదేశం ఆర్థికంగా బ్రిటన్‌తో తెగరాని బంధనాలు తెచ్చిపెట్టుకుంది. దీనివల్ల ఇంతవరకూ ఈ రెండేళ్లలోనూ భారతదేశానికి అపకారమూ, బ్రిటన్‌కు ఉపకారమూ జరిగింది.

భారతదేశానిక్కూడా ఉపకరించగలదనే వాదం సరైనదో కాదో ఇంకా అనుభవంపైనగాని తెలియదు.

కాని భారతదేశం ఉదాహరణకు దృష్టిలో పెట్టుకున్న డచ్చివారు ఈ ఆర్థికబాంధవ్యాన్ని ఇండొనీషియాపైన బలవంతాన రుద్దారు. భారతదేశానికి గత్యంతరం లేక బ్రిటన్‌తో చేరితే, ఇండొనీషియాను బలవంతాన డచ్చివారు బంధించారు. భారతదేశం కోరి కామన్వెల్త్‌లో సభ్యత్వం తెచ్చుకుంటే, ఇండొనీషియాను వద్దంటున్నా హాలండ్‌తో రాజకీయంగా ముడిపెట్టారు. ఈ వ్యత్యాసం ఉత్తరోత్తరా డచ్చి-ఇండొనీషియన్ వ్యవహారాల్లో ప్రతిఫలించక మానదు.

స్థూలంగా డచ్చి - ఇండొనీషియన్ ఒప్పందంలోని అంశాల్ని ఈక్రిందివిధంగా వివరించవచ్చును: డిసెంబరు 30 తో పరిపాలనాధికారం ఇండొనీషియన్లకు ఒప్పగించబడుతుంది. ఇండొనీషియాలో, రిపబ్లికన్, ఫెడరలిస్ట్ మొదలైన పార్టీలన్నిటికీ అనువైన ఫెడరల్ రాజ్యాంగం ఒకటి తయారు చెయ్యబడుతుంది. ఫెడరల్ రాజ్యాంగవ్యవస్థ ఏరీతిగా ఉండాలో, అనగా కేంద్రప్రభుత్వాధికారాలు, ప్రాంతీయ ప్రభుత్వాల అధికారాలు వాని అన్యోన్య వ్యవహారబాంధవ్యాలు ఏరీతిగా ఉండాలో రౌండ్ టేబుల్ సమావేశమే నిర్ణయించింది. ఇండొనీషియాలోని డచ్చివారి పెట్టుబడికీ, ఆస్తికీ సంరక్షణ ఇవ్వబడాలి. రాజ్యపాలనాధికారం ఇండొనీషియన్ల కొప్పగించబడిన ఆరుమాసాలలో డచ్చి సైన్యాలన్నీ క్రమక్రమంగా ఇండొనీషియాను విడిచిపోగలవు. అధికారం ఒప్పగింతఅనంతరం డచ్చిఆఫీసర్లు ఇండొనీషియాలో పనిచేయవచ్చునుగాని, అప్పుడు వారు ఇండొనీషియన్ ప్రభుత్వానికే బాధ్యులై ఉంటారు. సురబాయా నౌకాకేంద్రాన్ని డచ్చివారు ఇండొనీషియన్లకు ఒప్పగిస్తారు. అయితే ఇండొనీషియన్ ప్రభుత్వాధికారానికి లోబడి ఒక డచ్చి నౌకాశాఖోద్యోగి ఆనౌకాకేంద్రాన్ని నిర్వహిస్తాడు.

ఇండొనీషియన్లు స్వయంగా ఇకనుంచి స్వతంత్ర ప్రతిపత్తితో విదేశాంగ వ్యవహారాలు నిర్వహించుకుంటారు.

ఋణాల విషయమై మొదట అంగీకారం కుదరలేదు. కాని ఐక్యరాజ్యసమితివారి కమిషన్ కృషివల్ల ఇండొనీషియన్లు అధికభారం వహించడానికి అంగీకరించారు.

ఇండొనీషియన్లు రాజ్యాంగపరిషత్తును స్థాపించి ఫెడరల్ రాజ్యాంగాన్ని నిర్మించుకొనేవరకు ఒక తాత్కాలికప్రభుత్వం స్థాపితమౌతుంది. డిసెంబరు 30లోగా ఈ ప్రభుత్వానికే రాజ్యపాలనాధికారం ఒప్పగించబడుతుంది. తాత్కాలిక ప్రభుత్వస్థాపన నిమిత్తం, రాజ్యపాలనాధికారాన్ని స్వాధీనపరుచుకోవడంనిమిత్తం త్వరలోనే రిపబ్లికన్లు, ఫెడరలిస్టులు ఒక కమిటీని నియమించదల్చుకొన్నారని రిపబ్లికన్ ప్రతినిధులలో ఒకడైన డా॥మహమ్మద్ రోయమ్ చెప్పాడు. ఈ కమిటీ తాత్కాలిక శాసనసభ నిర్మాణాన్ని గురించీ, తాత్కాలికమంత్రివర్గనిర్మాణం, అధ్యక్షుని నియామకాలనుగురించి నిర్ణయాలు చేస్తుంది. ఈ మంత్రివర్గంతరఫు ప్రతినిధులే హేగ్‌నల్లి రాజ్యాధికారాన్ని క్వీన్ విల్హెల్మినావద్దనుంచి పొందగలరు. అదే సమయంలో బటేవియాలో స్వాతంత్ర్యప్రకటన జరుగుతుంది.

డచ్చివారికీ ఇండొనీషియన్లకూ న్యూగినీ భవిష్యత్తునుగురించి శంకా సమాధానం కుదరలేదు. దీనివల్ల ఇండొనీషియా జాతీయస్వాతంత్ర్యసిద్ధికి ఆటంకం కలగరాదనే ఉద్దేశంతో, న్యూగినీభవిష్యన్నిర్ణయాన్ని ఒక సంవత్సరం వాయిదా వేశారు.

ఈలోగా ఇండొనీషియాలో కమ్యూనిస్టులు ప్రభుత్వంతో తలపడ్డానికి సిద్ధపడుతున్నట్లు వార్తలు విరివిగా ప్రచారం ఔతున్నాయి. కమ్యూనిస్టులు తిరుగుబాటుచేసిన ప్రాంతాన్నే మొట్టమొదటగా డచ్చిసైన్యాలు ఖాళీచేస్తున్నాయి అంటే ఆరంభంలోనే ఇండొనీషియన్ రిపబ్లికన్లకు చేతినిండా పని తగులుతుందన్నమాట. మేడియన్ ప్రాంతంలోనే కమ్యూనిస్టుల తిరుగుబాటును రిపబ్లికన్లు అణిచివేశారు. ఆ సందర్భంలో విఖ్యాత అంతర్జాతీయ కమ్యూనిస్టు నాయకుడు మూసో మరణించాడని రిపబ్లికన్లు ప్రకటించారు. డచ్చిసైన్యాలుపట్టి ఉరితీసినట్లు డచ్చి అధికారులు ప్రచారంచేసిన నాయకుడు టాన్‌మలాకా ఇంకా బతికేవున్నాడనీ; అతడే త్వరలో తిరిగి కమ్యూనిస్టులకు నాయకత్వం వహించగలడనీ వార్తలు ప్రచారమవుతున్నాయి.

ఇండొనీషియాలో విదేశీయుల పెట్టుబడి ఆస్తిసంరక్షించగలరని రిపబ్లికన్లు, ఫెడరలిస్టులు వాగ్దాన మిచ్చారు. ఇప్పటికే బ్రిటిష్, అమెరికన్, డచ్చి పెట్టుబడిదారులు స్థాపించిన పరిశ్రమ లున్నాయి. ఇంకా రబ్బరు, పెట్రోల్, తగరం, తేయాకు, పంచదార మొదలైన పరిశ్రమల్ని వృద్ధిపరచడానికి అపారమైన అవకాశాలున్నాయి. నౌకావాణిజ్యం అభివృద్ధికాగల అవకాశాలు అపారంగా ఉన్నాయి. మిలిటరీ దృష్ట్యా కూడా భారతదేశానికి హిందూమహాసముద్రంలో ఎంత ప్రాధాన్యతఉందో ఇండొనీషియాకు అంతేఉంది. దీనివల్ల భారతదేశంకంటె ముందుగా ఇండొనీషియా అమెరికన్ పెట్టుబడిదారుల్ని పారిశ్రామికయజమానుల్ని ఆకర్షించినా ఆశ్చర్యపడనక్కరలేదు.

చీనా:

చీనాలో కమ్యూనిస్టులు అతివేగంతో దేశాన్ని ఆక్రమించుకుంటున్నారు. షాంఘై, హాంగ్‌ఛౌ నగరాల తరువాత జాతీయసైన్యాలు ఇంతవరకూ ఎక్కడా ఎదిరించి నిలిచి పోరాడలేదు. జాతీయసైన్యాలు, లొంగినవి లొంగిపోగా, కమ్యూనిస్టుల పక్షానికి తిరిగినవి తిరిగిపోగా మిగిలినవి కమ్యూనిస్టులు వెన్నాడుతుండగా తూర్పునుంచి పశ్చిమానికి పారిపోతున్నాయి. కాంటన్ నగరాన్ని జాతీయ ప్రభుత్వం ఖాళీచేసి చుంకింగ్ నగరానికి వలసపోయిన వారంరోజుల్లో నగరం ప్రశాంతంగా కమ్యూనిస్టుల వశమయింది. ప్రజలెక్కడా జాతీయప్రభుత్వానికి తోడ్పడ్డంలేదు. యుద్ధంతో విసుగెత్తి, ఆర్థికదుస్థితికి సహించలేక ప్రజలు అన్నిప్రాంతాల్లోనూ కమ్యూనిస్టుల్ని సంతోషంగా ఆహ్వానిస్తున్నారు. కాంటన్‌నగరం కమ్యూనిస్టుల వశం కావడంతో హాంకాంగ్‌లో బ్రిటిషు అధికారుల ఆత్రం ఎక్కువయింది. హాంకాంగ్ నగరరక్షణకు ఎంతెంత సన్నాహాలు చేస్తున్నదీ ప్రచారం చేస్తున్నారు. కమ్యూనిస్టులతో మైత్రి, వ్యాపారబాంధవ్యాలు కోరుతున్నట్లు పదేపదే తెలియపరుస్తున్నారు. కాంటన్ నగరం మొదలయినచోట్లనుంచి జాతీయ సైన్యాలలో కొంతభాగం ఫార్మోజాకు వెళ్లింది. జనరల్ షైచంగ్‌షెక్ ప్రభుత్వం చుంకింగ్ నగరానికి మార్చబడింది.

కమ్యూనిస్టు సైన్యాలు క్వాంగ్‌టంగ్ రాష్ట్రంలో పశ్చిమానికి తిరిగి రాష్ట్రాన్ని ఆక్రమించుకుంటున్నాయి. హూపేరాష్ట్రంనుంచి కమ్యూనిస్టులు సైన్యాలను బయలుదేరదీసి జెచువన్ రాష్ట్రంపై దండయాత్రకుసంసిద్ధమౌతున్నాయి.

ఇండో - చీనా:

ఇండోచీనాతో సరిహద్దుగల చీనా రాష్ట్రాలు యూనాన్, క్వాంగ్సీ, క్వాంగ్‌టంగ్ వీనిలో క్వాంగ్సీ, క్వాంగ్‌టంగ్ రాష్ట్రాలపైకి ఇండో - చీనా కమ్యూనిస్టులు దాడిచేసినట్లు చీనా జాతీయప్రభుత్వవార్తా సంస్థ ప్రకటించింది. ఇది వాస్తవమో కాదో గాఢి పరచబడలేదు. ఇండో - చీనాలో ఫ్రెంచి సైన్యాల్ని బెదరగొట్టి వారిని కఠినసైనికచర్యలకు ప్రోద్బలపరచడానికి ఇదొక ఎత్తైనా కావచ్చును. లేక చీనా కమ్యూనిస్టులతో కలుసుకొని సహాయం పొందాలని ఆతురపడుతున్న ఇండో - చీనా కమ్యూనిస్టులు ఆరీతిగా దాడిచేసినా చేసిఉండవచ్చును. కాని ఏది నిజమైనా, ఫ్రెంచిసైన్యాలు చర్యతీసుకొని, చీనాజాతీయ సైన్యాలతో చేరడానికి ఇష్టపడవే. అయితే అది అసాధ్యం - ఫ్రెంచి సైన్యాలు ఇండో - చీనా రిపబ్లికన్ సైన్యాలతో యుద్ధానికి నిలవలేని స్థితిలో ఉన్నట్లు అమెరికన్ వార్తావిలేఖరులు కూడా తెలుపుతున్నారు. బావ్‌దాయ్ ప్రాపకం లభించినా ఫ్రెంచివారికి ఇండో- చీనా ప్రజలు తోడ్పడ్డంలేదన్న విషయం రూఢి అయింది. ఫ్రెంచివారు ఇండో - చీనాను విడిచిపెట్టి, వారిదేశభవితవ్యాన్ని వారి నిర్ణయానికే విడిచిపెట్టడం మంచిదనే అభిప్రాయం బలబడు



అక్టోబర్ 23వ తేదీన ఢిల్లీలోని ఐక్యరాజ్యసమితి స్థానికశాఖవారు ఐక్యరాజ్యసమితి వార్షికదినసందర్భంలో విందుచేశారు. ఆ విందుకు విచ్చేసిన గవర్నర్‌జనరల్ రాజగోపాలాచారిగారిని ఐక్యరాజ్యసమితి స్థానికశాఖ డైరెక్టర్ లెయిట్జిర్, లెయిట్జిబర్‌సతి ఆశ్వాసించుచున్న దృశ్యం

కులాసాకబుర్లు :

తిండిపుష్టి

[జి. యన్. సూరి]

జనాభాను చూస్తూ రెండు తెగలుగా విభజించవచ్చు. జీవించేందుకు భుజించేవారు ఒక తెగ; భుజించేందుకు జీవించేవారు రెండవ తెగ. కనబడిన వ్యవహారమల్లా నెత్తిన వేసుకుని, ఎన్నో కొన్ని మరమ్మతుచేసి ప్రజలను ఉద్ధరించటానికి ప్రయత్నిస్తున్నామంటారు మొదటి రకం. ప్రపంచంగొడవతో అవసరానికి మించి జోక్యం కలుగచేసుకోక తమ సంగతి తాము చూచుకునేవారు రెండవరకం. నిజానికి చెప్పవలసివస్తే రెండవవారిదే మెజారిటీ పార్టీ. పైకి డాంబికంకోసం మేము మొదటి ముఠాకు చెందినవాళ్లమని ధీమాగా డప్పీలు కొట్టేవాళ్లలో నూటికి తొంభైమంది ఈబాపతువాళ్లే. ఆతురాలా జీవించటానికే భుజించేవాడు ఎక్కడో ఒకడు తప్ప కనబడడు.

ఉన్న విషయానికి ఇంత దాపరికం ఎందుకో బోధపడదు. దేవుడు ఇచ్చిన ఆకలిని ఆరాధించటంలో అవమానం ఏమిటో మాకు అర్థం కాదు. ప్రాపంచికసౌఖ్యాలన్నిటికీ పునాదివంటిది తిండిసుఖం. ఈ సుఖం లేనివాడికి ఇతరసౌఖ్యాలు ఎంతమాత్రం అందుబాటులో ఉండవు. తిన చేతగానివాడు తాను సుఖపడలేడు. ఇతరులను అంతకంటే సుఖపెట్టలేడు. తిండిపుష్టి లేనివాడికి మరి ఏ పుష్టీ ఉండదు. షడ్రసోపేతంగా పట్టించినవాడికి ప్రపంచమంతా ఆనందమయంగా గోచరిస్తుంది. అన్నిటిలోనూ మజా కనబడుతుంది.

మీరు ఎప్పుడైనా గమనించారో లేదోకాని కోపదారిమనుషులకు తిండిపుష్టి ఉండదు. తిన్నది హరాయించుకోలేనివాడు. తినటం చేతగానివాడు ఎప్పుడూ మండిపడిపోతూ ఉంటాడు. దూర్వాసమహామునికి అంతచేటు కోపం ఉండడానికి కారణం భోజనలోపమే. దూర్వాసుడు ఒక్కడే గాదు. మునుల ముఠా అందరూ అంతే. రుచీ పచీ లేని దుంపలూ వేళ్లు ఆకు అలాలు ఆహారంకావటంవల్ల వీళ్ళకు ఆవేశం అధికమయింది. ప్రతి చిన్న విషయంలోను ముఖమంతా కళ్లు చేసికొని కనబడినవాళ్ళనందరినీ శపించిపారవేశారు. ఆడ అయేది మగ అయేది, వీరి దృష్టిలో అందరూ ఒకటే. చీటికీ మాటికీ శాపాలను ప్రయోగించి అమాయకులను ఎందరినో అష్టకష్టాలపాలు చేశారు. పురాణాలన్నీ దాదాపు వీరి శాపాల చరిత్రలే.

ఈ దూర్వాసుడికో, ఆ విశ్వామిత్రుడికో ప్రతిరోజూ ప్రొద్దున్నే కాఫీ ఇడ్లీ ఇచ్చి, మధ్యాహ్నం కూరా పప్పు పులుసు పచ్చళ్ళతో భోజనం పెట్టి, సాయంత్రం బాదంహల్వా మసాలాదోసెలను ఫలహారంచేయించి, రాత్రింతల గుత్తివంకాయకూరతోను ఉల్లిపాయిపప్పు పులుసుతోను మేపినట్లయితే కోపం గీపం ఎక్కడికో పోయేది. మహర్షులలో మహర్షులు పోట్లాటలు వేసుకుని అమాయికపు రాజులను దుంపతెంచి ఉండరుసరిగదా ఎంత లోపం జరిగినా చిరునవ్వుతో ఫరవాలేదులే అని వీపు తట్టేవాళ్లు. అంతేగాని అమాంతం కమండలంలోని నీళ్లను ఇన్ని చల్లి "ఫో నీవు రాతివో, రప్పవో, మొసలివో మొద్దువో అయిపో"అని శపించేవాళ్లు కారు. ఆకాలపు రాజులు తెలివిగలవాళ్లు అయినట్లయితే "రాజ్యంలో ఎక్కడా ఎవ్వరూ జడలు పెంచుకుని, తోళ్లు కట్టుకుని, కనబడిన కందమూలాలను తిని, అమానుషమైన శక్తిని సంపాదించి అడ్డమైనవారిని శపించరాదని" ఒక శాసనం జారీచేసేవాళ్లు. అందరు బ్రతికిపోయేవాళ్లు.

ఇది గ్రహించే మనస్వాములవార్లు, అంటే ఈకాలపు మునీశ్వరులు, పూర్వపద్ధతిని మార్చివేశారు. గడ్డాలూ మీసాలూ పెంచరు. తలను గచ్చకాయలాగా ఉంచుతారు. శిష్యకోటి భిక్షచేస్తే షడ్రసోపేతంగా భోజనం చేస్తారు. సంతృప్తులై సావకాశంగా పరమార్థాలను విన్నవాళ్లకు తెలియచేస్తారు. పీఠానికి ఉండవలసిన అన్ని హంగులను ఏర్పరచి ఒకరిని నొప్పించక తాము నొవ్వక జ్ఞానభిక్షకోసం ఆశ్రయించినవారికి హరాయించుకోలేనంతగా జ్ఞానాన్ని ప్రసాదించి ఇక మీ తిప్పలు మీరు పడండి అని పంపివేస్తున్నారు.

మేము ఎరిగిన డాక్టరుగారు ఒకడు ఉండేవాడు. మంచి భోజనప్రియుడు. రోగికి పథ్యం విషయంలో ఎంతో ఔదార్యం చూపేవాడు. రొట్టె తినవచ్చునా అంటే తప్పకుండా తినమనేవాడు. పళ్లు పెట్టమా అని అడిగితే తిన్నన్ని పెట్టమనేవాడు. నోరు అరుచిగా ఉన్నదండీ అంటే కొంత ఆవకాయముక్కను నంచుకోమనేవాడు. ఆకలి ఉన్నప్పుడు ఏది తిన్నా జబ్బుచేయదని చెప్పేవాడు. ఇటువంటి పథ్యంవల్ల ప్రమాదం ఎప్పుడూ జరగలేదు. ఆయుర్దాయం ఉన్న రోగులందరూ బ్రతికితీరుతారు. లేని వాళ్లను ఏమి చేసినా ప్రయోజనం లేదు అనేవాడు. కాని ఈ డాక్టరుగారికి అప్పుడప్పుడు ప్రమాదంవల్ల అజీర్తిబాధ దాపరించేది. అప్పుడు చూడాలి ఆయనహంగామా. ఇవ్వాళ కొంచెం తలనెప్పిగా ఉన్నదండీ అని రోగి అంటే మంచినీళ్లు తప్ప మరేదీ పుచ్చుకోవద్దు అనేవాడు. క్రిందటి రోజున తాను తినమన్న రొట్టెలూ బిస్కట్లూ, పండ్లూ హఠాత్తుగా ఆపించివేసేవాడు. ఏదైనా తిన్నావా అంటే వైకుంఠయాత్రే నని ప్రతిరోగినీ హడలుగొట్టేవాడు. ఎక్కడ లేనీ చేదుమందులను తాగించేవాడు. డాక్టరుగారికి అజీర్తి తగ్గగానే మందహాసంతో మామూలుపద్ధతికి వచ్చేవాడు. రోగులు అడిగినవన్నీ శాంక్షన్ అయ్యేవి. తిండిపుష్టి ఉన్నప్పుడూ లేనప్పుడూ బుద్ధి ఏవిధంగా మారుతుందో ఈయనను చూసి తెలిసికోవచ్చు.

పూర్వకాలంలో రోమనుదేశస్థులు యుద్ధ విషయంలో ఎంత పరాక్రమవంతులో భోజన విషయంలో అంతకు మించిన పరాక్రమవంతులు. వారి విందులు మధ్యాహ్నం ఆరంభమై తెల్లవార్లూ జరిగేవి. ముందు కడుపునిండా తినేవారు. తిన్న వెంటనే పెరటిలోకి వెళ్లి బలవంతంగా వమనం చేసేవాళ్ళు. పొట్ట ఖాళీకాగానే మళ్లీ వచ్చి తినటం మొదలుపెట్టేవాళ్లు. ఈవిధంగా నిద్రతో తూలిపడేదాకా కాలం వెళ్లిపోయేది.

మన దేశంలో ఇటువంటి పిచ్చపద్ధతి ఎప్పుడూ అమలులో లేదు. మనవాళ్లు లోపలికి పంపటంలో వారిని మించిపోయినా బయటికి తెప్పించటానికి బాధపడలేదు. బకాసురుడు బళ్ల జల్లలతో ఆహారం తినేవాడు. వీడిని వధించటానికి భీమసేనుడు అంతకుమించి పట్టించి క్షణంలో జీర్ణంచేసుకొని ఇంత భుక్తాయాసం లేకుండా వాడితో యుద్ధం చేసి నడుములు విరిచిపారేశాడు. గోపాలకృష్ణుడు చిన్నతనంలో రోజుకు ఎన్ని పాలను ఎంత వెన్నను దొంగిలించి తిన్నాడో లెక్క వెయ్యలేము. అంత తిండిపుష్టి ఉన్నవాడు కాబట్టే పదహారు వేల భార్యలకు భర్తగా వ్యవహరించి పదహారు అక్షౌహిణీల సైన్యానికి సరసమానంగా నిర్వహించాడు.

మనదేశంప్రజలు ఇంత దుర్బలులు కావటానికి తిండిపుష్టి లేకపోవటమే కారణం. అన్నం ఉన్నవాడికి ఆకలి లేదు. ఆకలి ఉన్నవాడికి అన్నం లేదు. అందువల్లనే నూటయాభై ఏళ్లు పరాయిప్రభుత్వం మనల్ని నొక్కి రంపాన పెట్టకలిగింది. ఇంతలో గాంధీమహాత్ముడు అవతరించాడు. నాయకత్వం స్వీకరించాడు. ఆయన తిండిపుష్టిలేనివాడని సాధారణంగా అందరూ అనుకుంటారు. కాని ఆయనకు ఉన్న తిండిపుష్టి మరెవ్వరికీ లేదు. అయితే. ఆయన ప్రతి విషయంలోనూ సూక్ష్మంలో మోక్షం కనుక్కున్నవాడు. అందువల్ల సదుపగా ఉండే పదార్థాలను భుజించి ఆయాసపడేవాడు కాడు. ఆయనవంతా విటమిన్ల భోజనం, పాలు, ఖర్జూరపండ్లు, బాదంపప్పు, వెన్న, పండ్లు- వేరుశనగపప్పు మొదలైన గట్టిపదార్థాలు. ఆయన మాదిరి తినాలంటే మన నెలజీతం వారానికి సరిపోదు. ఆవిధంగా జాగ్రత్తపడ్డాడు కాబట్టే తెల్లవాళ్లను సాగనంపగలిగాడు. స్వాతంత్ర్యం వచ్చినతరువాత జనం కొంచెం అధికంగా తినటం మొదలుపెట్టారు. అందువల్లనే భోజన వస్తువుల కొరత ఏర్పడి రేషనింగు చేయవలసిన పరిస్థితులు సంభవించినవి. ఈ బిగువున మనం ముందుకు పోతే మనలను పట్టపగ్గాలు ఉండవు. ఏ పుష్టికిఅయినా మూలం తిండిపుష్టి అని మరచి పోగూడదు.

తోంది. భారతప్రభుత్వం ఇటువంటి అభిప్రాయాన్నే ఒకనివేదికలో బ్రిటన్‌కు తెలిపినట్లు బయటపడింది. ఫ్రెంచివారి అవివేకంవల్ల ఇండోచీనాలో రిపబ్లికన్లు బలపడ్డారు. "చక్రవర్తి"పదవిని త్యజించిన బావ్‌దాయ్‌ని (యుద్ధకాలంలో జపాన్‌వారితో బావ్‌దాయ్ సహకారం నెరపాడు.) తిరిగి అధికారంలోకి తీసుకువచ్చి కీలుబొమ్మవంటి ప్రభుత్వం స్థాపించాలని ఫ్రెంచివారు తలపెట్టిన పన్నాగం భగ్నమయింది. బావ్‌దాయ్ 'పరపతి' ఫ్రెంచిసైన్యాలబలం కలిసి కూడా రిపబ్లికన్ బలాల నెదిరించలేకపోయాయి. క్వాంగ్‌టంగ్ రాష్ట్రం పూర్తిగా చీనాకమ్యూనిస్టులవశం కావడానికి ఎన్నోరోజులు పట్టదు. ఇండో-చీనా రిపబ్లికన్లకు వారి సహాయం లభించిన మరుక్షణంలో ఫ్రెంచిసైన్యాలకు ఇండోచీనాలో పరాజయం తప్పదు. ఇండోనీషియాలో డచ్చివారు సామ్రాజ్యపాలనాధికారాన్ని త్యజిస్తున్నారు. ఫ్రెంచివారు ఇండో-చీనానుగాని, పాండుచ్చేరి మొదలైన ప్రాంతాలనుగాని సవ్యంగా విడిచిపోరని తెలుస్తూనే ఉంది. వారి సైనికచర్యల [illegible] కనిపెట్టుకుని ఉన్నదని తోచక మానదు. (మార్గం)

మనరాష్ట్రం మనదేశం

(9-వ పేజీ తరువాయి)

వలసియున్నవి. కనుక వ్యవసాయమనేది దేశావసరమైన ప్రప్రథమ జీవితవ్యాపారము కనుక, యిందులో పనిచేయు రైతులుగాని వ్యవసాయ కూలీలుగాని పని నిలిపి సమ్మెలుచేయకుండునట్లుగా ప్రభుత్వము ముఖ్యంగా శ్రద్ధ వహించవలెను. అట్టి సమ్మెలను, ప్రభుత్వము ఎంతమాత్రము నిర్లక్ష్యం చేయరాదు. రైతులకు వ్యవసాయకూలీలకు మధ్య ఉండే వ్యవహార సంబంధములను ప్రభుత్వము శాసించి కట్టుదిట్టము చేయవలెను. వ్యవసాయకూలీల సమ్మెలు జరుగకుండా నివారించుటకు తగిన రీతిని కట్టుదిట్టం చేయవలెను. అందునిమిత్తమై రైతులకు గిట్టుబాటైన ధరలను వారి పంటసరకులకు లభింపజేయవలెను. వ్యవసాయకార్మికులకు సవ్యమైన కూలిరేట్లను లభింపజేయవలెను. ఇట్టి నిబంధనలను చేసిన అనంతరముకూడా వ్యవసాయము సాగకనే సమ్మెలు ప్రతిష్టంభనలు ఏర్పడే యెడల గ్రామసీమలందు వ్యవసాయము నిరాఘాటముగా సాగించుటకు ప్రభుత్వమే పూనుకోవలెను.

హైదరాబాద్ వ్యవసాయ సంస్కరణలు: విచారణసంఘ నివేదిక

హైదరాబాదు ప్రభుత్వం నియమించిన వ్యవసాయ సంస్కరణల సంఘము కూడా ప్రభుత్వమునకు తమ సలహాలను నివేదికరూపంలో సమర్పించినది. సంస్థానంలో భూమి సంస్కరణ మార్గములను సూచించుటకు గత జూన్ నెలలో ప్రభుత్వము ఈ సంఘమును నియమించినది.

ఈ సంఘమునకు మాజీ మైసూరు దివాను ఎన్. మాధవరావుగారు అధ్యక్షులు. గులాం హైదర్, డా॥ ఆర్. వి. రావు, ఎమ్. శ్రీనివాసరావు, (కార్యదర్శి) కె. వాసుదేవరావు (సంయుక్త కార్యదర్శి) గార్లు సభ్యులు.

ఈ సంఘము మొత్తం 61 సార్లు సమావేశమై కాంగ్రెసు నాయకులతో సహా 200 మంది సాక్షులను పరీక్షించినది. 23 రోజులపాటు జిల్లాల్లో సంచారం చేసింది. తమ ప్రశ్నావళికి 495 సమాధానాలు స్వీకరించింది.

వీరు సమర్పించిన 320 పేజీల సమగ్ర నివేదికలో ప్రధానసూచనలు రెండు ముసాయిదా బిల్లుల రూపంలో ఉన్నాయి. వ్యవసాయభూముల బిల్లు ఒకటి, రైతుభూముల స్థిరీకరణబిల్లు రెండవది.

ఈ బిల్లులలో భూముల అన్యాక్రాంత నిషేధమునకు, సాగుచెయ్యని లేక సరిగా సాగు చెయ్యని భూములను వశపరచుకొనుటకు, విభజించటానికి వీలులేని విస్తీర్ణం గల భూములను కలిపి సహకారవ్యవసాయ సంఘములను స్థాపించుటకు ప్రభుత్వమున కధికారము లివ్వబడినవి.

నివేదిక మొదటిభాగంలో వ్యవసాయ భూములవిషయమై ఇంతవరకూ తీసుకోబడిన చర్యలను వివరించారు. రెండోభాగంలో ప్రస్తుత వ్యవసాయపరిస్థితి, దాని నభివృద్ధిచేయుటకు సూచనలు వివరించబడినవి. గ్రామస్థుల ఋణబాధలు, వారికి పెట్టుబడి సౌకర్యాలను కల్పించటం, వ్యవసాయ ఉత్పత్తి, పశువుల పెంపకం, కుటీరపరిశ్రమలు మొదలైన విషయాలు చర్చించబడినవి. ఇండియాలో వివిధ రాష్ట్రాలలో రైతుశాసనము లెట్లా వున్నవో చర్చించబడినది. భూస్వాములే తమ తమ భూములను దున్నుకోవాలనీ, సాధ్యమైనంతవరకూ, దున్నేవాడికే భూమి చెందివుండాలనీ సూచన చెయ్యబడింది. కర్షకుల ఆదాయమును వృద్ధిచేసే కుటీరపరిశ్రమలను ప్రోత్సహించాలని కూడా సూచింపబడింది.

రుద్రమదేవి

(6-వ పేజీ తరువాయి)

"ఈనాటివరకు వివాహకాలమాదిగా నేను భర్త్రభీష్టమునకు విరుద్ధముగా మనోవాక్కాయముల ప్రవర్తించి యెరుగను. ఈనాడు ఆ మహాసభలో పితృపాదులు చక్రవర్తులు నగు శ్రీగణపతిదేవుల యాజ్ఞకు బద్ధనై యట్లాచరించితిని."

కామసాని: "అంతే కాదు. అది రాజగురువుల యాజ్ఞ! శివాజ్ఞ! నీ విధి నీవు నిర్వర్తించితివి."

రుద్రమ: "చాళుక్యరాజేంద్రులు నా చేసిన యవజ్ఞ సహింతురా?"

కామసాని: "రుద్రమా, నీ వికముందు మహారాజ్ఞివి, రుద్రదేవమహారాజవు! చాళుక్యవీరభద్రేశ్వరుడు నీ పాదపద్మారాధకుడు!"

రుద్రమదేవి ఉలిక్కిపడెను. రుయ్యమ యా మాటలకు ఆపాదమస్తకము కంపించెను.

రుద్రమదేవి రుయ్యమకు కరసంజ్ఞ చేయగా నామె పసుపుపచ్చని చీనాపటమును తూలికయు నందుకొనెను.

రుద్రమ: "అమ్మాయీ, శ్రీ వీరభద్రేశ్వరులకు నీ వొక లేఖ వ్రాయుము! మొదలుపెట్టుము!"

రుయ్యమ విలాసముగా తూలికతో పటముపై చిత్రరచన చేయుచున్నట్లే యక్షరవిన్యాస మొనర్చి చదివి వినిపించెను.

"శ్రీ శ్రీ శ్రీ చాళుక్యవంశవర్ధనులు శ్రీ వీరభద్రేశ్వరులకు ప్రియసేవయ రుయ్యాంబ తెలుపుకొను విజ్ఞాపనము—

ఆపై నేమి వ్రాయను?"

రుద్రాంబ: "మీ పాదదాసి రుద్రాంబ మీ దర్శనభాగ్యమునకై యనుక్షణము నిరీక్షించుచున్నది."

ఆ మాటలు వినుచు కామసాని ముఖము చిట్లించెను. ఆ మాట లంతలో వ్రాసి రుయ్యాంబ రుద్రమకు వినిపించెను. అది విని రుద్రమ చాలు ననగా రుయ్యమ చేవ్రాలు చేసి ముగించి రుద్రమదేవిచేతి కిచ్చెను.

రుద్రమ చేటికను పిలిపించి బంగారుపళ్లెరమును అశోకపుష్పగుచ్ఛములను తెప్పించెను. ఆ తెచ్చిన బంగారుపళ్లెరములో రుద్రమ స్వీయహస్తములతో నా లేఖ యుంచి దాని నశోకపుష్పములతో పూజించి శ్రీ వీరభద్రేశ్వరుల కిచ్చిరమ్మని పంచెను.

చేటిక నటు పంపినవెంటనే యామె పరిచారికలను పలువుర బిలిపించి యొక యున్నతపీఠమును దాని కొక పాదపీఠమును దానియెదుర మొదటి పీఠముకంటె నీచమగు మరియొక పీఠికయు స్థాపింపజేసెను. దానికి దక్షిణపార్శ్వమున పూజాద్రవ్యములు సమకూర్ప నియమించెను.

ఇట్లు సమస్తము భర్తృపూజకు సన్నాహ మొనర్చి రుద్రమ భర్తరాకకై ఉత్కంఠతో నిరీక్షించుచుండెను. కామసాని మూతి బిగించి ఏమియు మాట్లాడకుండెను. రుయ్యమ దీనదృక్కులతో రుద్రమను విలోకించుచుండెను.

కామసానికి వీరభద్రేశ్వరుడు వచ్చి శ్రీరుద్రదేవమహారాజు చేయు పాదపూజ యందుకొనునేమో యని భయము! రుయ్యమ కాతడు రాడని నిశ్చయభావముతో కూడిన యాందోళనము:

అనగు సవ్వడి యేమాత్ర మైనను సంభ్రమముతో రుద్రాంబ తల యెత్తుచు లేవనకించుచుండెను. ఆమె పెంపుడునెమలి ఉపవనమున క్రేంకారము చేయుచుండ రుద్రమ పరధ్యానముతో ఒకటి రెండుమారులు ఉలిక్కిపడెను. రామచిలుక పంజరములో, "శివా!—శివా!" యని యరువజొచ్చెను.

రెండు గడియలకు చేటిక తిరిగివచ్చెను. కాని యా రెండుగడియలును ఆ మువ్వురకు రెండు నెలలుగా తోచెను.

అట్లు తిరిగివచ్చిన చేటికయావనములోని దైన్యము గాంచి రుద్రమదేవి గాంభీర్యము వహించెను. చేటిక నమస్కరించి ఇప్పుడు మొగలిపూవులతో నిండి యున్న యా బంగారుపళ్లెరమును రుద్రాంబికముం దుంచెను.

రుద్రమయనుజ్ఞతో రుయ్యమ యందులో నున్న పటపత్రము తీసి ఇట్లని చదివెను.

"అమ్మాయీ, విజయదశమిలోపల దివాణములో అందించవలసిన లెక్కలు సిద్ధముచేయుచు తీరిక లేకున్నాను. విజయదశమినాడు పేరోలగమున శ్రీరుద్రదేవ మహారాజులను వారి పాదపద్మారాధకుడు శ్రీవీరభద్రేశ్వరుడు దర్శించి విధేయకందనాదికము లర్పింపగల డని మీ అమ్మగారికి మనవిచేయుము!"

ఆ ఉత్తరము వినుచునే శ్రీరుద్రమదేవి శరీరమంతయు బిగించి నిలువున గూర్చుండెను.

"రుయ్యాంబా, శ్రీ రుద్రదేవమహారాజుల భావివిభులు శ్రీ వీరభద్రేశ్వరులు చక్కగా సూచించినారు. భావిమహారాజుల సంకల్పములకు భంగ మొదవరాదు. వెంటనే మేము చిత్రించిన శ్రీ వీరభద్రేశ్వరుల ప్రతికృతియా యున్నతాసనముపై పెట్టు తల్లీ!"

రుయ్యాంబ తల్లియాజ్ఞ పాలించెను. అంతట రుద్రమదేవి శయ్యాసనమునుండి లేచి శౌచ మొనరించుకొని యా యున్నతాసనముముం దున్న భద్రపీఠముపై నధివసించి యచ్చట సేకరింపబడియున్న పూజాద్రవ్యములతో నా పటచిత్రమునందధ్యస్తుడైయున్న శ్రీ వీరభద్రస్వామిని పూజించెను.

అది యంతయు సంభ్రమాశ్చర్యములతో మౌనమువహించి చూచుచున్న కామసానికి ఆ పటచిత్రములో శ్రీ చాళుక్యవీరభద్రేశ్వరుని యాకారలక్షణము లేవియు కనుపించలేదు. శ్రీ శివావజ్ఞాదూషిత దక్షాధ్వరధ్వంసనోద్యతభయంకర వీరభద్రాకార మే యం దామెకు ద్యోతమయ్యెను.

శ్రీరుద్రమదేవియాజ్ఞచే నామె చెప్పిన చాళుక్యవీరభద్రేశ్వరప్రతికృతి కాక యామెయే చిత్రించిన వీరభద్రావతారచిత్రము తెచ్చిన రుయ్యమ కందేమియు వింత తోచలేదు. రుయ్యమసవ్యసూచి యామె యా పట ముంచినంతనే గ్రహించిన రుద్రమదేవికి రుయ్యముపై వాత్సల్యముతోపాటు గౌరవ మాకస్మికముగా నినుమడించెను.

లేఖలు

కవులుదార్ల రక్ష

అయ్యా,

వరదముంపుదెబ్బ తినియున్న రైతాంగం కోలుకోటానికి పలువురు పలుసూచనలు చేశారు. యిళ్లు వాకిళ్లు పోగొట్టుకొని, పంటలు పూర్తిగ దెబ్బతిని యున్న రైతాంగానికి, ఈ వరదబాధితుల సహాయకసంఘాలుద్వారా ప్రభుత్వము ద్వారా జరిగే సహాయం చాల పరిమితంగానే ఉంటుందనే విషయం సర్వవిదితము. ఈ వేళ గ్రామాలలో ఎక్కువ సహాయము పేద రైతాంగానికి, కవులుదార్లకు జరగవలసి ఉంది. ఎకరం, రెండెకరాలు కల్గిన పేదరైతాంగం ఆపంట దెబ్బ తినడముతో నిలువునా కూలి పోతున్నాడు. ఇక కవులుదార్ల సంగతి చెప్ప నక్కరలేదు. విపరీతమైన రేట్లకు కవులు వ్రాశారు. అనేక చోట్ల ముందే చెల్లించుకున్నారు. వరదవచ్చినా వానవచ్చినా దైవిక, రాజకీయ కారణాలతో నిమిత్తం లేకుండా చెల్లించగలవారము అని కవులు కదపాలు వ్రాసి యున్నారు. ఎకరానికి రు. 200 వరకు కవుల్లున్నవి. పల్లపు ప్రాంతంలో ఎకరానికి సగటు పంట 15, లేక 16 అయివుంటె 13 బస్తాల వరకు మగతాలు పెంచివేయబడినాయి. కాలమానం సరిగా ఉన్నప్పుడే కవులుదార్లు ఈ హెచ్చు మగతాలు చెల్లించలేక దివాలాలు తీస్తున్నారు. ఉన్న చోడు కొంప్రే అమ్ముకుంటున్నారు. అటువంటి పరిస్థితుల్లో ఈ వరద దెబ్బలో ఇక సర్వనాశనం అగుట తప్ప వేరు మార్గంకనపడటం లేదు. పంటలు పోయినా కవులు. మగతాలు చెల్లించాలి. గ్రామాల్లో ఎక్కువ సంఖ్యలో నున్న ఈ కవులుదార్లు ఎక్కడనుంచి తీసుకువచ్చి చెల్లిస్తారు? కొంపా, గోడీ, అమ్ముకోవాలి. లేదా పెళ్లాం మెడలో పుస్తె అమ్ముకొని మగతాలు చెల్లించాలి. పెట్టుబడులుకోసం ఋణాలు గావించాలి. అవి ఎక్కడనుండి తెచ్చి తీరుస్తారు? ఈ రెండు బాధ్యతలు అటుంచి ఆలుబిడ్డల్ని బ్రదికించుకోవడం ఎల్లాగ? వరదదెబ్బతిన్న గ్రామాల్లో భూస్వాములకు, ధనిక, మధ్యతరగతి రైతులకు ఒక సంవత్సరంపంటలు దెబ్బతిన్నా నిలబడగల్గే స్తోమతుఉంది. కాని పేద రైతులకు, ముఖ్యంగా కవులుదార్లకు ఆస్తోమతు ఏది? అందుచేత వరదముంపు దెబ్బతగిలిన అధిక సంఖ్యాకులైన పేదరైతులకు కవులుదార్లకు కల్గిన ఈ ఘోరవిపత్తును పరిష్కరించనిది ప్రభుత్వం వరదబాధానివారణ చేసినట్టేకాదు. అందుకు ప్రభుత్వం ఈ రెండు కర్తవ్యాలు నిర్వహించాలి.

1. వరదదెబ్బతిన్న గ్రామాలన్నిటికి పూర్తి రెమిషను యివ్వాలి.

(2) వరదదెబ్బతిని పంటలు పోయిన కవులుదార్ల నుండి ఈ సంవత్సరానికి మగతాలు, కాట్లు వసూలు చేయరా దని ముందే వసూలు చేస్తే సగం పరిహారంగా యివ్వా లని ప్రభుత్వ ఉత్తరువు ప్రకటించాలి.

ఈ విధంగా వెంటనే ప్రకటించి కవులుదార్లకు రక్షణ కలుగజేయనిదే వేల గ్రామాల్లో లక్షలకొలది కుటుంబాలు ఇళ్లు, వాకిళ్లు అమ్ముకొని నశించిపోవలసిన పరిస్థితి ఏర్పడవలసి వస్తుంది.

ఇట్లు
దుగ్గిరాల గోపాలకృష్ణ.

పాత క్రొత్త స్కీములు హిందుస్తానీ

మహాశయా,

గతసంవత్సరారంభమున అన్ని సెకండరీ స్కూళ్లలోను నూతనవిద్యావిధానము అమల్లు జరుపబడెను. కాని, అదిసక్రమముగ జరుగుచుండగా, మద్రాసులోని కొంతమంది పలుకుబడిగల హెడ్‌మాష్టర్లు అధికారులను కలుసుకొని హిందూస్తానీ నాల్గవఫారమునుంచి ద్వితీయభాషగ ఆరంభించుటవల్ల విద్యార్థులకు చాల యిబ్బందిగ నున్నదనియు, దీనివల్ల వారు మూడు భాషలు నేర్చుకొనవలసివచ్చుచున్నదనియు తెలియజేసిరి. కాని వాస్తవమునకు వారు మూడు భాషలు నేర్చుకొనవలసిన అవసరము లేదు. ద్వితీయభాషగ విద్యార్థులు తమయిష్టప్రకారము హిందూస్తానీ లేదా విద్యాంసుడు తెలుగును తీసికొనవచ్చును. విద్యార్థులు విద్యాంసుడు తెలుగును తీసికొన్నప్పుడు మూడుభాషలు నేర్చుకొనవలెనను యిబ్బంది ఎక్కడ వున్నది? అందుమీదట హెడ్‌మాష్టర్లు తమ యిష్టప్రకారము 2వ ఫారము విద్యార్థులు 4వ ఫారములోనికి వచ్చువరకు అనగా రెండేండ్ల సంధికాలములో 4వ ఫారమునుండి క్రొత్తస్కీమును గాని, 1929 నాటి పాత స్కీమునుగాని అమలు జరుపవచ్చునని గవర్నమెంటువారు ఉత్తరవులను జారీచేసియున్నారు. దానిననుసరించి విద్యార్థులయొక్కగాని, హిందుస్తానీ పండితులయొక్కగాని కోరికలను లెక్కచేయక తమ యిష్టప్రకారము పాత క్రొత్త స్కీములను స్కూళ్లలో అమలుజరుపుచున్నారు. ఇట్లు పాతస్కీము అమలు జరుపబడుచున్న స్కూళ్లలో హిందుస్తానీపండితులకు చాల అన్యాయముజరిగినది ఈమధ్యనే ప్రభుత్వమువారు సంతృప్తికరముగ జారీచేసిన స్కేళ్లను పొందుటకు చాలవరకు వీలులేకుండుటచేత, అట్టి స్కూళ్లలో పనిచేయు హిందూస్తానీపండితులకు తీరనినష్టము, నిరాశజనించినది.

ఇది యిట్లుండగా పాతస్కీము అమలు జరుపబడిన స్కూళ్లలోనైనను 4వ ఫారమునకు C. No. 2744 c/47 dated 31-1-47 g. o. ప్రకారము ఒక్కొక్క సెక్షనుకు వారమునకు మూడుపీరియడ్లచొప్పున హిందుస్తానీబోధనకు అవకాశము కల్పించవలసినదిగ నున్నది. అట్టి సందర్భములో అది పరీక్షావిషయము గాక పోయినను విద్యార్థులు తమ యిష్టప్రకారము హిందుస్తానీ నేర్చుకొను అవకాశ మున్నది. చాల స్కూళ్లలో పాతస్కీముప్రకారమైనను అట్టి అవకాశము గల్పించుటకు హెడ్‌మాష్టరు అంగీకరించుటలేదని చాలమంది సోదర హిందుస్తానీ పండితులవద్దనుంచి నాకు ఉత్తరములు వస్తున్నవి. అట్లు తమ కున్న అధికారమును ఉపయోగించి విద్యార్థులకు హిందుస్తానీపండితులకు తీరని నష్టము, నిరాశ కలుగజేయకుండవలెందులకు హెడ్‌మాష్టర్లను కోరుచున్నాను.

ఇట్టి సందర్భములలో దక్షిణభారతహిందుస్తానీ ప్రచారసభ తమ ప్రచారమునకే ఎక్కువ ప్రాముఖ్యత యిచ్చుకుంటూ ప్రచారమునకు ముఖ్య స్తంభములైన హిందుస్తానీపండితుల యిబ్బందులలో జోక్యము కలుగజేసుకొనకుండుట చాల శోచనీయము.

నిడదవోలు ప్రభాకరరావు

వార్తా చిత్రాలు




వెల్లస్లీ కళాశాలాధికారులు పండిట్ నెహ్రూకు కళాశాలకు సంబంధించిన వివిధభవనాలను చూపుతున్నారు. పండిట్ నెహ్రూ ఎడమనైపున ఉన్నవారు కళాశాలాధ్యక్షురాలు మార్గరెట్ క్లాప్.



కెనడాలోని భారత హైకమీషనర్ కృపలానీ, పండిట్ నెహ్రూ గౌరవార్థం చేసిన విందుకు హాజరైన శ్రీమతి విజయలక్ష్మి పండిట్, కెనడా మాజీప్రధాని మెకంజీ కింగ్, శ్రీమతి ఇందిరాగాంధి. —ఫొటో ఐ. ఎన్. పి.




చికాగో నగరం మేయరు మార్టిను కెన్నల్లీ గారి స్వాగతం



సమితి అధ్యక్షుని కార్యాలయంలో పండిట్ నెహ్రూ : వరుసగా సర్ బి. యన్. రావు, గిరిజాశంకర్ బాజ్పాయ్, ఇందిరాగాంధి, పండిట్ నెహ్రూ, అధ్యక్షుడు జనరల్ రోమ్యులో శ్రీమతి విజయలక్ష్మిపండిట్ కార్యదర్శి ట్రిగ్వేలీ.



ఇల్లినాయి యందు పరిపాలం పనివారందరిని తనతో విందుకు పిలువ నెహ్రూగారు ఘంట మ్రోగించుచున్నారు.



ఫౌలర్ మెక్ కార్మిక్, హార్వెస్టర్ కంపెనీ అధ్యక్షునితో 'ఫార్మాల్ కబ్' ట్రాక్టర్లను పరిశీలిస్తున్న ప్రధాని పండిట్ నెహ్రూ.

Regd. M. No. 4479

Edited, Printed & Published by S. Sambhu Prasad, at the Andhra Patrika Press, No. 7 Thambu Chetty St., G. T. Madrrs.